జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఏడ్వర్టైజ్మెంట్ ఇంఛార్జిలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528

రంగారెడ్డి | సోమవారం 1 సెప్టెంబర్ 2025 | సంపుటి : 15 | సంచిక : 263 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్నిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com



## ఆర్థిక ఇబ్బందులు తప్పవా?

- కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించాల్సిన నిధులు ఇప్పటికే తెచ్చేసుకున్నారు
- తొలి ఏడాదిలోనే అవసరమైన నిధులకు సమీకరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించింది.
- చంద్రబాబు అడిగినంత మేరకు ఆర్థిక సాయం చేయడమే కాకుండా అవసరమైన రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది

విజయవాడ

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు కేంద్ర ప్రభుత్వం నుంచి సాధించాల్సిన నిధులు ఇప్పటికే తెచ్చేసుకున్నారు. తొలి ఏడాదిలోనే అవసరమైన నిధులకు సమీకరణకు కేంద్ర ప్రభుత్వం సహకరించింది. అయితే రానున్న కాలంలో చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనకు వెళ్లినా అనుకున్న స్థాయిలో నిధులు వచ్చే అవకాశాలు లేవన్నది ఉన్నతాధికారుల నుంచి అందుతున్న సమాచారం. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నాయకత్వం ఫోకస్ అంతా బీహార్ పైనే ఉంది. బీహార్ లోనూ, వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడుపైన ఎక్కువ దృష్టి పెట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీహార్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాలకు మాత్రమే ప్రయోజనం చేకూర్చేలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ కు ఇప్పట్లో ఎన్నికలు లేకపోవడంతో పాటు ఇప్పటికే చంద్రబాబు అడిగినంత మేరకు ఆర్థిక - మిగతా3లో

## స్టీల్ ప్లాంట్‌పై కూటమి నేతల దొంగ బుద్ధి బట్టబయలు

- వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.
- విశాఖ ఉక్కు అందరిది..స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం
- 'స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం
- స్టీల్ ప్లాంట్ పోరాటం కోసం ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తాము
- పోరాటంలో ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లా నేతల అభిప్రాయాలను కూడా తీసుకుంటాము

విశాఖపట్నం

విశాఖ స్టీల్‌ప్లాంట్ విషయమై సీఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్.. ప్రధాని మోదీతో ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ. వైజాగ్ వచ్చి స్టీల్ ప్లాంట్ కోసం పవన్ కళ్యాణ్ ఎందుకు మాట్లాడలేదన్నారు. విశాఖ ఉక్కు అందరిది..స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం అని చెప్పుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ తాజాగా మీడియాతో మాట్లాడుతూ.. 'స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు మొదటి నుంచి వైఎస్సార్‌సీపీ వ్యతిరేకం. - మిగతా3లో





## భారత్‌ను టార్గెట్ చేయండి.. యూరప్ దేశాలను కోరిన అమెరికా..!

- ప్రస్తుతం భారత దిగుమతులపై అమెరికాలో 50 శాతం టారిఫ్‌లు అమలులో ఉన్నాయి.
- తమలాగే భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని యూరప్ దేశాలను వైట్‌హౌస్ కోరినట్లు సమాచారం.
- మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే అమెరికా మాదిరిగానే భారత్‌పై సుంకాలను పెంచాలని ట్రంప్

## జెండా కర్రే ఆయుధం

- ప్రజాస్వామ్యంలో హింస పనిచేయదు
- గుండెల నుంచి వచ్చే మాటే తూటా కావాలి
- జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జనసైనికులకు పిలుపు
- అలా చేస్తే కచ్చితంగా మార్పు వస్తుంది
- పార్టీ సభ్యత్వ నమోదు కోసం దసరా తర్వాత త్రిశూల్ పేరుతో కార్యక్రమం



విశాఖ

ఆంధ్రప్రదేశ్‌కు స్థిరత్వం కావాలని, కూటమి సర్కారు బలంగా ఉండాలని కోరుకుంటున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. ఏమైనా తప్పులు చేస్తే ప్రజలు, రాష్ట్రం నష్టపోతుందని హెచ్చరించారు. మళ్లీ అరాచక పాలన, చీకటి రోజులు వస్తాయని అన్నారు. జనసేన సిద్ధాంత ఆధారిత పార్టీ అని పవన్ కళ్యాణ్ అన్నారు. అందరిలాగే తాను కూడా కష్టాల కొలిమి నుంచే వచ్చానని తెలిపారు. విశాఖ వేదికగా విశాఖ మున్సిపల్ స్టేడియంలో 'సేనతో సేనాని' పేరుతో మూడు రోజులపాటు జరిగిన జనసేన పార్టీ విస్తృత స్థాయి సమావేశాలు ముగిశాయి. జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఉద్వేగభరిత ప్రసంగం చేశారు. నాయకులనే వారు కింద నుంచే రావాలని సూచించారు. తాము ప్రజాక్షేమం కోరుకుంటున్నాయని, భయపడేది ఉండదు పోరాటాలే ఉంటాయని అన్నారు. పేరంటాలకు వెళ్లాలి, అదే సమయంలో పోరాటాలు చేయాలని మహిళ కార్యకర్తలకు సూచించారు. వేదికపైన ఉన్న నాయకులకు కార్యకర్తల విలువ తెలియాలనే - మిగతా3లో



## 'వీధికుక్కల కేసుతో నేనిప్పుడు వరల్డ్ ఫేమస్'

- జస్టిస్ విక్రమ్ నాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు
- చిన్న చిన్న పనులు కారణంగా నేను న్యాయవాద వర్గాల్లో ప్రసిద్ధి చెందాను
- కానీ వీధికక్కల కేసు కారణంగా ఈ దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మొత్తం పౌర సమాజంలో నాకు గుర్తింపు ఇచ్చినందుకు వీధి కుక్కలకు కూడా నేను కృతజ్ఞుడను.

## తెదేపాలో ఉన్నందుకు గర్విస్తున్నా



- హెంశాఖ మంత్రి వంగలపూడి అనిత
- రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి కోటి సభ్యత్వాలు ఉన్నాయి
- దేశంలోని ఏ ప్రాంతీయ పార్టీకి ఇంత అధిక సంఖ్యలో సభ్యత్వాలు లేవుత
- పార్టీలో కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుంది

అనకాపల్లి

తెలుగుదేశం పార్టీలో ఉన్నందుకు తాను గర్వపడుతున్నానని హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. అనకాపల్లిలో మృతి చెందిన ఇద్దరు పార్టీ కార్యకర్తల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షలు చొప్పున ఇన్సూరెన్స్ నగదు చెక్కును ఆమె అందజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి కోటి సభ్యత్వాలు ఉన్నాయని తెలిపారు. దేశంలోని ఏ ప్రాంతీయ పార్టీకి ఇంత అధిక సంఖ్యలో సభ్యత్వాలు లేవన్నారు. పార్టీలో కార్యకర్తల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. క్రమశిక్షణ గల తెలుగుదేశం పార్టీలో ఉండటం తనకు ఎంతో గర్వకారణంగా ఉందని వివరించారు. - మిగతా3లో



## డ్రాగన్, ఏనుగు కలిసి ఆడాలి

- ప్రధాని మోదీతో ద్వైపాక్షిక భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్
- భారత్-చైనా దేశాలు స్నేహంగా ఉండటం సరైన నిర్ణయం
- ప్రధాని మోదీని మరోసారి కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉంది
- ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలు..
- గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్యులు

# డ్రాగన్, ఏనుగు కలిసి ఆడాలి

**న్యూఢిల్లీ:** షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తో ప్రధాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ.. భారత్-చైనా దేశాలు స్నేహంగా ఉండటం సరైన నిర్ణయమని అన్నారు. ప్రధాని మోదీని మరోసారి కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని జిన్‌పింగ్ చెప్పారు. గత ఏడాది కజన్‌లో ఇరువురి నేతల మధ్య జరిగిన భేటీని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలు.. గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్యులని అన్నారు. ఇరు దేశాల్లోని ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సంబంధాల పునరుద్ధరణ బాధ్యతను తాము భుజాన వేసుకున్నామని చెప్పారు. పొరుగు దేశాలుగా తమ మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఇరు దేశాల విజయాలకు దోహదపడే అంశాల్లో డ్రాగన్, ఏనుగు కలిసి రావడం సరైన ఎంపిక అన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షికంగా స్థిర, దృఢమైన సంబంధాలు దీర్ఘకాలం కొనసాగేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రపంచంలో శాంతి, శ్రేయస్సు కోసం భారత్-చైనాలు బాధ్యత తీసుకోవాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.



**నేరుగా విమానాలు నుంచి వాణిజ్యం వరకూ..**
**బలపడుతున్న భారత్-చైనా బంధం**

శాశ్వత శత్రువులు-శాశ్వత మిత్రులు అంటూ ఎవరూ ఉండరు, దీర్ఘకాలిక ప్రయోజనాలే ఉంటాయి, భారతదేశానికి ఎవరూ శత్రువు కాదు.. అంటూ ప్రధాని మోదీ చైనా పర్యటన ఉద్దేశాన్ని భారత్ ముందుగానే స్పష్టం చేసింది. షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సు కోసం చైనాలో పర్యటిస్తున్న మోదీ.. ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో భేటీ అయ్యారు. ఇరు దేశాల మధ్య సంబంధాలపై ఉభయులూ చర్చించారు. భారత్-చైనా స్నేహంగా ఉండటం సరైన నిర్ణయమని, ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలు గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమని, ఇరుదేశాల ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సంబంధాల పునరుద్ధరణ బాధ్యత తాము తీసుకున్నామని జిన్‌పింగ్ చెప్పారు. పొరుగుదేశాలు మధ్య స్నేహపూర్వక సంబంధాలను ఆకాంక్షించారు. డ్రాగ్రెన్, ఏనుగు కలిసి రావడం సరైన ఎంపిక అన్నారు. మోదీ సైతం చైనాతో సానుకూల సంబంధాలకు భారత్ కట్టుబడి ఉందని ప్రకటించారు. ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలలో నిలకడైన పురోగతి సాధిస్తుండటాన్ని అగ్రనేతలు ఇరువురూ స్వాగతించారు. భారత్‌పై భారీ సుంకాలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడుతున్న నేపథ్యంలో చైనా-భారత్ మధ్య సంబంధాలు సానుకూల దిశలో సాగుతుండటంపై ప్రపంచ దేశాలు ఎంతో ఆసక్తి చూపుతున్నాయి.

**మోదీ-జిన్‌పింగ్ సమావేశంలో ముఖ్యాంశాలు**

-బ్రిక్స్ సదస్సు కోసం పది నెలల క్రితం తాము సమావేశమైన అనంతరం ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాల్లో నిలకడైన పురోగతి సాధించడాన్ని ప్రధాని మోదీ, అధ్యక్షుడు జిన్‌పింగ్ స్వాగతించారు. తాము భాగస్వాములమని, శత్రువులం కాదని, తమ మధ్య విభేదాలు గొడవలుగా మారకూడదని అభిలషించారు.

-ఇరు దేశాల మధ్య సయోధ్యను మరింత ముందుకు తీసుకువెళ్లేందుకు రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నట్టు మోదీ ప్రకటించారు. అయితే నిర్దిష్టమైన తేదీని వెల్లడించలేదు. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో ఈ విమాన సర్వీసులను రద్దు చేశారు. దీంతో ప్రయాణికులు హాంకాంగ్, సింగపూర్ మీదుగా రాకపోకలు సాగించారు.

-కైలాశ్ మానససరోవర్ యాత్ర తిరిగి ప్రారంభం కావడాన్ని, టూరిస్ట్ వీసాల అంశాన్ని ప్రధాని మోదీ ప్రస్తావించారు. మౌంట్ కైలాశ్, మానసరోవర్ యాత్రను ఈ ఏడాది ప్రారంభంలో ఇండియా-చైనా తిరిగి ప్రారంభించాయి. గత నెలలో చైనా పౌరులకు టూరిస్టు వీసాల జారీని భారత్ ప్రారంభించింది. 2020లోనే కరోనా మహమ్మారి సమయంలోనే టూరిస్టు వీసాల జారీని ఇరుదేశాలు నిలిపివేశాయి.

-వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని, సంబంధాలను మూడో దేశం కోణం నుంచి ఇరుదేశాలు చూడరాదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఫెయిర్ ట్రేడ్, ద్వైపాక్షిక, ప్రాంతీయ, గ్లోబల్ అంశాలు, టెర్రరిజం వంటి సవాళ్లపై కామన్ గ్రౌండ్‌ను విస్తరించుకోవాల్సిన అవసరం ఉందని సంయుక్త ప్రకటనలో ఉభయనేతలు నిశ్చితాభిప్రాయం వ్యక్తం చేశారు.

-2020 గల్వాన్ ఘర్షణల అనంతరం ఇరు దేశాల సంబంధాలు క్షీణించాయి. కానీ ఉభయులూ విభేదాలు వీడి గత ఏడాది రష్యాలోని కజాన్‌లో సమావేశం కావడంతో సయోధ్యకు మార్గం సుగమమైంది. సైనిక బలగాల ఉపసంహరణతో సరిహద్దు ప్రాంతాల్లో శాంతి, సుస్థిరతలు నెలకొన్నాయని మోదీ, జిన్‌పింగ్ పేర్కొన్నారు.

-ఇండియా, చైనా మిత్రులుగా, మంచి ఇరుగుపొరుగుగా ఉండాల్సిన అవసరాన్ని జిన్‌పింగ్ నొక్కిచెప్పారు. గ్లోబల్ సౌత్‌లో రెండూ కీలక సభ్యులని, ఇరుదేశాల ప్రజల ప్రయోజనాల కోసం పరస్పరం కలిసి పనిచేయాల్సిన బాధ్యత తమ భుజస్కంధాలపై ఉందని అన్నారు.

-సరిహద్దు అంశాలను ఇరుదేశాల సంబంధాలకు ముడిపెట్టకుండా శాంతి, సుస్థిరత కోసం పాటుపడాలని జిన్‌పింగ్ అభిలషించారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్కోణం నుంచి చూడాలని, ద్వైపాక్షిక సంబంధాలు ఆరోగ్యకరంగా, సుస్థిర అభివృద్ధి దిశగా సాగాలని సూచించారు.

-చైనాతో సంబంధాలు మెరుగుపడటం అధిక జనాభా ఉన్న దేశాలుగా ఇరుదేశాలకు దోహదకారి అవుతుంది. చైనా కంపెనీల ఎదుగుదలకు అవకాశం ఇవ్వడం ద్వారా ఇండియన్ ఈవీ సెక్టార్‌కు ప్రయోజనం చేకూరుతుంది. భారతీయ మార్కెట్ల ద్వారా చైనా ఎకానమీ కూడా బలపడుతుంది. -సరిహద్దు వాణిజ్యాన్ని పునరుద్ధరించాలని ఈ నెల ప్రారంభంలో జరిగిన ఇరుదేశాల విదేశాంగ మంత్రుల స్థాయి సమావేశంలో అంగీకారం కుదిరింది. ప్రస్తుతం ఉన్న టారిఫ్ అనిశ్చితుల సమయంలో ఈ చర్య ఉభయులకు ప్రయోజనకారిగా ఉంటుందని భావిస్తున్నారు. అరుదైన ఖనిజాలు, ఎరువులు, టన్నెల్ బోరింగ్ మెషీన్ల వంటి అంశాల్లో భారత్ అవసరాలకు అనుగుణంగా సహకరించేందుకు చైనా హామీ ఇచ్చింది.

-ట్రంప్ సుంకాల బాదుడుతో భారత్-అమెరికా మధ్య సంబంధాలు ఇబ్బందుల్లో పడిన తరుణంలో మోదీ-జిన్‌పింగ్ మధ్య సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. బీజింగ్‌కు న్యూఢిల్లీ చేరువవుతుందడంతో అమెరిక విదేశాంగ విధానాన్ని ఇరుకున పెట్టే అవకాశాలున్నట్టు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రతిభా సేతు: 'మన్ కీ బాత్'లో 'యూపీఎస్‌సీ' పోర్టల్‌కు ప్రధాని కితాబు

**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన నెలవారీ రేడియో ప్రసంగం 'మన్ కీ బాత్' 125వ ఎపిసోడ్‌లో యూపీఎస్‌సీ పోర్టల్ 'ప్రతిభా సేతు'ను ప్రశంసించారు, యూపీఎస్‌సీ అభ్యర్థులకు ఇది ఆశాదీపం అని అభివర్ణించారు. వేలాది మంది యూపీఎస్‌సీ అభ్యర్థులకు సహాయపడుతున్న 'ప్రతిభా సేతు' చొరవను ప్రతిభకు వారధిగా మోదీ పేర్కొన్నారు. యూపీఎస్‌సీ పరీక్షలలోని అన్ని దశలలో ఉత్తీర్ణులై, తుది మెరిట్ జాబితాలో చోటు దక్కించుకోలేకపోయిన అభ్యర్థులకు 'ప్రతిభా సేతు' తగిన వేదిక అని అన్నారు. ఈ పోర్టల్ యూపీఎస్‌సీలోని వివిధ పరీక్షల అన్ని దశలలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల డేటాను స్టోర్ చేస్తుందన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల యజమాన్యాలు ప్రతిభా సేతు పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. అప్పుడు వారు అభ్యర్థుల డేటాబేస్‌ను యాక్సెస్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఇది అభ్యర్థుల నియామకానికి ఉపయోగపడుతుంది.



## 'డేట్'కు పిలిచి.. రూ. 9 లక్షల బిల్లు ఎగ్గొట్టి..


**హాంకాంగ్:** హాంకాంగ్‌లో విచిత్ర ఉదంతం వెలుగు చూసింది. రూ. 9 లక్షల డిన్నర్ బిల్లుతో పాటు'డేట్'ను కూడా అక్కడే వదిలి వెళ్లిన హాంకాంగ్ 'లాయర్'ను పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హాంకాంగ్‌లో న్యాయవాదిగా చలామణీ అవుతూ, లగ్జరీ డిన్నర్‌కు భారీగా ఆర్డర్ ఇచ్చి, ఆ మొత్తాన్ని ఎగ్గొట్టడమే కాకుండా, డేట్‌ను కూడా అక్కడే వదిలి వెళ్లిన 23 ఏళ్ల యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. అతనితో డేట్‌కు వచ్చిన యువతి అతని పేరు వాంగ్ అని మాత్రమే తెలుసని పోలీసులకు వివరించింది. తనను ఒక విలాసవంతమైన రెస్టారెంట్‌లో వదిలివేసి, 80 వేల అమెరికన్ డాలర్లు (రూ.9 లక్షలు) చెల్లించకుండా వెళ్లిపోయాడని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఉదంతంలో పోలీసులు వాంగ్‌ను ట్సుంగ్ క్వాన్ ఓలో అదుపులోకి తీసుకున్నారు. ఘటన సమయంలో అతను ధరించినట్లు భావిస్తున్న దుస్తులను కూడా స్వాధీనం చేసుకున్నారు. 'ది స్టాండర్డ్' తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు సెంట్రల్ డిస్ట్రిక్ట్ క్రైమ్ యూనిట్ దర్యాప్తులో ఉన్నాడు. సెంట్రల్‌లోని మాండరిన్ ఓరియంటల్ హోటల్‌లో విందు కోసం ఒ?క యువతిని డేట్ కు వాంగ్ ఆహ్వానించాడు. ఆ సమయంలో వాంగ్ ఆమెకు తాను న్యాయవాదినని పరిచయం చేసుకున్నాడు. డిన్నర్ సమయంలో వారు అత్యంత ఖరీదైన షాంపైన్ బాటిల్‌ను ఆర్డర్ చేశారు. మొత్తం బిల్లు రూ. 9లక్షలకు పైగానే వచ్చింది.



అయితే, ఆ బిల్లు చెల్లించే సమయానికి 'న్యాయవాది' వాష్‌రూమ్‌కు వెళ్లాలని 'డేట్'కు చెప్పి, అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. ఆమె ఫోనులో అతన్ని సంప్రదించేందుకు ప్రయత్నించినా, ఫలితం లేకపోయింది. దీంతో ఆమె ఈ విషయాన్ని పోలీసులకు తెలిపింది. తరువాత ఆమె స్నేహితుల సహాయం కోరగా, వారు డిన్నర్ బిల్లు చెల్లించారు. 'డేట్' బాధితురాలి ఫిర్యాదు దరిమిలా పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి, విచారిస్తున్నారు.

## భారత్‌ను టార్గెట్ చేయండి.. యూరప్ దేశాలను కోరిన అమెరికా!

రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని బూచిగా చూపి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపారు. ప్రస్తుతం భారత దిగుమతులపై అమెరికాలో 50 శాతం టారిఫ్‌లు అమలులో ఉన్నాయి. ఈ క్రమంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. తమలాగే భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని యూరప్ దేశాలను వైట్‌హౌస్ కోరినట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే అమెరికా మాదిరిగానే భారత్‌పై సుంకాలను పెంచాలని ట్రంప్ యంత్రాంగం యూరప్ దేశాలను కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆంక్షలు విధించడంతోపాటు భారత్ నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును నిలిపివేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంపై చర్చించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇటీవల ట్రంప్ భేటీ అయ్యారు. యుద్ధం ముగించేందుకు అగ్రరాజ్యాధిపతి తీసుకుంటున్న చర్యలకు కొంత మంది యూరోపియన్ నాయకులు మద్దతు పలికినట్లు సమాచారం. అయితే భారత్‌కు వ్యతిరేకంగా ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై యూరోపియన్ దేశాలు మౌనంగా ఉన్నాయి. సుంకాలు విధించడాన్ని సమర్థించలేదు. అలా అని తప్పుబట్టలేదు. ఈ క్రమంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని ట్రంప్ పరిపాలనాధికారులు కోరడం గమనించాల్సిన విషయం



## భారత్ లాంటి దేశాన్ని చిన్నచూపు చూస్తారా?'



భారత ప్రధాని నరేంద్ర మోదీ.. ప్రస్తుతం చైనా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. ఇరు దేశాల మధ్య ఫుల్ స్టాప్ పడ్డ పలు ద్వైపాక్షిక ఒప్పందాల్లో భాగంగా మోదీ.. చైనాలో అడుగుపెట్టారు. ఎప్పట్నుంచో భారత్‌తో సంబంధాల కోసం ఎదురుచూస్తున్న చైనా కూడా మోదీ పర్యటనకు ఘన స్వాగతం పలికింది. ఇదిలా ఉంచితే, భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతూ సుంకాలను 50 శాతం పెంచేసిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై చైనాకు చెందిన అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకుడు ఎయిమర్ టాన్‌జెన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రపంచ శాంతి కోసం పాటుపడుతున్నానని చెప్పుకుంటున్న ట్రంప్‌కు కనీసం బుర్ర ఉంటే భారత్‌పై ఆ విధంగా సుంకాలు విధించే వాడు కాదంటూ మండిపడ్డారు. ప్రపంచ మార్కెట్ పరంగా చూసినా, కార్మికుల పరంగా చూసినా భారత్ అతి పెద్దదని, అటువంటి దేశంపై ట్రంప్ విజ్ఞత లేకుండా వ్యవహరించి తప్పు చేశాడన్నారు . ట్రంప్ తన బెదిరింపులతో లొంగదీసుకోవాలనుకోవడం, అందులోనూ భారత్ లాంటి దేశంపై సుంకాలతో కాలు దువ్వడం వంటిది అమెరికాకే మంచిది కాదన్నారు. ప్రస్తుతం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్-మోదీల మధ్య జరుగుతున్న చర్చలతో మరో కొత్త శకం ఆరంభం కానుందన్నారు. 'అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. భారత్‌ను బలవంతంగా లొంగిపోయేలా చేయాలనుకున్నారు. రష్యా ఆయిల్ కొంటే సుంకాలు విధించడం ఏంటి?,. భారత్ లాంటి దేశాన్ని తక్కువ చేసి చూడటం సమంజసం కాదనేది నా అభిప్రాయం. తెలివైన వారు ఎవరూ కూడా ఇలా వ్యవహరించరు. ట్రంప్ చర్య సరైనది కాదు. భారత్‌కు బెదిరింపులకు ఎదురొడ్డి నిలబడే శక్తి ఉంది.. అవకాశం కూడా ఉంది' అని ఎయిమర్ టాన్‌జెన్ స్పష్టం చేశారు.

## 'వీధికుక్కల కేసుతో నేనిప్పుడు వరల్డ్ ఫేమస్'



**తిరువనంతపురం:** దేశ వ్యాప్తంగా చర్చాంశనీయమైన సుప్రీంకోర్టులో వీధి కుక్కల కేసు తనని వరల్డ్ ఫేమస్ చేసిందంటూ జస్టిస్ విక్రమ్ నాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అంతేకాదు ప్రపంచవ్యాప్తంగా పౌర సమాజం తనకు శుభాకాంక్షలు చెప్పడం మరిచిపోలేని అనుభూతిని ఇచ్చిందని అన్నారు. కేరళ రాజధాని తిరువనంతపురంలో నేషనల్ లీగల్ సర్వీస్ అథారిటీ (ఎన్ఎస్ఎల్ఏ) నిర్వహించిన సమావేశంలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విక్రమ్ నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చిన్న చిన్న పనులు కారణంగా నేను న్యాయవాద వర్గాల్లో ప్రసిద్ధి చెందాను. కానీ వీధికక్కల కేసు కారణంగా ఈ దేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న మొత్తం పౌర సమాజంలో నాకు గుర్తింపు ఇచ్చినందుకు వీధి కుక్కలకు కూడా నేను కృతజ్ఞుడను. ఈ కేసును నాకు అప్పగించినందుకు మా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గువాయ్‌కి నా కృతజ్ఞతలు. సుప్రీం తీర్పును సవరించడంతో జంతు ప్రేమికులతో పాటు శునకాల నుంచి కూడా తనకు శుభాకాంక్షలు, ఆశీస్సులు అందుతున్నట్లు సందేశాలు వచ్చాయన్నారు. వీధి కుక్కల దాడులు, రేబిస్ బారినపడి పలువురు మరణించిన ఘటనలపై మీడియాలో వచ్చిన కథనాలను సుప్రీం కోర్టు సుమోటోగా స్వీకరించింది. ఈ క్రమంలో.. ఢిల్లీ ఎన్సీఆర్ లో వీధి కుక్కలన్నింటినీ డాగ్ షెల్టర్స్ కి తరలించాలని జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం ఆగస్టు 11న తీర్పు ఇచ్చింది. ఇందుకు ఆరు నుంచి ఎనిమిది వారాల గడువును ఢిల్లీ ప్రభుత్వానికి విధించిన సుప్రీం కోర్టు.. అవి మళ్లీ జనావాసాల్లోకి వస్తే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించింది. అదే సమయంలో శునకాల తరలింపును గనుక అడ్డుకుంటే కఠిన చర్యలు తప్పవంటూ జంతు ప్రేమికులను హెచ్చరించింది కూడా. ఈ నేపథ్యంలో ఈ తీర్పు సమంజసం కాదంటూ జంతు ప్రేమికులు ఆందోళనకు దిగారు. కొందరు(వీళ్లలో రాజకీయ ఇతర రంగాల ప్రముఖులు) సోషల్ మీడియాలో అభ్యంతరాలు వ్యక్తం చేయగా.. మరికొందరు నేరుగా కోర్టును ఆశ్రయించారు. దీనితో ఆదేశాలను పునఃపరిశీలిస్తానని హామీ ఇచ్చిన భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్.. ఈ పిటిషన్‌ను ముగ్గురు జడ్జిలతో కూడిన విస్తృత ధర్మాసనానికి బదిలీ చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా, జస్టిస్ ఎన్.వి.అంజరియాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం దీన్ని విచారించింది.రేబిస్ లక్షణాలు లేదా విపరీత ప్రవర్తన కలిగిన కుక్కలు మినహా ఇప్పటివరకు షెల్టర్లకు తరలించిన వాటిని విడుదల చేయాలని ఆదేశించింది. వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ చేసిన తర్వాత వాటిని ఎక్కడ నుంచి తీసుకొచ్చారో అక్కడే విడిచిపెట్టాలని పేర్కొంది. ఇందుకు సంబంధించి ఆగస్టు 11న ఇచ్చిన తీర్పును సవరించింది.

## పంజాబ్ వరదలు.. నాలుగు దశాబ్దాల తర్వాత అత్యంత తీవ్రమైన విపత్తు

**ఇంటర్నెట్ డెస్క్ :** పంజాబ్ రాష్ట్రం నాలుగు దశాబ్దాలలో ఎన్నడూ లేనంత అత్యంత తీవ్రమైన వరదలను ఎదుర్కొంటోంది. 1988 తర్వాత ఇంతటి అత్యంత భయానక విపత్తును పంజాబ్ ప్రజలు చూడలేదు. సట్లెజ్, బియాస్, రావి నదులు, ఇతర వాగులు, వంకలు ఉప్పొంగడంతో గురుదాస్‌పూర్, పఠాన్‌కోట్, అమృత్‌సర్, తరన్ తారన్, కపూర్తల, ఫిరోజ్‌పూర్, ఫాజిల్కా, హొషియార్‌పూర్ జిల్లాలలో వందలాది గ్రామాలు మునిగిపోయాయి. హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్‌లోని క్యాచ్‌మెంట్ ఏరియాలలో అధిక నీటి ప్రవాహం, భాక్రా, పాంగ్, రంజిత్ సాగర్ డ్యామ్‌ల నుండి నీటి విడుదల కారణంగా పంజాబ్ కు ఇంతటి స్థాయిలో వరదలు సంభవించాయి. ఫలితంగా దాదాపు 1,018 గ్రామాలు వరదల బారిన పడ్డాయి. వీటిలో గురుదాస్‌పూర్‌లో 323, కపూర్తలలో 115, అమృత్‌సర్‌లో 100 గ్రామాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వేలాది ఎకరాల పంట పొలాలు, ప్రధానంగా వరి పొలాలు నీట మునిగిపోయాయి. రైతులకు భారీ నష్టం వాటిల్లింది. వరదల కారణంగా 23 మంది మరణించినట్లు నివేదికలు చెబుతున్నాయి. పఠాన్‌కోట్‌లో 8, హొషియార్‌పూర్‌లో 7 గురు వరదల కారణంగా మృతి చెందారు.



# వైసీపీ ఉక్కు రాజకీయం

**విశాఖపట్టణం :** ఏ రాష్ట్రంలోనైనా సరే ప్రతిపక్షాలు బలపడేది ప్రజా ఉద్యమాల ద్వారానే. ఇది చాలాసార్లు రుజువైన విషయం. ఏపీలో 2024 తర్వాత విపక్షాలకు కలిసివచ్చిన అలాంటి అంశాలు చాలా తక్కువ. చేసిన కొద్దిపాటి ఉద్యమాలు నిరసనలు రాష్ట్రం మొత్తాన్ని కదిలించే అంశాలు కావు. కొన్ని ముఖ్యమైన అంశాలు అలాంటివి దొరికినా వాటిని విపక్షాలు సరిగ్గా వాడుకోలేదనే చెప్పాలి. అలాంటి వాటిలో రాయలసీమ మామిడి రైతుల ఆందోళన, నెల్లూరు జిల్లా కర్రేడులో భూములు కోల్పోతున్న గ్రామస్తుల నిరసన, పెరిగిపోయిన విద్యుత్ బిల్లుల అంశాల వంటివి ముఖ్యం. ఇలాంటి ముఖ్యమైన అంశాలపై ఇంతవరకు విపక్షాలు కలిసికట్టుగా ముందుకు దిగిన ఉద్యమాలు లేనే లేవు. పోనీ ప్రధాన విపక్షాలుగా భావించే పార్టీలు ఒంటరిగానన్నా ఇలాంటి ముఖ్యమైన విషయాల్లో ఉద్యమానికి దిగాయా అంటే అదీ లేదు. అలాంటి తరుణంలో ప్రధాన విపక్షం వైసీపీకి ఒక ముఖ్యమైన ఆయుధంలా మారే ఛాన్స్ " విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ " అంశం ద్వారా వస్తోంది.'ఆంధ్రుల హక్కు -విశాఖ ఉక్కు' నినాదంతో ఎంతోమంది బలిదానాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్ ఇప్పుడు ప్రైవేటుపరం కాబోతున్న సూచనలు బలంగా కనిపిస్తున్నాయి. ఒకపక్క స్టీల్ ప్లాంట్‌ని ఆదుకుంటామని చెబుతున్న కేంద్రం మరోవైపు "పెట్టుబడుల ఉపసంహరణకు సంబంధించి" గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉన్నామని చెబుతోంది. దీంతో వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు కార్మికులలతోపాటు సగటు తెలుగువాడు వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటు పరం అయిపోతుందన్న నమ్మకానికి దగ్గరవుతున్నారు. ప్రతి నెల వీఆర్ఎస్ తీసుకునే ఉద్యోగుల సంఖ్య పెరుగుతూ ఉండడంతో పాటు తాజాగా 32విభాగాలను ప్రైవేట్‌పరం చేశారంటూ వస్తున్న వార్తలు ఏళ్ల తరబడి ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగుల నమ్మకంపై దెబ్బకొడుతున్నాయి. అయితే ప్రైవేటు పరం కాకుండా స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామంటూ కూటమి నేతలు చేస్తున్న ప్రకటనలు ప్రజల్లో నమ్మకాన్ని కలిగించలేకపోతు న్నాయి అనేది వాస్తవం అని వామపక్ష నేతలు చెప్తున్నారు.



ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వారు చేస్తున్న పోరాటానికి బలం సరిపోవడం లేదు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై ఉద్యమించడానికి విపక్ష వైసిపికి ఇది అద్భుతమైన అవకాశమని ఎనలిస్టులు చెప్తున్నారు. వైసిపి అధికారంలో ఉన్న ఐదేళ్లు వారు చెప్పినట్టుగానే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై కేంద్రం నెమ్మదించింది. ప్రవేటీకరణ నిర్ణయం వెనక్కి తీసుకోకపోయినప్పటికీ దానిపై ముందుకు కూడా వెళ్లలేదు. కాబట్టి ఐదేళ్లు స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకున్నాం అనే క్లయిమ్ వైసిపి నేతలు చేసుకుంటున్నారు. ఇప్పుడు దాన్ని ఆధారంగా చేసుకుని స్టీల్ ప్లాంట్ కార్మికులు ఉద్యోగులతో కలిసి ఉద్యమించే అవకాశం వైసీపీకి ఉంది. నిజంగా అలా చేస్తే ప్రజల్లో పార్టీ ఇమేజ్ కూడా పెరుగుతోంది. కానీ రాష్ట్రంలో తన ప్రత్యర్థులతో కలిసి ఉన్న బిజెపికి ఉప రాష్టపతి ఎన్నికల్లో కేంద్రంలో మద్దతిచ్చిన వింత పరిస్థితి వైసిపిది. చంద్రబాబు, పవన్ పై ఒంటికాలిపై లేచే జగన్మోహన్ రెడ్డి బీజేపీపై అంతే తీవ్రంగా ఈ అంశంపై పోరాడగల ధైర్యం చేస్తారా అనేది రాజకీయవర్గాల్లో చర్చగా మారింది. పోలవరం, అమరావతి, వైజాగ్ స్టీల్ ప్లాంట్ పరిరక్షణ ఈ మూడు ప్రస్తుతం ఆంధ్రుల సెంటిమెంట్‌తో ముడిపడి ఉన్నవి. అమరావతిపై వైసీపీ ఇప్పటికీ అస్పష్టమైన స్టాండ్ తోటే ఉంది . పోలవరం నిర్మాణాన్ని రివర్స్ టెండరింగ్ పేరుతో ఐదేళ్లు వెనక తీసుకుపోయిందంటూ టిడిపి పదే పదే ఆరోపణలు చేస్తున్నా దానికి సరైన కౌంటర్ వైసీపీ నుంచి రావడం లేదు. ఇక వారికి మిగిలింది వైజాగ్ స్టీల్ ప్లాంట్. కూటమి నేతల అస్పష్ట ప్రకటనల మధ్య స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం విపక్షాలు ఉద్యమిస్తే కచ్చితంగా ప్రజలు మద్దతు వారికి ఉంటుంది. మరి ఇలాంటి అవకాశాన్ని వైసిపి ఏ మాత్రం వాడుకుంటుందో చూడాలి అంటున్నారు ఎనలిస్ట్ లు.

# రామాయం పట్నం దిశ తిరిగినట్టే

**ఒంగోలు :** దేశంలో ఇంధన డిమాండ్ అనూహ్యంగా పెరుగుతున్న నేపథ్యంలో, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ భారీ ప్రణాళికతో ముందుకు వచ్చింది. ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం పోర్టు సమీపంలో ఒక అత్యాధునిక చమురు రిఫైనరీ, పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని ఈ ప్రభుత్వ రంగ సంస్థ యోచిస్తోంది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను ప్రస్తుతం పరిశీలిస్తోంది. ప్రపంచంలో మూడో అతిపెద్ద చమురు దిగుమతి, వినియోగదారు దేశం మనదే. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా చమురు డిమాండ్ 2.5 మిలియన్ బ్యారెల్స్ పెరుగుతుందని అంచనా వేయగా, అందులో కేవలం భారత్‌లోనే రోజుకు 1 మిలియన్ బ్యారెల్స్ డిమాండ్ పెరగనుందని బీపీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంజయ్ ఖన్నా సోమవారం జరిగిన సంస్థ వార్షిక వాటాదారుల సమావేశంలో తెలిపారు. ఈ భారీ డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని, దేశీయంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే వ్యూహంలో భాగంగానే బీపీసీఎల్ ఈ కొత్త ప్రాజెక్టును చేపడుతోంది. "భారత్ వృద్ధి సామర్థ్యాన్ని గుర్తించి, ఆంధ్రప్రదేశ్‌లోని రామాయపట్నం పోర్టు సమీపంలో కొత్త రిఫైనరీ-కమ్-పెట్రోకెమికల్ కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేయాలని బీపీసీఎల్ ఆలోచిస్తోంది. ఇందుకు సంబంధించిన ప్రాజెక్ట్ పూర్వ కార్యకలాపాలు ఇప్పటికే కొనసాగుతున్నాయి" అని సంజయ్ ఖన్నా అన్నారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ఆర్థిక వివరాలు, సామర్థ్యాన్ని ఆయన వెల్లడించనప్పటికీ, గతంలో సంస్థ యాజమాన్యం ఇచ్చిన సమాచారం ప్రకారం... ఏటా 9 మిలియన్ టన్నుల సామర్థ్యం గల ఈ యూనిట్ నిర్మాణానికి సుమారు రూ.95,000 కోట్లు ఖర్చవుతుందని అంచనా. ఈ వ్యూహాత్మక పెట్టుబడి బీపీసీఎల్ పెట్రోకెమికల్ వ్యాపార సామర్థ్యాన్ని విస్తరించడంతో పాటు, భారతదేశాన్ని ప్రపంచ రిఫైనింగ్, పెట్రోకెమికల్ కేంద్రంగా మార్చాలనే లక్ష్యానికి అనుగుణంగా ఉంటుందని ఖన్నా వివరించారు. బీపీసీఎల్ రాబోయే 50 ఏళ్ల అవసరాలను తీర్చడానికి 'ప్రాజెక్ట్ ఆస్పైర్'ను చేపట్టింది. ఈ ప్రాజెక్టులో రిఫైనింగ్, మార్కెటింగ్, అప్‌స్ట్రీమ్ రంగాలను బలోపేతం చేయడంతో పాటు, పెట్రోకెమికల్స్, పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్, బయోఫ్యూయెల్స్, గ్యాస్ రంగాల్లోకి అడుగుపెట్టనుంది. "ఇది



కేవలం ఒక ప్రాజెక్ట్ కాదు, భవిష్యత్తును తీర్చిదిద్దే ఒక సరికొత్త ఆలోచన" అని ఆయన పేర్కొన్నారు. 50 ఏళ్ల క్రితం కేవలం 3.8 మిలియన్ టన్నుల ముడి చమురును పెట్రోల్, డీజిల్‌గా మార్చే ఒకే ఒక రిఫైనరీతో ప్రారంభమైన బీపీసీఎల్, ఇప్పుడు 40.5 మిలియన్ టన్నుల సామర్థ్యంతో మూడు రిఫైనరీలను కలిగి ఉంది. 50 ఏళ్ల క్రితం 3.6 మిలియన్ టన్నుల ఉత్పత్తులను విక్రయించిన సంస్థ, ఇప్పుడు 52.4 మిలియన్ టన్నులకు పైగా పెట్రోలియం ఉత్పత్తులను అందిస్తోంది. "అప్పట్లో మా టర్నోవర్ రూ.552 కోట్లు, లాభం రూ.1.7 కోట్లు. ఇప్పుడు టర్నోవర్ రూ.5 లక్షల కోట్లు దాటగా, లాభం రూ.13,275 కోట్లకు చేరింది" అని ఆయన తెలిపారు. 2040 నాటికి నెట్ జీరో ఉద్గారాలు సాధించాలని బీపీసీఎల్ లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, 2035 నాటికి 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన పోర్ట్‌ఫోలియోను నిర్మించాలని యోచిస్తోంది. ప్రస్తుతం సోలార్, విండ్ ఎనర్జీ ప్రాజెక్టుల ద్వారా దాదాపు 155 మెగావాట్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి చేస్తోంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో 71 మెగావాట్ల సోలార్ ప్లాంట్, మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో 50 మెగావాట్ల రెండు విండ్ ఫారాల వంటి ప్రాజెక్టులు నిర్మాణ దశలో ఉన్నాయి. పునరుత్పాదక ఇంధనం, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టుల కోసం సింగపూర్‌కు చెందిన సెంబ్‌కార్ప్ గ్రీన్ హైడ్రోజన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో బీపీసీఎల్ ఒక జాయింట్ వెంచర్ ఏర్పాటు చేసుకుంది. గ్రీన్ హైడ్రోజన్ రంగంలో, బీనా రిఫైనరీ వద్ద 5 మెగావాట్ల ఎలక్ట్రోలైజర్ యూనిట్‌ను ప్రారంభించింది. హైడ్రోజన్‌తో నడిచే బస్సులు, వీటీఓఎల్ విమానాల వంటి అత్యాధునిక ఆవిష్కరణలను కూడా సంస్థ అన్వేషిస్తోందని ఆయన తెలిపారు.

# పిన్నెల్లి బ్రదర్స్‌కు వరుస కష్టాలు

**గుంటూరు :** వైసీపీ మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మరోసారి జైలుకు వెళ్లే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన ముందస్తు బెయిల్ పిటీషన్ ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టులో పిన్నెల్లి సోదరులకు ఎదురుదెబ్బ తగలడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించేందుకు పల్నాడు పోలీసులు సిద్ధమయ్యారు. పల్నాడు జిల్లాలో జరిగిన జంట హత్య కేసుల్లో మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డి ఇద్దరూ నిందితులుగా ఉన్నారు. పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలానికి చెందిన టీడీపీ నేతలు జవిశెట్టి వెంకటేశ్వర్లు, జవిశెట్టి కోటేశ్వరరావుల హత్య కేసులో వీరిద్దరూ ఏ6, ఏ7 నిందితులుగా పోలీసులు గతంలో కేసు నమోదు చేశారు. అయితే రాజకీయ కక్ష సాధింపు తోనే తమపై అక్రమ కేసులు బనాయించారని కోరుతూ హైకోర్టును ఆశ్రయించడంతో వారికి ముందస్తు బెయిల్ లభించింది. గతంలో ఎన్నికల సందర్భంగా ఈవీఎం బాక్సులను ధ్వంసం చేయడంతో పాటు పోలింగ్ కేంద్రం వద్ద పోలీసు అధికారిపై దాడికి యత్నించిన కేసులో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి నెల్లూరు జిల్లా జైలులో కొన్ని నెలల పాటు ఉండి శిక్ష అనుభవించి బెయిల్ పై బయటకు వచ్చారు. అయితే ఆ తర్వాత పల్నాడు జిల్లాలో జరిగిన జంట హత్య కేసులో కూడా వీరిని నిందితులుగా చేర్చడంతో ముందస్తు బెయిల్ ను హైకోర్టు నుంచి తెచ్చుకున్నారు. అయితే ఈరోజు పిన్నెల్లి సోదరుల ముందస్తు బెయిల్ ను హైకోర్టు కొట్టివేసింది. పల్నాడు జిల్లాలో జంట హత్య కేసులో పిన్నెల్లి సోదరుల కుట్ర ఉందని ప్రభుత్వం తరుపున న్యాయవాదులు వాదించారు. వీరు ఒక రెస్టారెంట్ లో సమావేశమై హత్యకు కుట్రపన్నారని, ఫోన్ లో కూడా మాట్లాడారని, టెక్నికల్ ఎవిడెన్స్ కూడా ఉందని న్యాయస్థానానికి న్యాయవాదులు చెప్పారు. వాస్తవాలు బయటకు రావాలంటే పిన్నెల్లి సోదరులను అదుపులోకి



తీసుకుని విచారిస్తే తప్ప వెల్లడి కావని వాదించారు. వారిద్దరిపై రౌడీషీట్ కూడా ఉందని, గతంలో నేర చరిత్ర కూడా ఉందని చెప్పడంతో హైకోర్టు ముందస్తు బెయిల్ ను కొట్టివేసింది.

## స్టీల్ ప్లాంట్‌పై కూటమి నేతల దొంగ బుద్ధి బట్టబయలు

-మొదటిపేజీ తరువాయి

స్టీల్ ప్లాంట్ పోరాటం కోసం ఒక సమన్వయ కమిటీని ఏర్పాటు చేస్తాము. పోరాటంలో ఉత్తరాంధ్ర, తూర్పుగోదావరి జిల్లా నేతల అభిప్రాయాలను కూడా తీసుకుంటాము. కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తాం. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపడమే వైఎస్సార్‌సీపీ ధ్యేయం. మా పార్టీ కార్పొరేటర్ల పోరాటంతో %+ఎవీజ%లో స్టీల్ ప్లాంట్‌పై తీర్మానం చేయించారు. విశాఖ ఉక్కు ప్రజల అందరి హక్కు. 32 మంది ప్రాణ త్యాగంతో స్టీల్ ప్లాంట్ ఏర్పడింది. ప్లాంట్ ప్రైవేటీకరణ జరుగుతుంటే కూటమి నాయకులకు చీమ కుట్టినట్లు కూడా లేదు. ప్లాంట్‌పై కూటమి నేతల దొంగ బుద్ధి బయట పడింది. ప్లాంట్ కోసం కూటమి నేతలు గతంలో దొంగ దీక్షలు చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌పై మొదటి నుంచి వైఎస్ జగన్‌ది ఒకే మాట.. ప్రైవేటీకరణ జరగకూడదు అని చెప్పారు. ఎలాంటి పోరాటాలు చేయడానికైనా సిద్ధంగా ఉండాలన్నారు. అవసరమైతే తాను వచ్చి పోరాటంలో పాల్గొంటానని జగన్ చెప్పారు. పవన్ కళ్యాణ్ గతంలో ఎంపీలు స్టీల్ ప్లాంట్ కోసం ఉప్పు కారం తినాలని మాట్లాడారు. ఈ రోజు ఉప్పు కారం ఎవరికి పంపుతారు. ఎవరు తినాలి ఉప్పు కారం.. అది పవనే చెప్పాలి. వైజాగ్ వచ్చి స్టీల్ ప్లాంట్ కోసం పవన్ కళ్యాణ్ ఎందుకు మాట్లాడలేదు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్టీల్ ప్లాంట్ కోసం ఎందుకు ప్రధాన మంత్రితో మాట్లాడలేదు. వైఎస్ జగన్ ధైర్యంగా స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయవద్దని ప్రధాని మోదీని కోరారు' అని గుర్తు చేశారు.

## తెదేపాలో ఉన్నందుకు గర్విస్తున్నా

-మొదటిపేజీ తరువాయి

అనంతరం 21 మందికి రూ.45 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆమె అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జెండా కర్రే ఆయుధం

-మొదటిపేజీ తరువాయి

తాను ఈ సమావేశం పెట్టానని పవన్ కల్యాణ్ తెలిపారు.
ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పోరాటాల పురిటిగడ్డ తెలంగాణలో జనసేన పార్టీ ఆవిర్భవించిందని పవన్ కల్యాణ్? గుర్తు చేశారు. ఈ 11 ఏళ్ల ప్రయాణంలో ఏపీలో నిలదొక్కుకున్నామని, వందశాతం స్ట్రైక్‌రేట్‌తో దేశంలోనే చరిత్ర సృష్టించామని తెలిపారు. ఇంత మంది ఎమ్మెల్యేలతో నిలబడేందుకు తనకు పుష్కర కాలం పట్టిందని పవన్ కల్యాణ్ అన్నారు. పదవి, అధికారం అనే ఆశ లేకుండా మన దేశం, మన మూలాలను పరిరక్షించుకోవాలనే సంకల్పం కార్యకర్తలకు ఉంటే జనసేన కచ్చితంగా నేషనల్ పార్టీ అవుతుందని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ సందర్భంగా పార్టీకి సంబంధించిన ఐదు విషయాలను పవన్ ప్రస్తావించారు. పార్టీని సంస్థాగతంగా నిర్మించేందుకు పార్టీ కార్యాలయం నుంచి మండల స్థాయి వరకు మానిటర్ చేస్తానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. తాను ఎప్పుడూ నిస్వార్థంగానే పని చేసుకుంటూ వెళ్లానని, తన పని సత్ఫలితాలు ఇవ్వాలని కోరుకున్నానని పవన్ కల్యాణ్ అన్నారు. అందరూ బాగుండాలనేదే తన ఉద్దేశమని స్పష్టం చేశారు. కమ్యూనిజంను నినదించిన రష్యా ప్రజాస్వామ్య దేశంగా మారిందని పవన్ గుర్తు చేశారు. సెక్యూలరిజాన్ని తాము అర్థం చేసుకున్నామని అన్నారు. కమ్యూనిజం, సోషలిజం అన్ని అర్థం చేసుకున్న తర్వాతే పార్టీ ఏర్పాటు చేశామని తెలిపారు. సినిమాలు చేసి, డ్యాన్సులు చేసేవారికి అవగాహన ఉండదనుకుంటున్నారా అని పవన్ కల్యాణ్ ప్రశ్నించారు. సంపూర్ణ అవగాహనతోనే తాము మాట్లాడామని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని అన్నారు. గుండెల్లో ఉండే మాటే తూటా కావాలని సూచించారు. చివరగా నిలబడేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉంటే వారి వెన్నంటి ఉండి, నడిపించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని పవన్ కల్యాణ్ ప్రకటించారు. తనకు దశాబ్దకాలం ఇస్తే నాయకులుగా, దేశనిర్మాణంలో కీలక శక్తులుగా తీర్చిదిద్దే బాధ్యత తాను తీసుకుంటానని కార్యకర్తలకు పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారు.

## ఆర్థిక ఇబ్బందులు తప్పవా?

-మొదటిపేజీ తరువాయి

సాయం చేయడమే కాకుండా అవసరమైన రుణ సదుపాయాన్ని కూడా కల్పిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ ఇప్పుడు బీజేపీకి చంద్రబాబు ప్రయారిటీ కాదన్నది రాజకీయంగా వాస్తవం. చంద్రబాబు నాయుడు కూటమిలోనే ఉన్నందున ఆయన వల్ల రాజకీయంగా ఇబ్బందులు తలెత్తవని కూడా బీజేపీ నేతలు భావిస్తున్నారు. అందుకే విశాఖ స్టీల్ ప్లాంట్ లోని 34 విభాగాల్లో ప్రయివేటీకరణకు సిద్ధమయిందన్న కామెంట్స్ సోషల్ మీడియాలో జోరుగా వినిపిస్తున్నాయి. దీంతో పాటు పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన నిధుల విడుదలలో కూడా కేంద్ర ప్రభుత్వం ఇక పెద్దగా ఆసక్తి చూపదని చెబుతున్నారు. ఇప్పటికే చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం సహకారం ఉంటుందని భావించి సంక్షేమ పథకాలను గ్రౌండ్ చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో లక్షల కోట్లు అప్పులు చేశారు. ఎఫ్ఆర్ఎంబీ పరిమితికి మించి అప్పులు చేశారన్న ఆరోపణలు కూడా విపక్ష వైసీపీ నేతలు చేస్తున్నారు. అదే సమయంలో ఇక ప్రతి నెలా సంక్షేమ పథకాలను అమలు చేయాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న పని. ఆంధ్రప్రదేశ్ లో ఆదాయం కంటే హామీలకు అవసరమైన నిధుల అవసరం ఎక్కువ కావడంతో ఇక రానున్న కాలంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు తప్పవన్న కామెంట్స్ అధికారిక వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఇటీవల ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తో చంద్రబాబు సమావేశమయినప్పటికీ ఆశించిన స్పందన లేదని అంటున్నారు. మొత్తం మీద చంద్రబాబు నాయుడుకు రానున్న కాలం ఖజానాను నింపడం, వెల్ఫేర్ స్కీమ్స్ ను కొనసాగించడం కత్తిమీద సాము వంటిదేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

## విశాఖలో గూగుల్ డేటా సెంటర్

**విశాఖపట్టణం :** ప్రముఖ దిగ్గజ సంస్థ గూగుల్ ఇప్పుడు వైజాగ్‌లోనూ అడుగుపెట్టనుంది. సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడితో 1 గిగావాట్ డేటా సెంటర్ విశాఖపట్నంలో ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చింది. అంతేనా.. ఆసియా ఖండంలోనే ఇది అతిపెద్ద హైపర్‌స్కేల్ డేటా సెంటర్ కానుంది. గూగుల్ సంస్థ అమెరికా వెలుపల ఏర్పాటు చేసే అతిపెద్ద కేంద్రానికి సైతం విశాఖ వేదిక కానుంది. ఈ మేరకు గూగుల్‌కు చెందిన ఇన్వెస్ట్ ఇండియా ఎక్స్‌లో వెల్లడించింది. గూగుల్ ప్రతిపాదన గేమ్ ఛేంజర్ కానుంది. ప్రపంచానికి డిజిటల్ హబ్‌గా దేశానికి గుర్తింపు వస్తుందని జాతీయ పెట్టుబడుల ప్రోత్సాహక, సమన్వయ సంస్థ ఇన్వెస్ట్ ఇండియా తన ప్రకటనలో పేర్కొంది. ఇన్వెస్ట్ ఇండియా ప్రకటనలో ఇప్పుడు యావత్ ప్రపంచం ఫోకస్ ఏపీపై నిలిచింది. గూగుల్ క్లౌడ్, సెర్చ్, యూట్యూబ్, ఏఐ వర్క్‌ల పర్యావరణ వ్యవస్థ బలోపేతం చేసేందుకు ఈ డేటా సెంటర్ ఉపయోగపడనుంది. అంతేకాకుండా పరిశ్రమలు, స్టార్టప్‌లు, ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఏఐ సేవలను అందుబాటులోకి తీసుకురానుంది. విశాఖలో త్వరలో ఏర్పాటు చేయనున్న డేటా సెంటర్.. దేశానికి చెందిన మొత్తం డేటా నిల్వ చేయనుంది. దీనివల్ల ఉగ్రమూక చేతిలోకి విలువైన డేటా చేరే అవకాశం తప్పుతుంది. అంతర్జాతీయ బ్యాండ్‌విడ్త్‌ను పెంచేందుకు 3 సబ్ మెరైన్ కేబుల్స్‌కు సరిపడా ల్యాండింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసి డేటా సెంటర్‌ను అనుసంధానిస్తుంది. ముంబయిలో గూగుల్‌కు చెందిన పియరింగ్, క్యాచీ సర్వర్లు ఉన్నాయి. అక్కడి నుంచి సముద్ర మార్గంలో కేబుల్ తీసుకోవడం సులువు అవుతుంది. డార్క్ ఫైబర్ ద్వారా తక్కువ ఖర్చుతో తీసుకోవాలని ప్రణాళికలు వేస్తున్నారు. డేటా సెంటర్ కూలింగ్ కోసం పెద్దఎత్తున నీరు అవసరం అవుతుంది. అందుకే డేటా సెంటర్ ఏర్పాటు కోసం గూగుల్ విశాఖ సముద్ర తీరాన్ని ఎంపిక చేసుకుంది. పైగా ఐటీ రంగంలో రూ.2 కోట్ల పెట్టుబడి పెడితే ఒకరికి ఉపాధి లభిస్తుందని అంచనా. ఆ లెక్కన గూగుల్ సంస్థ పెట్టే సుమారు రూ.50 వేల కోట్ల పెట్టుబడుల ఆధారంగా రాష్ట్రంలోని సుమారు 25 వేల మంది నిరుద్యోగులకు దశలవారీగా ప్రత్యక్ష ఉపాధి అవకాశం లభించనుంది. ఇక పరోక్షంగా మరో 50 వేల మందికి ఉపాధి లభించనుంది. అంతేకాకుండా డేటా సెంటర్ కోసం పునరుత్పాదక విద్యుత్‌ను వినియోగించాలని గూగుల్ నిర్ణయించింది. ఆ విద్యుత్ ప్రాజెక్టుల కోసం సుమారు రూ.20 వేల కోట్లు గూగుల్ ఖర్చు చేయనుంది. సముద్ర తీరం వెంట చిన్న హైడ్రో ప్రాజెక్టులు ఏర్పాటు చేసి, వాటి ద్వారా వచ్చే విద్యుత్‌ను గూగుల్ వినియోగించుకోనుంది.

## సంపాదకీయం

# ఊపందుకొంటున్న స్వదేశీ ప్రచారం

శక్తివంతమైన, అభివృద్ధి చెందిన భారత్‌కు.. స్వయంసమృద్ధి చెందిన భారతదేశమే పునాది. రక్షణ, సాంకేతికత, ఇంధన, అంతరిక్షంతో పాటు తయారీ రంగాల్లో పురోగతి 2047 నాటికి మనల్ని అభివృద్ధి చెందిన భారత్‌గా నిలుపుతుంది'ఇటీవల 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ.. ఆత్మనిర్భర్ భారత్, మేకిన్ ఇండియా వంటి కార్యక్రమాలను నొక్కిచెబుతూ చేసిన వ్యాఖ్యలివి.యువత స్వదేశంలోనే జెట్ ఇంజిన్లు, సెమీకండక్టర్ చిప్స్, ఇతర సాంకేతిక ఉత్పత్తులను అభివృద్ధి చేయాలని కోరుతున్నా. తద్వారా మనం స్వయంసమృద్ధి సాధించగలం" అని అన్నారు.స్వయంసమృద్ధి అంటే, కేవలం దేశానికే పరిమితం కాదని.. ఇతర దేశాలతో పరస్పర సహకారం కొనసాగిస్తూ శక్తిసామర్థ్యాలను, స్వయంప్రతిపత్తిని పెంపొందించుకోవడమని కూడా అన్నారు.కార్లు, ఫోన్ల తయారీ నుంచి వస్త్రాలు, ఆహార భద్రత వరకూ భారత్ గత కొన్నేళ్లుగా అద్భుతమైన పురోగతి సాధించింది.అయితే, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో గందరగోళ పరిస్థితులు, భారత్‌పై అమెరికా 50 శాతం సుంకాల విధింపు వంటి వాటి కారణంగా, 'స్వదేశీ' ప్రచారం ఊపందుకుంటోంది.వ్యవసాయం, మైనింగ్, ఇనుము, ఉక్కు, వాహనాల విడిభాగాలు, పారిశ్రామిక యంత్రాలు, ఫర్నిచర్, తోలు, పాదరక్షల తయారీ, దేశీయ రక్షణ రంగ ఉత్పత్తులు, ఐటీ, ఇతర డిజిటల్ సేవల రంగాల్లో భారత్ స్వావలంబన సాధించింది.కానీ, ఇంకా విదేశీ ముడి పదార్థాలు, టెక్నాలజీ, రీసర్చ్‌పై ఆధారపడిన అనేక రంగాలున్నాయి.మొబైల్ ఫోన్లు, అత్యాధునిక ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకి అవసరమైన సెమీకండక్టర్ చిప్స్ వంటి హైటెక్ ముడి వస్తువులను భారత్ దిగుమతి చేసుకుంటోంది.అంతేకాకుండా.. చైనా సాంకేతిక నైపుణ్యం, సరసమైన ధరల కారణంగా భారత్ ఈ వస్తువుల కోసం చైనాపై ఎక్కువగా ఆధారపడుతోంది.ఈ సెమీకండక్టర్, ఎలక్ట్రానిక్స్ రంగంలో స్వావలంబన సాధించే దిశగా భారత్ ఇప్పటికే విధానపరమైన నిర్ణయాల విషయంలో చొరవ తీసుకుంది.మేక్ ఇన్ ఇండియా, ఇండియా సెమీకండక్టర్ మిషన్, ప్రొడక్ట్ లింక్డ్ ఇన్సెంటివ్ వంటి స్కీముల ద్వారా భారత్‌లో సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తికి అనువైన వాతావరణాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రయత్నాలు చేస్తోంది.ముడి పదార్థాలు/వస్తువుల లభ్యత గురించి ఎలిస్టా కన్స్యూమర్ ప్రొడక్ట్స్ సీఎండీ సాకేత్ గౌరవ్ మాట్లాడుతూ, "మేం స్మార్ట్ టీవీలను తయారుచేస్తాం. వాటిలో వినియోగించే ముఖ్యమైన విడిభాగాలను విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలి. మా ఉత్పత్తులలో వినియోగించే అనేక భాగాలను ఇప్పటికీ దిగుమతి చేసుకుంటున్నాం. అవి భారత్‌లో తయారవడం లేదు" అని చెప్పారు.ఎలిస్టా కంపెనీ ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని కడపలో రూ.250 కోట్లతో మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించింది."అలాగే భారతీయ బ్రాండ్లు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లలో ఒకటి ఏంటంటే.. ఇక్కడ తయారైన వస్తువులు నాణ్యత పరంగా బాగున్నప్పటికీ, మన వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడతారు" అని సాకేత్ గౌరవ్ అన్నారు.అయితే, రానున్న ఐదేళ్లలో సెమీకండక్టర్స్, ఎలక్ట్రానిక్స్ రంగంలో భారత్ స్వయంసమృద్ధి సాధిస్తుందని కూడా ఆయన అన్నారు."ఐదు నుంచి ఆరేళ్లలో ముఖ్యమైన విడిభాగాలను ఇక్కడే తయారు చేయగలమని ఆశిస్తున్నా. ప్రస్తుతం, అందుకు అవసరమైన టెక్నాలజీ, ప్రాసెస్ చేసేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు లేవు" అని సాకేత్ గౌరవ్ చెప్పారు."భారత్‌లో తయారైన ఉత్పత్తులు విదేశీ బ్రాండ్ల కంటే తక్కువ ధరకే లభిస్తాయి. కానీ, వినియోగదారులు విదేశీ బ్రాండ్లనే ఇష్టపడుతున్నారు."ఎలక్ట్రిక్ వాహనాల బ్యాటరీల నుంచి టర్బైన్ల వరకు, పర్మినెంట్ మాగ్నెట్స్, లైటింగ్, రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ పరికరాలు, అనేక ఇతర రోజువారీ నిత్యవసరాలతో సహా అనేక ఉత్పత్తుల తయారీకి అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్ కోసం భారత్ దిగుమతులపైనే ఆధారపడుతోంది.భారత్ తనకు అవసరమైన రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో దాదాపు 99 శాతం దిగుమతి చేసుకుంటోంది. అందుకు చైనాపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది.భారత్‌లో రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను రీసైక్లింగ్ చేసే అతిపెద్ద కంపెనీల్లో ఒకటైన అటెరో సీఈవో, కంపెనీ సహ వ్యవస్థాపకులు నితిన్ గుప్తా మాట్లాడుతూ, "భారత్ ప్రస్తుతం 99 శాతం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌ను దిగుమతి చేసుకుంటోంది. కానీ, ఈ పరిశ్రమ పురోగతికి అనువైన వ్యవస్థను అభివృద్ధి చేసినట్లయితే.. భారత్ 70 శాతం అవసరాలను రీసైక్లింగ్ ద్వారా తీర్చుకోవచ్చు" అని అన్నారు.అటెరో కంపెనీ ఇటీవల తన సామర్థ్యాన్ని 300 టన్నుల నుంచి 30 వేల టన్నులకు పెంచుకుంది."చాలా ముఖ్యమైన ఉత్పత్తుల తయారీలో రేర్ ఎర్త్ మెటీరియల్స్ చాలా కీలకం. భారత్ ఈ విషయంలో స్వయంసమృద్ధి సాధించే దిశగా చర్యలు చేపట్టాల్సి ఉంది. భారత్‌లోనూ రేర్ ఎర్త్ మెటీరియల్స్ నిల్వలు ఉన్నాయి, కానీ ప్రస్తుతం వాటి మైనింగ్ జరగడం లేదు. ప్రపంచంలోని మొత్తం రేర్ ఎర్త్ మెటీరియల్స్‌లో 99 శాతం చైనా నుంచే వస్తున్నాయి, ఈ విషయంలో భారత్ ఇప్పటివరకూ పెద్దగా చేసిందేమీ లేదు" అని నితిన్ గుప్తా అన్నారు."రీసైక్లింగ్ హబ్‌గా మారడం ద్వారా భారత్ తన అవసరాలను తీర్చుకునే దిశగా ముందుకెళ్లొచ్చు. మనం మార్కెట్‌లో పోటాపోటీ ధరకు రీసైకిల్ చేయగలం, కానీ అది భారీ స్థాయిలో జరగాల్సిన అవసరముంది."అయితే, కేవలం రీసైక్లింగ్ ద్వారానే భారత్ అవసరాలు తీరతాయా? అనేదే ఇక్కడి ప్రశ్న. విషయంలో నితిన్ గుప్తా ఆశావహంగానే ఉన్నారు..2025 ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో, భారత్ 9.74 లక్షల టన్నుల డీఏపీ (డైఅమ్మోనియం ఫాస్ఫేట్)ను దిగుమతి చేసుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో డీఏపీ మొత్తం దిగుమతులు దాదాపు 45.7 లక్షల టన్నులు. యూరియా దాదాపు 56 లక్షల టన్నులు. ఎరువుల తయారీలో ఇది చాలా కీలకం.దేశీయంగా అవసరమైన ఖనిజాల కొరతతో పాటు అభివృద్ధి చెందిన మైనింగ్, ప్రాసెసింగ్ వ్యవస్థ లేకపోవడం.లిథియం, కోబాల్ట్, మెగ్నీషియం, నికెల్ వంటి ముఖ్యమైన ఖనిజాలకు ప్రపంచవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అయితే, ఈ కీలకమైన ఖనిజ నిల్వలు భారత్‌లో పరిమితంగానే ఉన్నాయి. లేదంటే నిల్వలు ఉన్నప్పటికీ.. మైనింగ్ సాధ్యమయ్యే పరిస్థితి లేదు.ఆర్థిక వ్యవహారాల విశ్లేషకులు, జర్నలిస్ట్ నరేంద్ర తనేజా మాట్లాడుతూ, "భారతీయ పరిశ్రమలు ముడి చమురు, పెట్రోకెమికల్స్ దిగుమతులపై ఆధారపడి ఉన్నాయి. పెట్రోకెమికల్స్‌పై ఆధారపడని రంగం దాదాపుగా అరుదు. కానీ, ఈ అవసరాలన్నింటికీ భారత్ దాదాపుగా దిగుమతులపైనే ఆధారపడుతోంది. భారత్‌లో ముడిచమురు నిల్వలు లేవని కాదు, కానీ అవి ఉన్నచోట్ల వాటిని వెలికితీయడంలోనూ సవాళ్లున్నాయి" అని అన్నారు.భారత్ దేశీయ రక్షణ రంగ ఉత్పత్తిని ప్రోత్సహించినప్పటికీ, రక్షణ పరమైన అవసరాల కోసం ఇప్పటికీ ఇతర దేశాల దిగుమతులపై ఆధారపడి ఉంది.యుద్ధ విమానాల నుంచి జలాంతర్గాముల వరకు, ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్స్‌ను కూడా భారత్ విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.2023 గణాంకాల ప్రకారం, భారత్ తన రక్షణ బడ్జెట్‌లో 36 శాతం దిగుమతులపైనే ఖర్చు చేసింది.జెట్ ఇంజిన్లు, రాడార్ల వంటి హైటెక్ పరికరాలను భారత్ ఇప్పటికీ దిగుమతుల ద్వారానే సమకూర్చుకుంటోంది.ఇంకా, అధునాతన ఆయుధాల కోసం కూడా విదేశాలపై ఆధారపడుతోంది భారత్ దేశీయంగానూ రక్షణ రంగ ఉత్పత్తిని పెంచింది. 2014 – 15లో భారత్ రూ.46,429 కోట్ల విలువైన రక్షణ ఉత్పత్తులను తయారుచేయగా, అది 2023 – 24 నాటికి 1.27 లక్షల కోట్లకు పెరిగింది.

# సమన్వయ లోపంతోనే యూరియా కష్టాలు




తెలంగాణలో వానాకాలం పంటలకు అవసరమైన ఎరువులు దొరక్క రైతులు ఆందోళన చెందుతుంటే, ప్రభుత్వం మాత్రం స్థానిక ఎన్నికలపై దృష్టి సారించిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఈ యూరియా కొరత ఎందుకు వచ్చింది? తెలంగాణలో అన్నదాతలు యూరియా కోసం వానలో తడుస్తూ సరఫరా కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం సరిహద్దుల వరకు ఇదే దృశ్యం. చివరికి విసిగి వేసారి రాస్తారోకోలు కూడా నిర్వహించారు. ఇది కేవలం రైతుల సమస్యగానే కాక, రాజకీయంగా కూడా చిచ్చు రేపుతోంది. వానాకాలంలో పత్తి, వరి పంటలకు యూరియా డిమాండ్ అధికంగా ఉంటుంది. ఈ ఖరీఫ్‌లో 1.32 కోట్ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని అంచనా. కేంద్రం 9.8 లక్షల టన్నులు కేటాయించినా, ఆగస్టు నాటికి 5.4 లక్షల టన్నులే రాష్ట్రానికి చేరాయి. దాంతో 3 లక్షల టన్నుల లోటు ఏర్పడింది. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రం మధ్య ఆరోపణల యుద్ధం, సమన్వయ లోపం వల్ల రైతులు నష్టపోయారు. సమయానికి ఒత్తిడి చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత యూరియా అవసరం మరింత పెరిగింది. ఎకరానికి 170 కిలోల వినియోగం ఉంది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. భారీ వర్షాలతో యూరియా కొరత రాష్ట్రవ్యాప్తంగా మరింత తీవ్రమైంది. ప్రపంచ సరఫరా గొలుసులో అంతరాయాలు, సహజవాయువు ధరల పెరుగుదల, చైనా వంటి దేశాల ఎగుమతి పరిమితులు యూరియా దిగుమతులపై ప్రతికూల ప్రభావం చూపాయి. యుద్ధ ఉద్రిక్తతలు కూడా దిగుమతి సమస్యలను మరింత పెంచాయి. వర్షాకాలం రాకముందే, మార్చి నెల నుంచే యూరియా నిల్వలను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నా, రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో ఘోరంగా విఫలమైంది. వర్షాకాలం సమీపిస్తోందని ముందుగానే అంచనా వేసి, యూరియా నిల్వల కోసం కేంద్ర అధికారులతో సంప్రదింపులు జరపడంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శించారు. గత పది సంవత్సరాలుగా రాష్ట్ర అధికారులు, వ్యవసాయ శాఖ మంత్రి ఏప్రిల్%-%మే నెలల్లోనే ఢిల్లీకి వెళ్లి యూరియా నిల్వలను సమీకరించేవారు. కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పద్ధతిని అనుసరించకపోవడం వల్లే ఈ రోజు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రంలో బ్లాక్ మార్కెటింగ్ హల్‌చల్ చేస్తోంది. సబ్సిడీ యూరియా పారిశ్రామిక అవసరాలకు మళ్లిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వలు, అధిక ధరలు, కఠిన రేషన్ విధానాలు రైతులకు మరింత ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఇటీవలి కాలంలో డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ (డీఈఎఫ్) వినియోగం గణనీయంగా పెరిగింది. నూతన డీజిల్ వాహనాలకు ఇది తప్పనిసరి కావడంతో, డీఈఎఫ్ తయారీలో యూరియాను వినియోగిస్తున్నారనే సమాచారం ఉంది. ఫలితంగా వ్యవసాయానికి కేటాయించిన సబ్సిడీ యూరియా పారిశ్రామిక అవసరాలకు మళ్లిపోయే అవకాశం ఉంది. ఈ దందాను అరికట్టడానికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విజిలెన్స్ అధికారులను రంగంలోకి దించి, కఠిన చర్యలు తీసుకోవాలి. రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ 145 పని దినాల్లో 78 రోజులు నిలిచిపోయింది. సాంకేతిక సమస్యలు, అమ్మోనియం లీకేజీతో ఉత్పత్తి నిలిచిందని యాజమాన్యం చెబుతోంది. ఈ ప్లాంట్ సామర్థ్యం ఏటా 12 లక్షల టన్నులు. షట్‌డౌన్ ప్రభావం తెలంగాణ వాటాపై పడింది. యూరియా కొరత వెనుక ప్రపంచ, దేశీయ సరఫరా సమస్యలు, పెరిగిన సాగు, స్థానిక ఉత్పత్తి అంతరాయాలు, బ్లాక్ మార్కెటింగ్, రాజకీయ సమన్వయ లోపం ఉన్నాయి. రైతు కష్టాలు తీరాలంటే సమయానికి సరఫరా, పారదర్శక పంపిణీ, తగిన బఫర్ స్టాక్‌లు, సమన్వయంతో కూడిన ప్రణాళిక తప్పనిసరి. లేకపోతే ప్రతి ఏడాది రైతులకు కష్టాలే మిగులుతాయి.

# భిన్న దేశాలతో దౌత్య సంబంధాలు



అంతా సవ్యంగా ఉన్న రోజుల్లో భిన్న దేశాలతో దౌత్య సంబంధాలు సాఫీగా సాగి పోతాయి. కానీ సవాళ్లు ఎదురయ్యే కాలంలో వాటిని నిలబెట్టుకోవటం, కొత్త బంధాలు ఏర్పర్చుకోవటం సులభం కాదు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వైఖరి కారణంగా భారత్–అమెరికా సంబంధాల్లో ఏర్పడిన ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం జపాన్‌లో రెండు రోజుల పర్యటన ప్రారంభించారు. ఈ నెల 31న, ఆ మర్నాడూ చైనాలోని తియాన్‌జిన్‌లో జరగబోయే షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) శిఖరాగ్ర సదస్సులో కూడా ఆయన పాలుపంచుకుంటారు. జపాన్‌తో మనకు చిరకాల మైత్రి ఉంది. మన స్వాతంత్ర్యోద్యమంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఇండియన్ నేషనల్ ఆర్మీ (ఐఎన్ఏ)ని స్థాపించి పోరాడినప్పుడు అన్ని విధాలా చేయూతనందించింది జపానే. స్వాతంత్ర్యానంతరం ఆ బంధం మరింత బలపడింది. రెండో ప్రపంచ యుద్ధ పరిసమాప్తి అనంతరం లాంఛనంగా 1951 సెప్టెంబర్ 8న శాన్‌ఫ్రాన్సిస్కో శాంతి ఒప్పందం కుదిరినప్పుడు జపాన్‌కు పాక్షిక సార్వభౌమత్వం మాత్రమే ఇవ్వాలన్న నిబంధనను మన దేశం తీవ్రంగా వ్యతిరేకించి సంతకం చేసేందుకు నిరాకరించింది. అందుకు జపాన్ ఈనాటికీ మన పట్ల కృతజ్ఞతగా ఉంటుంది. తొలిసారి 2014లో ఎన్డీయే సర్కారు ఏర్పడినప్పుడే మోదీ జపాన్‌ను సందర్శించారు. ఈ దశాబ్ద కాలంలో ఇరు దేశాల సంబంధాలూ మోదీ అన్నట్టు ఎన్నో రెట్లు పెరిగాయి. మన దేశంలో ప్రస్తుత జపాన్ పెట్టుబడుల విలువ 4,200 కోట్ల డాలర్లు. దేశంలోని ఢిల్లీ, ముంబై, కోల్‌కతా మెట్రో రైలు ప్రాజెక్టులు జపాన్ ఆర్థిక సహకారంతో సాకారమయ్యాయి. ఢిల్లీ%-%ముంబై పారిశ్రామిక వాడ, సెమీకండక్టర్లు తదితరాలపై జపాన్ ముద్ర బలంగా ఉంది. ముంబై%-%అహ్మదాబాద్ మధ్య సాకారం కానున్న బుల్లెట్ రైలు ప్రాజెక్టుకు అత్యాధునిక ఈ%-%10 రకం బుల్లెట్ రైలును అందించాలని జపాన్ నిర్ణయించింది. వచ్చే పదేళ్లలో మన దేశంలో జపాన్ పెట్టుబడుల్ని పది లక్షల కోట్ల యెన్‌ల(6,800 కోట్ల డాలర్ల) స్థాయికి తీసుకెళ్లాలని మోదీ, జపాన్ ప్రధాని షిగెరు ఇషిబా శిఖరాగ్ర సమావేశంలో నిర్ణయించటం, పెట్టుబడులతోపాటు నవీకరణ, పర్యావరణం, ఆరోగ్యం తది తరాల్లో కలిసి పనిచేయాలనుకోవటం... రాగల అయిదేళ్లలో భిన్న రంగాల నిపుణుల సేవలు పొందేందుకు పరస్పరం అయిదు లక్షల మందిని బదలాయించుకోవాలనుకోవటం భారత్, జపాన్‌ల మైత్రి పటిష్ఠతకు నిదర్శనం. ఈ క్రమంలో సహజంగానే సవాళ్లుంటాయి. స్వేచ్ఛాయుత, శాంతియుత, సంపద్వంత ఇండో%-%పసిఫిక్ ఆవిర్భవించాలన్న నినాదం అమెరికా ఛత్రఛాయలో ఏర్పడింది. దక్షిణ చైనా సముద్ర ప్రాంత సరిహద్దుల విషయంలో చైనాతో జపాన్‌కు తగాదా లేకున్నా, దాని దూకుడు పెద్ద సమస్యగా మారింది. చైనా తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాల వల్ల జపాన్‌కు ఎగుమతుల సమస్య ఏర్పడుతోంది. చైనాను కట్టడి చేయాలన్న బృహత్తర పథకానికి ఈ వివాదం తోడ్పడుతుందని అమెరికా భావించి మనల్ని అందులో కీలక భాగస్వామిని చేసింది. సుంకాల వివాదంలో ఇది ఎటు పోతుందన్న ఆందోళన జపాన్‌కు సహజంగానే ఉంటుంది. అయితే తమ వైఖరి మారబోదని మోదీ చెప్పటం జపాన్‌కు ఊరటనిచ్చే అంశం. ఇండో%-%పసిఫిక్ విషయంలో మన వైఖరి చైనాకు కంటగింపుగానే ఉండొచ్చు. జపా న్‌తో సంబంధాలు సుహృద్భావంతో ఉండగా, చైనాతో సంబంధాలు అందుకు భిన్నం. సుంకాల వివాదం నేపథ్యంలో భారత్ దగ్గరవుతుందన్న అంచనా చైనాకుంది. ఎస్‌సీవో శిఖరాగ్ర సదస్సుకు మోదీ వెళ్తారా వెళ్లరా అనే సంశయం మొదట్లో ఉన్నా... రష్యా చొరవతో అది సాధ్యపడుతోంది. ఇది సాన్నిహిత్యానికి దారి తీస్తుందా లేదా అన్నది చూడాలి. చైనా ఇప్పటికే ఎరువులు, అరుదైన ఖనిజాలు, సొరంగాల తవ్వకంలో తోడ్పడే యంత్ర సామగ్రి ఎగుమతులపై ఉన్న నిషేధాలు తొలగించటానికి సూత్రప్రాయంగాఅంగీకరించింది. మోదీ చైనా పర్యటనలో ఈ విషయంలో మరింత స్పష్టత వస్తుంది. చైనాతో మన సంబంధాలు బలపడే సూచనలుం డగా, ట్రంప్ సైతం చైనాతో సన్నిహితమై దక్షిణాసియాలో పలుకుబడి పెంచుకోవాలనుకుంటున్నారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మన వ్యూహాత్మక ఆధిక్యతను నిలబెట్టుకుంటూ జపాన్, చైనాలతో సఖ్యత కుదుర్చుకోవటం దౌత్యపరంగా మనకు పెను సవాలే. మోదీ దీన్ని ఎలా ఛేదించగలరో చూడాలి.

# ప్రజాస్వామ్యానికే ప్రమాదం!

'ఫాసిజం అనేది ఒక్క రాత్రిలో రాదు. మెల్లమెల్లగా దేశంలోకి చొచ్చుకువస్తుంది. వ్యవస్థలను క్రమంగా బలహీనపరుస్తుంది. ఆ తర్వాత ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా సమాధి చేస్తుంది..' జర్మనీలో నాజీ అనుభవాలను దృష్టిలో ఉంచుకొని చాలా మంది చరిత్రకారులు, రచయితలు చేసిన వ్యాఖ్యలివి.. ప్రస్తుతం భారతదేశం అటువైపే ప్రయాణిస్తున్నదా? అనే తీవ్రమైన ఆందోళన ప్రజాస్వామ్యవాదులను కలచివేస్తున్నది. ఎన్నికల నిర్వహణలో ఎలక్షన్ కమిషన్ వ్యవహరిస్తున్న తీరును ఇటీవల రాహుల్ గాంధీ బయటపెట్టాక.. ఈ ఆందోళన మరింత పెరిగింది. ఇండియాలో కూడా అలాంటి సిద్ధాంతాలను అనుసరిస్తున్నారా అనే అనుమానం వ్యక్తమవుతున్నది. ఈ అనుమానం.. వాస్తవరూపం దాల్చే దారిలో అడుగులు పడక ముందే.. ప్రజలు, ముఖ్యంగా యువత మేల్కొనాల్సిన అవసరముంది. లేకుంటే ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడి.. ప్రజల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుంది. దేశంలో ప్రస్తుతం జరుగుతున్న కొన్ని పరిణామాలు.. ఆనాటి జర్మనీలో నాజీల పాలనా లక్షణాలను గుర్తుకు తెస్తున్నాయని విమర్శకులు, మేధావులు, ఫ్రీలాన్స్ జర్నలిస్టు లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాజీ పాలనలో హిట్లర్ ఒక్కడినే దేశరక్షకుడిగా చిత్రీకరించారు. అప్పుడు జర్మనీలో జాతీయతను ఒక ఆయుధంగా మలిచి.. ప్రశ్నించే, విమర్శించే వారిని దేశద్రోహులుగా ముద్రవేసేవారు. ఇప్పుడు ఇండియాలోనూ భారత్ మాతాకీ జై వంటి నినాదాలను జాతీయతకు, తమ రాజకీయ ఎజెండాకు ఒక సాధనంగా మలుచుకుంటున్నారు. భారత్ లో విపక్ష పార్టీల నేతలు, వారి కుటుంబసభ్యులపై ఈడీ, సీబీఐ, ఐటీ వంటి ప్రభుత్వ సంస్థల ద్వారా వారిని బలహీనపర్చే కార్యక్రమం కొనసాగుతున్నది. ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించే నేతలు, మేధావులు, సామాజిక కార్యకర్తలపై దేశద్రోహం ముద్ర వేసి అనేక సంవత్సరాలుగా జైళ్లలో ఉంచుతున్నారు. మైనార్టీలైన ముస్లింలు, క్రైస్తవుల పట్ల వివక్ష పెరిగేలా కుట్రలు పన్ని అమలు చేస్తున్నారు. సీఏఏ, ఎన్ఆర్సీ వంటి చట్టాలు ఇందులో భాగమే అనే అభిప్రాయాలున్నాయి. గోరక్షకుల దాడులు, మతమార్పిడి ఆరోపణలతో దాడులు, మణిపూర్‌లో జాతి హింస వంటివి ఈ వివక్షను స్పష్టంగా సూచిస్తున్నాయి.

ముఖ్యంగా ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్ పై వస్తున్న తీవ్రమైన ఆరోపణలు ఇందుకు నిదర్శనం. అయితే ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేలా ఈసీ సరైన జవాబు ఇవ్వకపోవడం ఈ అనుమానాలను మరింత బలోపేతం చేస్తున్నది. కొన్నేళ్లుగా వెలువడుతున్న తీర్పులను చూస్తే న్యాయవ్యవస్థపైనా ఒత్తిడి ఉన్నట్లు స్పష్టమవుతున్నది. అంతేకాకుండా గతంలో బీజేపీ ప్రతినిధిగా పని చేసిన ఒక నాయకురాలిని బాంబే హై కోర్టు జడ్జిగా ప్రతిపాదించడం కూడా ఇందులో భాగమేననే చర్చ జరుగుతున్నది. 'ఎలాంటి నేరం చేయకున్నా దేశంలోని అనేక మంది కవులు, రచయితలు, ప్రొఫెసర్లు, న్యాయవాదులు జైళ్లలో మగ్గుతున్నారు.. కానీ బహిరంగంగా మారణహోమానికి పిలుపునిచ్చేవారికి మాత్రం బెయిల్ దొరుకుతున్నది' అని అరుంధతి రాయ్ ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. విమర్శనాత్మక ఆలోచనలను అణచివేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. విమర్శలు చేసినందుకు జేఎన్ యూ వంటి వర్సిటీల్లో విద్యార్థులు, ప్రొఫెసర్లు దాడులకు గురైన సందర్భాలు ఉన్నాయి. ఇదీ జర్మనీలో నాజీల విధానాన్ని గుర్తుకు తెస్తున్నాయన్నారు. జోసెఫ్ గోబెల్స్ నాయకత్వంలోని ప్రచార మంత్రిత్వ శాఖ జర్మనీలో మీడియాను పూర్తిగా నియంత్రించింది. ఇప్పుడు భారతదేశంలో మీడియా స్వేచ్ఛ క్రమంగా క్షీణిస్తున్నదని రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ వంటి సంస్థలు గుర్తించాయి, 2025 వరల్డ్ ఫ్రీడమ్ ఇండెక్స్ ప్రకారం 180 దేశాల్లో మీడియా స్వేచ్ఛలో ఇండియా 151వ స్థానంలో ఉన్నది. అంతేకాకుండా ప్రతిసంవత్సరం వివిధ కారణాలతో వందలాది మంది జర్నలిస్టులను అరెస్ట్ చేస్తున్నారు. జర్నలిస్టుల హత్యలు సైతం జరుగుతున్నాయి. నాజీల పాలనలో మీడియా అంతా ప్రభుత్వ అనుకూల వార్తలను మాత్రమే ప్రసారం చేసేది. భారత్ లోనూ ప్రస్తుతం మీడియా ప్రభుత్వ వ్యతిరేక వార్తలకు చోటివ్వకుండా ప్రభుత్వ భజననే చేస్తున్నది.

# జిన్నూరులో వంతెన నిర్మాణం పనులు వేగవంతం చేయాలి



**పోడూరు, ఆగస్టు 31,ప్రజాజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).**జిన్నూరు లో కొత్త వంతెన నిర్మాణం పనులు వేగవంతంగా చేయాలని సిపిఎం జిన్నూరు శాఖ కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి డిమాండ్ చేశారు. పశ్చిమగోదావరి జిల్లా కోడూరు మండలం జిన్నూరులో గురువారం జిన్నూరు శాఖ చివటపు ఆంజనేయులు అధ్యక్షతన జరిగింది.ముందుగా సిపిఐ నాయకులు కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి కి సంతాపం తెలిపి నివాళర్పించి జిన్నూరు లోని పేరుకుపోయి ఉన్న సమస్యలపై తీర్మానం చేసారు. ఈసందర్భంగా నరసింహామూర్తి మాట్లాడుతూ జిన్నూరు లో అనేక సమస్యలు కోకొల్లలుగా పేర్కుపోయాయని వాటిలో నరసాపురం వెళ్లే కాలువపై గత వైసీపీ నిర్మాణం చేసిన వంతెన ఇంతవరకు నిర్మాణం కాలేదన్నారు. ప్రస్తుతం ఉన్న కూటమి ప్రభుత్వం 15నెలలు గడుస్తున్నా కొంత మేర పనులుచేసి ఆగిపోయాయనివెంటనే నిర్మాణం పనులు వేగవంతం చేయాలన్నారు. పాత వంతెన ఎప్పుడు కులుతుందో నని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.త్రాగునీరు సమస్య అధికంగా ఉందని వెంటనే త్రాగునీరు కుళాయి పైపులు ద్వారా ప్రజలకు అందించాలన్నారు.వర్షాలు కురిస్తే నీరు వెళ్లే మార్గంలేక కాలనీల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని వెంటనే డ్రైనేజీలు నిర్మించాలని కోరారు.కూటమి ప్రభుత్వం పెంచిన కరెంట్ ట్రూ అఫ్ చార్జీలు తగ్గించాలన్నారు. స్మార్ట్ మీటర్లు వేసే పనిని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వీటివల్ల పేద, మధ్యతరగతి ప్రజలు నానా ఇబ్బందులుకు గురవుతారని తెలిపారు. స్మార్ట్‌మీటర్ల ను ప్రజలందరూ తిరస్కరిచాలని ఆయన పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో తాళాబత్తుల గాంధీ,చివటపు ఆంజనేయులు, తేతలి వెంకటేశ్వర్లు, ఎలుదుర్తి నాగేశ్వరావు తదితరులు పాల్గొని మాట్లాడారు.

# గంగమ్మ తల్లి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలి.





వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డిలి

**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** గంగమ్మ తల్లి కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, సంవృద్ధిగా వర్షాలు కురిసి రైతులు, ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా, సుఖశాంతులతో చల్లంగా ఉండేలా చూడు తల్లి అంటూ శ్రీ శ్రీ అనంతపురం గంగమ్మ దేవతకు వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని అనంతపురం గ్రామంలో వెలిసిన శ్రీ అనంతపురం గంగమ్మ దేవత ఆలయం వద్ద అమెరికాలో స్థిరపడ్డ గున్నికుంట్లకు చెందిన దండు శేఖర్ రెడ్డి ఇచ్చిన విందు కార్యక్రమానికి స్థానిక ఎంపీపీ మద్యులో సుదర్శన్ రెడ్డి, స్థానిక సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ సిబ్బంది ,పూజారులు వారికి అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేశారు .అనంతరం వారిని దుశ్యాలు వాళ్లతో సత్కరించి పూలమాలతో సన్మానించారు.శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ తల్లి ఆశీస్సులు ఈ ప్రాంత ప్రజలకు ఎల్లవేళలా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లు జగన్మోహన్ రెడ్డి, శంకర్ నాయుడు,మాజీ సర్పంచ్ భువనేశ్వర్ రెడ్డి, మైనార్టీ నాయకులు చాన్ భాషా , జాకీర్ ,బాబ్జాన్, వైఎస్ఆర్సిపి నాయకులు శిద్దారెడ్డి, సాయిరెడ్డి, మహేష్ , నారాయణ , తదితరులు పాల్గొన్నారు.

# మాజీ సైనికుడు దొమ్మేటి సత్యనారాయణ దంపతుల షష్టిపూర్తి మహోత్సవం




**ఏలూరు ఆగస్టు 31 ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి** ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం అన్నపూర్ణ రెసిడెన్సీలో మాజీ సైనికుడు దొమ్మేటి సత్యనారాయణ దంపతుల షష్టిపూర్తి మహోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన ఎస్బీఐ ఉద్యోగ విరమణ సందర్భంగా కూడా శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమానికి రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తాండ్ర సాంబశివరావు హాజరై శుభాకాంక్షలు తెలిపారు. సత్యనారాయణ గారు నిజాయితీ, నిష్ఠలకు ప్రతీకగా నిలిచారని, దేశానికి సైనికుడిగా సేవలందించిన తరువాత ఎస్బీఐ ఉద్యోగిగా రిటైర్మెంట్ పొందడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర మాజీ సైనిక సంక్షేమ సంఘం కమిటీలో అకౌంట్స్ నామినేటెడ్ కోశాధికారిగా బాధ్యతలు స్వీకరించడం విశేషమని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ ప్రధాన కార్యదర్శి డా. సూరెడ్డి శివకుమార్, కోశాధికారి కె. ఉమామహేశ్వరరావు, టెక్నికల్ ఇన్‌చార్జ్ అడపా శంకర్, బాపట్ల అసోసియేషన్ జనరల్ సెక్రటరీ షేక్ మొహినుద్దీన్, సీనియర్ మాజీ సైనికులు డి. వెంకటేశ్వర్లు, రుక్మధరరావు తదితరులు పాల్గొన్నారు.

# కోంర్రుకోట,వాడపల్లి, ఆర్ ఆర్ కాలనీలో గణేష్ నిమజ్జనం ఊరేగింపు



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ ఆగస్టు 31** పోలవరం మండలం ఆర్ అండ్ ఆర్ కాలనీలో వినాయక చవితి ఐదో రోజు సందర్భంగా కోంర్రుకోట, వాడపల్లి ఆర్ ఆర్ కాలనీ వాసులు విధులల్లో ఘనంగా గణేష్ నిమజ్జన ఊరేగింపు కార్యక్రమాలు భక్తులు నిర్వహించారు. ఏలూరు జిల్లా పోలవరం మండలంలో పునరావాసం గ్రామలు కోంర్రుకోట, మాధాపురం, కొత్త మామిడిగొంది, తెల్లవరం, గాజులగొంది, వాడపల్లి, కాలనీ వైపుగా బైరోడ్డు మార్గంలో రేపలివాడ, ప్రగడపల్లి, గ్రామలు రోడ్ లో బయలుదేరి గణపతి పప్పా మోరియా, గణపతి పప్పా మోరియా, గణపతి పప్పా మోరియా, స్లోకలతో తెలియజేస్తూ పట్టిషం చేరుకొని గోదావరి నది తీర్రన్న గణేష్ భక్తులు పూజ హారాతలు, నిర్వహించి ఘనంగా గణేష్ నిమజ్జనం కార్యక్రమాలు చెప్పటారు. అనంతరం గంగమ్మ తల్లి పవిత్ర గోదావరి నదిలో తలస్నానలు ఆచరించి తమా గ్రామాలకు బయలుదేరారు. పట్టిసం గణేష్ నిమజ్జనం కార్యక్రమాలకు వచ్చే భక్తులు పోలవరం డి. ఎస్. పి. వెంకటేశ్వరరావు ఆదేశాలతో, సి.ఐ పర్యవేక్షణలో స్టేషన్ ఎస్. ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో పెర్రీ పాయింట్ వద్ద నిమజ్జన కార్యక్రమాలు చేపడుతున్న గణేష్ భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు జరగకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు, బందోబస్తు భద్రతలు మధ్య పోలీస్ సహాయ సహకారాలు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు జారేపల్లి విద్యా సాగర్, మడకం జగన్, పూనెం. సత్యనారాయణ, మేదె బొత్త ముక్కయ్య, తమా కన్నాపరాజు, వాడపల్లి... కరకం కుమారి, కొవ్వసి వెంకటస్వామి, కృష్ణమూర్తి, పూనెం జేయేంద్ర, సంఘ మంగ, కుంజం మురళీ, తదితరులు పాల్గొన్నారు.

# 70 వేల రూపాయలు పలికిన గాంధీనగర్ లోని వినాయకుని లడ్డు వేలం పాటలో దక్కించుకున్న వంకెల బ్రదర్స్



**బద్వేల్ ఆగస్టు 31 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణం గాంధీనగర్ లో నిర్వహించిన వినాయక ఉత్సవాలు ఐదు రోజులు అంగరంగ వైభవంగా జరిగాయి. భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో గణపతి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన లడ్డు వేలం పాటలో భక్తులందరూ ఉత్సాహంగా పాల్గొన్నారు ఈ వేలం పాటలో వంకెల బ్రదర్స్ పెద్ద పోల్ రెడ్డి. చిన్న పోల్ రెడ్డి. జయరాం రెడ్డిలు పాల్గొని లడ్డూను 70 వేల రూపాయలకు కైవసం చేసుకున్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు వారికి శాలువా పూలదండ తో సన్మానం చేసి లడ్డు ప్రసాదన్ని అందజేశారు.

# మధ్యంతర భృతి, కరువు బత్యం వెంటనే ప్రకటించాలి

ఏపీ యుఎస్ సంఘ నాయకులు




**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 31 ( ప్రజా జ్యోతి)** అన్నమయ్య జిల్లా కార్యకర్తల సమావేశం స్థానిక ఆఫీసు నందు నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా అన్నమయ్య జిల్లా ఏపీ యుఎస్ అధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ ఉపాధ్యాయ పెన్షనర్ల ఆర్థిక బకాయిలు డి ఎ మద్యంతర భృతి త్వరలో పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఏపీ యుఎస్ రాష్ట్ర కార్యదర్శి మధుమతి గారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక బకాయిలు త్వరగా చెల్లించాలని కోరారు. అన్నమయ్య జిల్లా ఏపీ యుఎస్ సహాధ్యక్షులు జి నాగేంద్రబాబు మాట్లాడుతూ ఇటీవల బదిలీ పొంది న ఉపాధ్యాయుల స్థానంలో డీఎస్సీ ద్వారా వచ్చే కొత్త ఉపాధ్యాయులను నియమించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నాగేశ్వర్, జిల్లా కార్యదర్శి బాలాజీ, మల్లికార్జున, వెంకటయ్య ,మనోహర ,మోహన ,చంద్రశేఖర్, వెంకటకృష్ణ తదితర మండలాల ఉపాధ్యాయులు హాజరు కావడం జరిగినది

# విఘ్నాలను తొలగించే వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరికీ చేకూరాలి


వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిలి



**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 31 ( ప్రజా జ్యోతి)** విఘ్నాలను తొలగించే వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరికీ చేకూరాలని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి కోరారు.లక్కిరెడ్డిపల్లె మండలం చౌటపల్లెలో ఆదివారం నిర్వహించిన వినాయకుడి నిమ్మజ్జన ఊరేగింపు సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఊరేగింపులో మహిళల కోలాటాలు, యువత ఉత్సాహాల నడుమ శ్రీకాంత్ రెడ్డికి గ్రామ ప్రజానీకం విశేష స్వాగతం పలికింది. తీర్థ ప్రసాదాలు అందించి గ్రామస్తులు,యువత శ్రీకాంత్ రెడ్డి ని సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వినాయకుడు విశ్వశాంతికి ప్రతీక అని అన్నారు. గణనాధుని కరుణతో ప్రజలందరూ ఆరోగ్యంగా, సుఖంగా, సంక్షేమంగా ఉండాలని ఆకాంక్షించారు. ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, వైస్ ఎంపీపీ సమరసింహారెడ్డి, ఎంపిటీసీలు జగన్మోహన్ రెడ్డి, శంకర్ నాయుడు, పార్టీ శ్రేణులు శిద్దారెడ్డి, మహేష్, అంజి, గంగరాజ్, బాబ్జాన్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# మద్దిరేవుల లక్ష్మమ్మ భౌతికాయానికి నివాళులు అర్పించిన


వైఎస్ఆర్సిపి యువ నాయకులు గజేంద్ర రెడ్డిలి



**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** లక్కిరెడ్డిపల్లి దిన్నేపాడు గ్రామం లో బెస్తపల్లి హరిజనవాడ చెందిన వైఎస్ఆర్సిపి కార్యకర్త మద్దిరేవుల వాసు , ఓబులేసు( అన్నదమ్ములు) మాతృమూర్తి లక్ష్మమ్మ అనారోగ్యంతో బాధపడుతూ కడప రిమ్స్ లో తెల్లవారుజామున శ్వాస విడిచారు. స్థానిక నాయకులు కు గజేంద్ర రెడ్డి వెంటనే తెలియగా సెల్ఫోన్ ద్వారా వాసు ను పరామర్శించి ఉదయం అక్కడికి చేరుకొని పార్థ దేహానికి పూలమాలవేసి , ప్రగాఢ సానుభూతిని తెలిపి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి కార్యకర్తలు యువకులు తదితరులు పాల్గొన్నారు

# విఘ్నాలను తొలగించి వినాయకుడు ఆశీస్సులు అందరికీ ఉండేలా

గణనాథుడి పూజ లో వైఎస్ఆర్సిపి యువ నాయకులు గజేంద్ర రెడ్డి



**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** దీన్నేపాడు గ్రామం మాల పల్లి నందు గ్రామస్తుల ఆహ్వానం మేరకు గణేష్ నిమజ్జనం సందర్భంగా ప్రత్యేక పూజలు , చేసి అన్నదానం కార్యక్రమంలో వినాయకుడు నిమజ్జనంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో దీన్నేపాటి గజేంద్ర రెడ్డి స్వామి కి కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా గజేంద్ర రెడ్డి మాట్లాడుతూ వినాయకుడి ఆశీస్సులతో ప్రజలందకి సుఖ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాగరాజ ,వెంకట రమణ,రవి, వాసు, రాంబాబు, ఈశ్వరయ్య, రఘురామ, మల్లికార్జున, సింహాద్రి, రెడ్డయ్య, హరి,శివ,శివ గణపతి, మదన్ , చందు, తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆధ్వర్యంలో రిటైరైన పోలీస్ సిబ్బందికి ఘన సన్మానం



**బాపట్ల ఆగస్టు 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లాలో పదవీ విరమణ పొందిన పోలీస్ సిబ్బందిని ఘనంగా సన్మానించి ఆత్మీయంగా వీడ్కోలు పలికారు జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్.ఆదివారం స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పిజిఆర్ఎస్ సెల్‌లో ఎస్.ఐగా విధులు నిర్వహించిన డి.వి. డేవిడ్, స్పెషల్ బ్రాంచ్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేసిన ఎన్. రామకోటేశ్వరరావు లకు జిల్లా ఎస్పీ పూలమాలలు వేసి, దుశ్శాలువా కప్పి ఘనంగా సన్మానించారు.43 సంవత్సరాల పాటు పోలీస్ శాఖకు సేవలందించిన డి.వి. డేవిడ్, 39 సంవత్సరాలు విశేష సేవలందించిన ఎన్. రామకోటేశ్వరరావు పదవీ విరమణ పొందడం అభినందనీయమని జిల్లా ఎస్పీ ప్రశంసించారు. పోలీస్ శాఖ విధులు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే భిన్నమై, 24 గంటలు అప్రమత్తంగా ఉండే బాధ్యతాయుతమైనవని ఆయన అన్నారు. కుటుంబ సహకారం వల్లే సిబ్బంది సుదీర్ఘకాలం పాటు విశేష సేవలు అందించగలిగారని పేర్కొన్నారు.పదవీ విరమణ తరువాత కూడా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ఎటువంటి సమస్యలైనా నేరుగా తెలియజేయవచ్చని ఎస్పీ భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ పి. విజయసారథి, వెల్ఫేర్ ఆర్.ఐ. మౌలిద్దీన్, ఇతర పోలీసులు, సిబ్బంది, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీ హెచ్చరిక తొలగించిన వికలాంగుల పెన్షన్లు తిరిగి వారికి మంజూరు చెయ్యాలని డిమాండ్



**గోపవరం ఆగస్టు 31( ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ పట్టణము లో ఈరోజు దివ్యాంగుల పెన్షన్ల తొలగింపు అలాగే వైకల్య శాతం తగ్గింపు మరియు ఉచిత బస్సు పాసులకై దివ్యాంగుల సమావేశం నిర్వహించడం జరిగినది. రఫీ ఆధ్వర్యంలో ఈరోజు. ఈ సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ఓబులేసు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వీరశేఖర్ గారు మరియు సిపిఐ బద్వేల్ పట్టణ కార్యదర్శి బాలు హాజరయ్యారు ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ఓబులేసు మాట్లాడుతూ ..కూటమి ప్రభుత్వ ఏర్పడిన తర్వాత దివ్యాంగుల పెన్షన్లు పెంచడం సంతోష మే కానీ అదే పింఛన్లు భారంగా భావించి రాష్ట్రములో లక్ష్య మందికి పైగా వికలాంగులను తొలగించడం బాధాకరంగా ఉందన్నారు అలాగే వికలాంగుల వైకల్య శాతాన్ని తగ్గించటం సరైనటువంటి పద్ధతి కాదని సదురు సర్టిఫికెట్ల గురించి ఇచ్చిన వైకల్య శాతాన్ని గురించి రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడటం లేదన్నారు గతంలో ఇచ్చిన వైకల్య శాతానికి ఇప్పుడు ఇచ్చిన శాతానికి పూర్తి భిన్నంగా ఉందన్నారు దీని ద్వారా అనేకమంది దివ్యాంగులకు ఉద్యోగాలు, ఉపాధి ఇతర సంక్షేమ పథకాల ఇబ్బందులు ఏర్పడతాయన్నారు.. గత ప్రభుత్వం హయాంలో జరిగిన బోగస్ సర్టిఫికెట్లను మాత్రమే పరిశీలించకుండా 2010 నుండి 2025 వరకు అందరినీ వైకల్య పరీక్షలు నిర్వహించి అనేకమంది నిజమైనటువంటి దివ్యాంగులకు అన్యాయం జరిగిందన్నారు. ఈ పరిస్థితుల్లో కుటుంబాలలో పెన్షన్ పై ఆధారపడి జీవిస్తున్న అనేకమంది దివ్యాంగులకు అన్యాయం జరుగుతుందన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లే దివ్యాంగులకు ఉచిత బస్సు పాసుల సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు వీరశేఖర్ గారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళ్లు, కాళ్లు అవయవాలు లేని దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల మంది దివ్యాంగులు ఉంటే వారికి పెన్షన్లు ఇవ్వలేనటువంటి దౌర్భాగ్య స్థితిలో ప్రభుత్వం ఉందని అన్నారు. ఇప్పటికే లక్షమంది అనర్హులని వారి కి పెన్షన్లు లేకుండా చేయటం సరైనటువంటి విధానం కాదు అన్నారు. సదరం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ లో జరిగినటువంటి వైకల్యం శాతాలను వైకల్య ప్రభావాన్ని బట్టి నిర్ధారించాలన్నారు. డాక్టర్లు నిర్లక్ష్యానికి దివ్యాంగులు బలైపోతున్నారు ప్రభుత్వం చేసిన తప్పును సమర్థిస్తున్నారు ఇది మంచిది కాదు అన్నారు ప్రభుత్వం ఇస్తున్నటువంటి సంక్షేమ పథకాలలో ప్రధానంగా ఇళ్ల స్థలాల విషయంలో దివ్యాంగులకు అన్యాయం జరుగుతుందన్నరు స్త్రీలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడం మంచిదే అందులో దివ్యాంగులను ఉచితంగా ప్రయాణించడం అనేది న్యాయబద్ధమైనటువంటి కోర్కె అన్నారు ప్రభుత్వం వెంటనే తన వైఖరిని మార్చుకోకపోతే దివ్యాంగుల పక్షాన నిలబడి పోరాడుతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ బద్వేల్ పట్టణ కార్యదర్శి పి బాలు , బద్వేల్ ఏరియా కార్యదర్శి సభ్యులు పీవీ రమణ, బద్వేల్ రూరల్ కార్యదర్శి ఇమ్మానియేల్ సిపిఐ నాయకులు పి వెంకటరమణ, పొంగూరు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.ఈ సమావేశం తదనంతరం దివ్యాంగుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ఇండ్ల ఓబులేష్, పట్టణ అధ్యక్షులు చింతకుంట రఫీ, నాగూర్, కేశవయ్య, రమణయ్య, బాబు, సభ్యులను భారత కమ్యూనిస్టు పార్టీ ( సిపిఐ ) లోకి కండువాతో ఆహ్వానించడం జరిగింది.

# అంగరంగ వైభవంగా విజయ గణపతి స్వామికి అభిషేకం,అన్నదానం







## బిముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్

**తిరుపతి జిల్లా ప్రతినిధి ప్రజా జ్యోతి** తిరుచానూరు పంచాయతీ పరిధిలోని నేతాజీ నగర్లో వెలసిన ఉన్న విజయ గణపతి ఆలయంలో ఆదివారం అభిషేకం,అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలో పాల్గొని ,అన్నప్రసాద వితరణ చేశారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు,బిజెపి మహిళా నాయకురాలు పుష్ప ముని రామ్ రెడ్డి దంపతులు,అర్చకులు ఘన సన్మానం చేసి తీర్థ ప్రసాదాలు అందజేసారు. వినాయక చవితి వేడుకలలో భాగంగా 5 వ రోజు విజయ గణపతి స్వామి వారికి ప్రత్యేక పూజలు,అభిషేకం నిర్వహించారు.స్థానిక నేతాజీ నగర్ నివాసి కె.రామచంద్ర నాయుడు కుటుంబ సభ్యులతో,ఆలయ నిర్వాహకులతో కలిసి సుమారు 500 వందల మందికి,పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో స్థానికులు,భక్తులకు స్వామి వారిని దర్శించుకుని తీర్థ, అన్న ప్రసాదాలు పంపిణీ స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయ గణపతి స్వామి వారికి ప్రతీ ఏటా వినాయక చవితికి ఇదే విధంగా ఘనంగా పూజలు, అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామని అన్నారు. ఆలయాన్ని ప్రారంభించిన కొద్ది రోజుల కే భక్తులు ఎంతో భక్తితో స్వామిసేవలో తరిస్తున్నారని ఆనందం వ్యక్తం చేసారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు,స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న డా బూసి వెంకటస్వామి.




**పోదూరు, ఆగస్టు 31,ప్రజాజ్యోతి న్యూస్(రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** దక్షిణాది రాష్ట్రాలలో అత్యంత ప్రతిభావంతులైన, వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికిచ్చే డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారాన్ని అద్దేపల్లి సత్యనారాయణ మూర్తి ప్రభుత్వ స్వయం ప్రతిపత్తి కళాశాల తెలుగు శాఖాధిపతి డా బూసి వెంకటస్వామి అందుకున్నారు. ఆదివారం గుంటూరు లోని లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో యస్ పి యల్ టి వో ( సదరన్ ప్రైవేటు లెక్చరర్స్ టీచర్స్ ఆర్గనైజేషన్ ) ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో వెంకటస్వామికి అవార్డు అందజేశారు .సభాధ్యక్షులు మాజీ ఎమ్మెల్సీ కె.ఎస్.లక్ష్మణ రావు, ముఖ్య అతిధి సత్తెనపల్లి మాజీ ఎమ్మెల్యే చలపతి, గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్ యలమంచిలి ఆంజినేయులు, అప్పుస్మా డైరెక్టర్ కాటూరి వెంకటేశ్వరరావు,ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పాలకవర్గ సభ్యులు,ప్రముఖ విద్యావేత్త డా వి కన్నామాష్టారు చేతుల మీదగా ఈ అవార్డు అందుకున్నారు. డా సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్న డా బూసి వెంకటస్వామిని కళాశాల ప్రిన్సిపాల్ డా తిరువీధుల రాజరాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ టి కృష్ణ,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థినీ,విద్యార్థులు,తెలుగు సాహితీ, భాషాభిమానులు అభినందనలు తెలిపారు.

## రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ డెవలప్మెంట్ డైరెక్టర్ గా నియమితులైన యర్రగోళ్ల పెద్ద రెడ్డయ్య యాదవ్

అభినందనలు తెలిపినా

లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ ఎండి షేక్ షఫీ నాయక్



**లక్కిరెడ్డిపల్లి ఆగస్టు 31 (ప్రజా జ్యోతి)** అక్కిరెడ్డిపల్లి మాజీ జడ్పిటిసి రాష్ట్ర ఫారెస్ట్ కార్పొరేషన్ డైరెక్టర్గా నీ నియమితులైన సందర్భంగా మార్కెట్ యార్డ్ చైర్మన్ ఎస్ ఎండి షేక్ షఫీ నాయక్ శాలువతో, బొకేలతో అభినందించి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండలం టిడిపి నాయకులు కార్యకర్తలు, యూనిట్ కన్వీనర్లు, బూత్ కన్వీనర్లు, తదితరులు పెద్ద ఎత్తున, శుభాకాంక్షలు తెలిపారు.

## వైయస్ఆర్సీపీ జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీ గా... సుంకర కొండబాబు



**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ ఆగష్టు 31** పోలవరం మండలం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి తనయుడు సుంకర కొండబాబుకి వైఎస్ఆర్సిపి పార్టీ హై కమాండ్ ఆదేశాల మేరకు వైయస్సార్సీపి ఏలూరు జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీ గా నియమించడం జరిగింది. ఈ సందర్భంగా మాజీ శాసనసభ్యులు తెల్లం బాలరాజు ని మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకే ఇచ్చి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు ఎంపీపీ సుంకర. వెంకటరెడ్డి, ఎంపీటీసీ దేగపాటి హరే రామకృష్ణ, జల్లేపల్లి. శివరామకృష్ణ, డాక్టర్ శీను, పొడుం. శ్యాం కుమార్, సుంకర. రామ్ కుమార్, గణేష్, హరి,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## పోలవరం ప్రాజెక్టు ఎస్పీఎఫ్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో అన్నసమరాధన కార్యక్రమం...




**పోలవరం ప్రజా జ్యోతి న్యూస్ ఆగష్టు 31** పోలవరం ప్రాజెక్టు చెక్ పోస్ట్ నందు ఎస్పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా సుమారు 1000 మందికి అన్న సమరాధన చేసినట్లు ప్రాజెక్ట్ ఎస్పీఎఫ్ పోలీస్ సిబ్బంది తెలియజేశారు. భక్తులు ప్రజలు అన్న ప్రసాదలను పాల్గొని అన్న ప్రసాదాలను సేకరించారని వారు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు ఎస్పీఎఫ్ పోలీస్ సిబ్బంది, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు. అనంతరం వినాయకుడు లడ్డు పాటను నిర్వహించారు కాగా లడ్డు వేలం పాటలో ప్రాజెక్ట్ ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ దేవేంద్రుడు 13,200 రూ, లకు దక్కించుకున్నారు.

## ఘనంగా అన్నదాన సత్రం వీధి శ్రీ వరసిద్ధి వినాయక నిమజ్జనం కమిటీ వినాయక చవితి వేడుకలు



**తిరుపతి జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి** తొలిపూజలందుకునే విఘ్నేశ్వరుడు అన్ని విఘ్నాలు తొలగించి, అందరిపై కరుణ కృపాకటాక్షాలు ఉండాలని రేణిగుంట అన్నదాన సత్రం వీధిలోని యూత్ వినాయక చవితి రోజున స్వామివారి విగ్రహానికి ఘనంగా పూజలు చేశారు. ఉదయం స్వామివారి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి, వైభవంగా మహాగణపతి హెూమం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. మధ్యాహ్నం అన్నదానం, స్వామివారి లడ్డూ ప్రసాదం వేలంపాటలో రవి గారు స్వామి వారి లడ్డూ ప్రసాదం సొంతం చేసుకున్నారు. తరువాత బాజా భజంత్రీలతో స్వామి వారి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. రవి మాట్లాడుతూ స్వామి వారి ప్రసాదం సొంతం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అన్నదానసత్రం వీధి యూత్ సాయి చందు, జితేంద్ర, వంశీ, శ్యాము, ఓంకార్, సాయిరాహుల్ నవీన్, నాగరాజు, ఉమేష్, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఇవాళ



**బాపట్ల ఆగస్టు 31 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)** జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ప్రకటనలో తెలిపారు ప్రకారం, సోమవారం కలెక్టరేట్, ప్రతి మండల రెవెన్యూ కార్యాలయం, రేపల్లె, చీరాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించబడుతుంది. అర్జీలు సమర్పించడానికి వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని, నమోదు చేసిన అర్జీల స్థితి తెలుసుకోవడానికి 1100 నంబర్‌కు కాల్ చేయవచ్చని కలెక్టర్ వివరించారు.

## పలు చోట్ల అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ప్రణీత్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు




**తిరుపతి జిల్లా ప్రతినిధి ప్రజాజ్యోతి** అన్నం పరబ్రహ్మ స్వరూపం అని ప్రణీత్ పెనుమాదు అన్నారు. ఆదివారం తిరుపతిలో స్థానికంగా ఉన్న రవీంద్ర నగర్ రెండవ క్రాస్ రోడ్ లో ప్రణీత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రణీత్ ఫౌండేషన్ అధినేత ప్రణీత్ పెనుమాదు భారీ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.అలాగే పలు వినాయక మండపాలను సందర్శించింది తన మొక్కులను తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ప్రణీత్ మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పలుచోట్ల అన్నదాని కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో ప్రణీత్ ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. అన్నసంతర్పణలో దాదాపుగా 600 మందికి పైగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రణీత్ ఫౌండేషన్ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర కీలకం

- మండల అభివృద్ధికి ఎంపిడిఓ మన్మథ రావు సేవలు ఎనలేనివి
- అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
- పి. ఎ.సి.ఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్యన్నారాయణ ,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్
- ఘనంగా ఎంపిడిఓ మన్మథ రావు ఉద్యోగ విరమణ కార్యక్రమం





**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్:** ప్రభుత్వ విధానాలను అమలు చేయడంలో ,ప్రజలకు సమర్ధవంతంగా సేవలు అందించడంలో ,పారదర్శకతను పెంచడంలో ప్రభుత్వ ఉద్యోగుల పాత్ర అత్యంత కీలకమని పి. ఎ.సి.ఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకట సత్యన్నారాయణ,టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ అన్నారు. ఆదివారం నాడు ఎంపిడిఓ కార్యాలయంలో పొందూరు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా విధులు నిర్వహించిన మీసాల మన్మధారావు ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూన వెంకట సత్యన్నారాయణ, చిగిలపల్లి రామ్మోహన్ ముఖ్య అతిధులుగా హాజరై మన్మథ రావు, మంగమ్మ దంపతులను శాలువాతో సత్కరించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన పలు రకాల సేవలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి ఎంపిడిఓ విశేషంగా కృషి చేశారన్నారు. పొందూరు మండలంలో మండల పరిషత్ కార్యకలాపాలను అన్ని శాఖల సిబ్బందిని సమన్వయం చేస్తూ ప్రభుత్వ పనులను నిర్విరామంగా నిర్వహించారన్నారు. ప్రజల భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తూ ,వారి సమస్యలను ఉన్నత అధికారులకు చేరవేస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతీ ఒక్క పథకంపై ప్రజలకు అవగాహన కల్పించి ప్రతీ ఒక్క పథకాన్ని ప్రజలకు చేరువ చేయడంలో ఆయన విశేషంగా కృషి. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కిల్లి ఉషారాణి ,సర్పంచ్ రేగిడి లక్ష్మీ,మండల స్పెషల్ ఆఫీసర్ రఘు నాడు ,ఈ. ఓ.పి.ఆర్.డి పొందూరు సింహాచలం ,జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు, జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి బలగ శంకర భాస్కర రావు,మండల ఉపాధ్యక్షులు బాడాన శేషగిరి ,మండల మహిళా అధ్యక్షురాలు అనకాపల్లి విజయలక్ష్మీ ఏ.ఎం.సి మాజీ ఛైర్మెన్ అన్నెపు రాము పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ,చింతాడ వాసుదేవ రావు ,కిల్లి నాగేశ్వర రావు ,పంచాయతీ ఈ. ఓ కింతలి మోహన్ బాబు ఏ.పి. ఓ పైల శ్రీనివాస రావు, కొంచాడ రమణ మూర్తి వండాన వెంకట్రావు , బాడాన సునీల్ , రిటైర్డ్ ఉపాధ్యాయులు కోరుకొండ విజయ్ కుమార్ ,సీనియర్ అసిస్టెంట్ కోనారి ఆంజనేయులు , జూనియర్ అసిస్టెంట్ సునీల్ కుమార్ టైపిస్ట్ రాజేష్ ,పలాస ఎంపిడిఓ వసంత కుమార్,వంగర రిటైర్డ్



ఎంపిడిఓ ఎం.టి.వి ప్రసాద్ , గార రిటైర్డ్ ఎంపిడిఓ సిమ్మ రామ్మోహన్ రావు ,కాశీ విశ్వనాథం ,మందస జెడ్పీ స్కూల్ హెచ్.ఎం మక్కా శ్రీనివాస రావు ,ఆమదాలవలస రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ కృష్ణా రావు బూర్జ ఎంపిడిఓ ఎం రవీంద్ర బాబు ,మండల పరిషత్ కార్యాలయం సిబ్బంది ,ఎన్.ఆర్.జి.ఈ.ఎస్ సిబ్బంది ,సచివాలయ సిబ్బంది ,సర్పంచులు , ఎంపిటిసిలు, మన్మథ రావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఎస్‌జిఎన్‌పేట గ్రామంలో ఆర్కిటెక్ట్ మేఘసాయి వినూత్న ఆలోచన

- సహజ సౌందర్యంలో 'బియ్యం'తో గణేశు ని సృజనాత్మక రూపకల్పన

ఎస్‌జిఎన్‌పేట గ్రామం కళాత్మకతకు, సహజసిద్ధతకు మరో అద్భుతం జోడించింది

**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం దల్లవలస పంచాయతీ ఎస్.జి. ఎన్ పేట గ్రామానికి చెందిన యువ ఆర్కిటెక్ట్ మేఘసాయి తన సృజనాత్మకతను వినూత్నంగా పరిచయం చేశారు. 75 కేజీల బియ్యం గింజలతో లార్డ్ గణేశుడి ప్రతిమను రూపొందించారు.ఈ బొమ్మ ని చైయుటానికి కేవలం 2 రోజులు పట్టింది అని మేఘసాయి తెలిపారు.ఆయన తల్లిదండ్రులు దగ్గర ఉండి వినాయకుని ప్రతిమను చూసుకుంటున్నారన్నారు.గణేశ చతుర్థి సందర్భంగా సాంప్రదాయ మట్టి విగ్రహాల బదులు పర్యావరణానికి మేలు చేసే పద్ధతులు అందించాలన్న ఆలోచనతో ఈ రూపకల్పన చేసినట్లు మేఘసాయి తెలిపారు. “రైతుల కష్టం మనకు అన్నం ఇస్తుందని, బియ్యం మన సంస్కృతి ప్రతీక అన్నారు.దానితో దేవుడి రూపం సృష్టించడం రైతులకు గౌరవ సూచకం” అని చెప్పారు. ?ఈ కార్యక్రమానికి శ్రీరామ కమ్యూనిటీ సభ్యులు విశేష సహకారం అందించారు.గ్రామంలో వ్యవసాయం, ప్రకృతి సంరక్షణపై అవగాహన కలిగించే విధంగా ఈ సృజన ఆకర్షణగా నిలిచింది. “ప్లాస్టర్ విగ్రహాలు పర్యావరణానికి హాని చేస్తాయి. అందుకే బియ్యం, సహజ పదార్థాలతో దేవుడి విగ్రహాలు తయారు చేయడం ఉత్తమం” అని రైతు సంఘం సభ్యులు అభిప్రాయపడ్డారు.ఈ ప్రతిమ ఆవిష్కరణతో పాటు రైతు పంటల ప్రదర్శన, గ్రామీణ కళల ప్రదర్శనలు కూడా జరిగాయి. ఆర్కిటెక్ట్ మేఘసాయి ఆధ్వర్యంలో గ్రామంలోని యువత పర్యావరణాన్ని కాపాడే నూతన మార్గాలు ఆచరిస్తున్నారు.కళ, సంస్కృతి, ప్రకృతి ఈ మూడు కలిసినప్పుడు గ్రామ అభివృద్ధి సుస్థిరంగా ఉంటుంది” అని



కార్యక్రమంలో వక్తలు అభిప్రాయపడ్డారు.

# వేడంగిపాలెంలో బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం.

**పాలకొల్లు ప్రజా జ్యోతి రిపోర్టర్ కొట్టి రామం. ఆగస్టు 31.** పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని వేడంగి పాలెంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పని చేస్తూ ఇటీవల జరిగిన బదిలీలలో ఇతర పాఠశాలలకు బదిలీపై వెళ్లిన ముగ్గురు ఉపాధ్యాయులను పాఠశాల పేరెంట్స్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. సన్మాన సభకు పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ లంకలపల్లి నరసింహారావు అధ్యక్షత వహించారు. బదిలీ అయిన ఉపాధ్యాయులు ఆర్ యల్ యన్ మూర్తి, డి. ఏసుబాబు, కె రామకృష్ణ లను స్థానిక పెద్దలు టిడిపి జనసేన బిజెపి నాయకులు పేరెంట్స్ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షులు మేడిశెట్టి బుజ్జి మాట్లాడుతూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుల ముగ్గురు పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల ఉన్నతికి తమ వంతు బాధ్యతలు సమర్ధవంతం గా నిర్వహించారని అన్నారు. సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైందని అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులు ఎక్కడ పని చేస్తున్నా వారికి తగిన గుర్తింపు గుర్తింపు గౌరవం లభిస్తుందని అన్నారు. బదిలీ అయిన ఉపాధ్యాయుల స్థానం లో పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులను అయన సభలో పరిచయం చేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ లంకలపల్లి నరసింహారావు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు పాఠశాలను మరింత అభివృద్ధి చేయడానికి పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషి చేయాలని అన్నారు. ఎంపీటీసీ దూసనపూడి దొరబాబు మాట్లాడుతూ పాఠశాలలో ఎంతో చక్కగా విద్యాబోధన సేవలు అందించిన ఉపాధ్యాయులు బదిలీ అవటం విద్యార్థులకు బాధాకరమైనా, బదిలీలు తప్పనివని అన్నారు. గ్రామ జనసేన గ్రామ కమిటీ అధ్యక్షులు లంకలపల్లి రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు స్థానిక నాయకుల సహకారం తో విద్యార్థుల తల్లిదండ్రులను ప్రోత్సహించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేరేలా చూడాలన్నారు. పాఠశాల లోని విద్యార్థుల సంఖ్య పెరిగి మెరుగైన విద్యా ప్రమాణాలు సాదిస్తే ఈ పాఠశాలను హైస్కూల్ స్థాయి కి పెంచమని కోరటానికి అవకాశం కలుగుతుందన్నారు. మాజీ ఎంపీటీసీ కోటి మధు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధి కి స్థానిక దాతల సహకారం



ఉంటున్నదని ఈ సహకారాన్ని దాతలు, పూర్వ విద్యార్థులు కొనసాగించాలన్నారు. తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షుడు దూబా వెంకటేశ్వరావు మండల టీడీపీ కమిటీ ఉపాధ్యక్షులు మీసాల వీర వెంకట సత్యనారాయణ టిడిపి నాయకులు పూతినీడి రంగారావు, జక్కంపూడి జయరాం. లంకలపల్లి గంటయ్య, ఇలపకుర్తి బుజ్జి పూతినీడి గణపతి రావు పూతి నీడి చింతారావు మీసాల పెద్దకాపు అంగనవాడి టీచర్ యల్ జగజేశ్వరి ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాల ప్రధానో పాధ్యాయులు నేలపాటి రమేష్ ఉపాధ్యాయులు బి కృష్ణకుమారి యన్ సత్యనారాయణ కె యస్ యన్ మూర్తి కె శిరీష తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మన మిత్రా యాప్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించుకోవచ్చు

జిల్లాలో డిజిటల్ చెల్లింపులకే ప్రాధాన్యం

- జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

**రాజమహేంద్రవరం/తాళ్లపూడి మండలం, ఆగస్టు31, ప్రజాజ్యోతి న్యూస్** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, పంచా యతీ రాజ్ డిపార్టు మెంటు ఆధ్వర్యంలో ప్రజలు సులభత రంగా పన్నులు చెల్లిం చేందుకు స్వర్ణ పంచాయితీ వెబ్‌సైట్ ను ప్రవేశపెట్టినట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు జిల్లాలోని 299 గ్రామ పంచాయతీలలో మొత్తం 3,58,297 అసెస్మెంట్లు నమోదు చేయబడ్డాయని వీటి లో ప్రతి అసెస్మెంట్ ఆధా రంగా ప్రజలు ఇంటి పన్నులను డిజి టల్ రూపంలో చెల్లించవలసి ఉంటుందన్నారు ఇకపై నగదు చెల్లింపుల కన్నా డిజిటల్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇవ్వా లని కలెక్టర్ స్పష్టం చేశారు. నెట్ బ్యాంకింగ్, డెబిట్/క్రెడిట్ కార్డు,క్యూఆర్ కోడ్, డీడీ, చెక్ రూపంలో కూడా డిజిటల్ చెల్లింపులు చేయుటకు సౌక ర్యం ఉందని. పన్నులు నేరుగా గ్రామ పంచాయితీ ట్రెజరీ ఖాతాలోనే జమ అవు తాయ ని.ప్రతి ఒక్కరూ “మన మిత్రా” యాప్ ఉపయోగించి ప్రతి పౌరుడు స్వర్ణ పంచాయితీ వెబ్‌సైట్ లేదా మన మిత్రా యాప్ ద్వారా ఇంటి పన్నులు చెల్లించవచ్చని కలెక్టర్ సూచిం చారు. ప్రతి ఇంటి అసెస్మెంట్ నెంబర్ తప్పనిసరి గా మ్యాప్ అయ్యి ఉండాలన్నారు డిజిట ల్ చెల్లింపులు వలన సమయం ఆదా , పారదర్శకత పెరిగి అవినీతికి ఆస్కారం ఉండ దన్నారు ప్రజలకు అవగాహన కల్పించడానికి పంచాయతీ స్థాయిలో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు ప్రతి ఒక్కరూ తప్పని సరిగా మన మిత్రా యాప్ వినియోగిం చి పంచాయతీల ఆర్థిక పరిపుష్టి లో భాగస్వా మ్యం అవ్వాలన్నారు



## 44 మందికి సిఎం సహాయ నిధి రూ.23,81,088 నగదు వచెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పితాని.



**పోడూరు, ఆగస్టు 31,ప్రజాజ్యోతి న్యూస్ (రిపోర్టర్ కేకే ఆర్ వెంకట్ ).** ఆచంట నియోజకవర్గంలో దారిద్ర్య రేఖ దిగువనున్న పేద వర్గాలకు సంబంధించి అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 44 మంది బాధితులకు మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ చేతుల మీదుగా రూ. 23,81,088 నగదు విలువ గల చెక్కులను పోడూరు మండలం కొమ్ముచిక్కాల పార్టీ కార్యాలయంలో ఆదివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి,జనసేన,బిజెపి కూటమి మండల, గ్రామ అధ్యక్షులు ,ముఖ్య నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా గొప్ప అన్న సమారాధన చేస్తాం

: పోడూరు దత్త గణపతి ఆలయ కమిటీ సభ్యులు.



**పోడూరు ఆగస్టు 31 ప్రజాజ్యోతి న్యూస్ :** పోడూరు గ్రామం మెరక వీధి ఒకటవ వీధిలో వేంచేసి యున్న శ్రీ దత్త గణపతి ఆలయాన్ని పునః నిర్మించి వేద పండితుల మంత్రోచ్చారణలతో, యాగాలు హెూమాలు,పూజలు నిర్వహించి గొప్ప అన్న సమారాధన చేసి అత్యంత అంగరంగ వైభవంగా ప్రతిష్టించారు. ఆలయాన్ని ప్రతిష్టించిన తర్వాత మొట్టమొదటిసారి వచ్చిన వినాయక చవితి ఉత్సవాలను దత్త గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించి ఆదివారం పోడూరు గ్రామం పుర వీధుల్లో ఊరేగించాచి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు పలువురు మాట్లాడుతూ పోడూరు గ్రామ పురవీధుల్లో వినాయకుని ఊరేగించిన అనంతరం ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో కోడేరు వశిష్ట గోదావరిలో నిమజ్జన కార్యక్రమం పూర్తి చేస్తామని,అలాగే వచ్చే బుధవారం దత్త గణపతి ఆలయ ప్రాంగణం సమీపంలో గొప్ప అన్న సమారాధన నిర్వహిస్తామని తెలియజేశారు. కాగా ఊరేగింపు ఉత్సవాల్లో భాగంగా పోడూరు మెరక ఒకటో వీధిలో కమిటీ సభ్యులు వేషధారణలు ధరించి భక్తులను అలరించారు.ఈ ఊరేగింపు ఉత్సవంలో కమిటీ సభ్యులు గెద్దాడ కొండయ్య, మీసాల కర్ణుడు, కార్పెంటర్ దాసోహం సత్యనారాయణ, గెద్దాడ ఆంజనేయులు, కరుమోజ్జు హేమంత్,తదితరులు పాల్గొన్నారు.

## రేవ: పాస్టర్ అక్కిదాసరి రవికుమార్ గారికి ఘన సన్మానం



**గోపవరం ఆగస్టు 31( ప్రజా జ్యోతి న్యూస్)** బద్వేల్ మండలం గొడుగునూరు గ్రామంలో ఆదివారం నాడు వీడ్కోలు కార్యక్రమం జరిగింది గత పది సంవత్సరాల నుండి గొడుగునూరు గ్రామానికి ఎస్ డి ఎ చర్చి సంస్థ తరపున గ్రామానికి సేవ చేస్తూన. రేవ: పాస్టర్ అక్కి దాసరి రవికుమార్ గారికి గ్రామ సంఘం దంపతులిద్దరికీ శాలువా కప్పి పూలమాలలు వేసి సేవకు గుర్తుగా గ్రామస్తులు మేమెంట్ అందించడం జరిగింది ఆయన సేవకు గ్రామ సంఘం సన్మానం చేయడం జరిగింది. రేవ: అక్కి దాసరి పాస్టర్ రవికుమార్ గారు మాట్లాడుతూ ఈ గ్రామానికి వచ్చి పది సంవత్సరాలు ప్రేమ పూర్వకంగా సేవ చేసినందుకు గ్రామస్తులు చేసిన ఈ సన్మాన కార్యక్రమాన్నినా జీవితంలో మర్చిపోలేని ఘట్టం. నేను ఈ గ్రామంలో ప్రతి ఒక్కరిని ప్రేమపూర్వకంగానే కలుపుకుంటూ. గ్రామానికి అనుకూలంగా గ్రామ సంఘానికి ప్రేమ పూర్వకంగా దేవుని సేవ చేసినందుకు నాకెంతో ఆనందంగా ఉంది అలాగే ఈ గ్రామంలో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని నేను కోరుకుంటున్నాను అని ఆయన అన్నారు.

## నేత్ర దానం చేయండి-వెలుగులు నింపండి,

ఈగల్ ఐజి ఆకె రవికృష్ణ ఐపీఎస్ గారు




**(ప్రజాజ్యోతి న్యూస్) ఆగస్టు 31** కర్నూలు పట్టణము నందు బుధవారపేటలో గల సుశీల నెత్రాలయ మెటర్నిటి హాస్పిటల్ ను శ్రీ ఆకే రవి కృష్ణ గారు సందర్శించడం జరిగిగింది నేత్ర దానం కరపత్రాల విడుదల నేత్రదానం అవశ్యకత పై ప్రచురించిన కరపత్రాలను మరియు నేత్ర ధానం ప్రతిజ్ఞా ఫారములను శ్రీ ఆకే రవి కృష్ణ గారు విడుదల చేయడం జరిగింది అందరూ నేత్ర దానానికి ప్రతిజ్ఞ చేసి ద్రుష్టిలేని అభాగ్యుల జీవితాలలో వెలుగులు నింపాలని శ్రీ ఆకే రవి కృష్ణ గారు కోరారు. రాబోయే రోజులలో నేత్ర ధానం పై సుశీల నేత్రాలయ హాస్పిటల్ యాజమాన్యంతో యువతకు మరియు ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలియజేసారు.మనదేశములో ఎన్నో సహజ మరణాలు జరుగుతున్నప్పటికి మనము కేవలము భారతదేశములో సంవత్సరానికి 30000 (ముప్పై వేలు) వేల నేత్ర దానాలు మాత్రామే చేయగల్గుతున్నాము. కానీ మనము సంవత్సరానికి అవసరమైన ఒక లక్ష నేత్ర దానాలకు లక్ష్యంగా పెట్టుకోవాలని కోరారు. ఇందుకు అందరూ కలిసి దీనిపై శ్రమించాలని తెలిపారు. నేత్రధానము అనేది మన మరణాంతరము ఇచ్చేది, కావున ఎవ్వరు ఆందోళన చెందకుండా నేత్ర దానానికి ముందుకు రావాలని పిలుపిచ్చారు.సుశీల నెత్రాలయ మెటర్నిటి హాస్పిటల్ ను సందర్శించి వారు చేస్తున్న సామాజిక సేవలకు శ్రీ ఆకే రవి కృష్ణ గారు ప్రశంశించారు. మరణాంతరము నేత్రదానము చేయదలచిన వారు ఈ క్రింది చిరునామాకు సంప్రదించి ఫోన్ ద్వారా తెలియజేయాలని డాక్టర్ పి. సుధాకర్ రావు గారు సుశీల నెత్రాలయ గ్రూప్ వారు కోరారు సుశీల నేత్రాలయ నేత్రధాన కేంద్రం బుధవారపేట, కర్నూలు ఫోన్ నెంబర్స్ 8886306308 9949546785 డాక్టర్ పి. సుధాకర్ రావు గారు సుశీల నెత్రాలయ గ్రూప్ డాక్టర్ యస్ సావిత్రి డాక్టర్ నేహా సుధాకర్ రేటినా సర్జన్, డాక్టర్ రాఘవ ప్రీతమ్, నేత్రలయ సిబ్బంది మరియు నర్సెస్ డాక్టర్ పి. సుధాకర్ రావు గారు సుశీల నెత్రాలయ గ్రూప్

# మానవత్వంలో, కర్నూలు ప్రగతి సమితి (కేపియస్) ముందుంటుంది





వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. శ్రీహర్ష

**(ప్రజా జ్యోతి న్యూస్) ఆగస్టు 31 కర్నూలు జిల్లాలో** మానవత్వం చాటడంలో, దాతృత్వం, సామాజిక సేవా కార్యక్రమాల్లో కర్నూలు ప్రగతి సమితి (కేపియస్) ఎల్లప్పుడూ ముందుంటుందని వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం. శ్రీహర్ష అన్నారు. కర్నూలుకు చెందిన నవాజ్ ఖాన్ కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు. ఆ సమయంలో కేపియస్ తరపున సుమారు రెండున్నర నెలలపాటు వైద్యులతో సమన్వయం చేస్తూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెసులుబాటు కల్పించడంలో కేపియస్ కీలక పాత్ర పోషించింది. ఇటీవల నవాజ్ ఖాన్ పూర్తిగా కోలుకున్నారు. ఈ సందర్భంగా నవాజ్ ఖాన్ కుటుంబ సభ్యులు ఆదివారం బిర్లా కాంపౌండ్‌లోని కేపియస్ కార్యాలయంలో శ్రీహర్షను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో బైపాస్ సర్జరీ చేయించుకున్న చెఫ్ రాఘవ్ను శ్రీహర్ష పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా శ్రీహర్ష మాట్లాడుతూ.. ప్రజా పోరాట కార్యక్రమాల్లోనే కాకుండా మానవత్వం, దాతృత్వం, సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా కేపియస్ ఎప్పుడూ ముందుంటుందని పేర్కొన్నారు. సాటి మనిషికి సాయం చేసినప్పుడు కలిగే అనుభూతి, సంతృప్తి వర్ణనాతీతమన్నారు. కార్యక్రమంలో కేపియస్ సభ్యులు సి. శ్రీనివాసులు, హరినాథ్, మధు పాల్గొన్నారు.

# ఆదోని లో గణేష్ నిమజ్జనం ను , నిమజ్జనం శోభా యాత్ర ను పరిశీలించిన .జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు .



ఆదోనిలో వినాయక నిమజ్జనోత్సవం... భద్రత ఏర్పాట్ల ను పర్యవేక్షించిన ... జిల్లా ఎస్పీ .





**(ప్రజా జ్యోతి న్యూస్) కర్నూలు ఆగస్టు 31** ఆదోని లో ఆదివారం గణేష్ నిమజ్జనం జరుగుతున్న చిన్న హరి వాణ దగ్గర ఉన్న ఎల్లెల్సీ కెనాల్ ను నిమజ్జనం శోభా యాత్రను జిల్లా ఎస్పీ శ్రీ విక్రాంత్ పాటిల్ ఐపియస్ గారు ఆదివారం పరిశీలించారు. భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలీసు అధికారులకు జిల్లా ఎస్పీ గారు పలు సూచనలు చేశారు. గణేష్ నిమజ్జనం సజావుగా సాగేలా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. ఆదోనిలోని ముఖ్యమైన కూడళ్లు, రహదారులలో పర్యటించి పోలీసు అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. వినాయక నిమజ్జనం పూర్తి అయ్యేవరకు అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఇతర శాఖ అధికారుల సమన్వయంతో నిమజ్జనం కార్యక్రమ సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినాయక నిమజ్జన ఘట్టాన్ని ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ఎస్పీ గారి వెంట డిఎస్పీలు హేమలత, భార్గవి, ఉపేంద్రబాబు, సిఐలు తేజోమూర్తి, కేశవరెడ్డి, శ్రీరామ్, రామాంజులు, ఆర్ ఐ జావేద్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సైలు వేణుగోపాల రాజు, ఖాజావలి మరియు పోలీసు సిబ్బంది ఉన్నారు.

# మార్క్ ఫెడ్ ద్వారా రూ.12/- కు ఉల్లిని కొనుగోలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

మార్క్ ఫెడ్ ద్వారా ఉల్లి కొనుగోలు ప్రారంభించాలి,
జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

**(ప్రజాజ్యోతి న్యూస్) ఆగస్టు 31** కర్నూలు,మార్క్ ఫెడ్ ద్వారా రూ.12/- కు రాష్ట్ర ప్రభుత్వం ఉల్లిని కొనుగోలు చేస్తుందని, అందుకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. ఆదివారం మార్కెటింగ్, హార్టికల్చర్, మార్క్ ఫెడ్, మార్కెట్ యార్డ్ సెక్రటరీ తదితరులతో ఉల్లి కొనుగోలు అంశం పై జిల్లా కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు... ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈరోజు నుండి మార్క్ ఫెడ్ ద్వారా మార్కెట్ యార్డ్ లో ఉల్లి కొనుగోలు ప్రారంభించాలని మార్క్ ఫెడ్ అధికారులను ఆదేశించారు... ఈరోజు ఉల్లి నిల్వలు ఎంత ఉన్నాయి?? రేపు, ఎల్లుండి ఎంత రావచ్చు? అని కలెక్టర్ మార్కెట్ యార్డ్ సెక్రటరీ ని ఆరా తీశారు? ఈరోజు 110 క్వింటాల్ లు మాత్రమే ఉందని, దీనిని రైతులు గ్రేడింగ్ చేసుకుంటున్నారని, రేపు 1200 నుండి 1500 క్వింటాల్.ల వరకు మార్కెట్ యార్డ్ కు ఉల్లి రావచ్చని మార్కెట్ యార్డ్ సెక్రటరీ కలెక్టర్ కి వివరించారు.. ఈరోజు ఉన్న ఉల్లి నిల్వ లను మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మార్క్ ఫెడ్, మార్కెట్ యార్డ్ సెక్రటరీ లను ఆదేశించారు. రైతు బజార్ లకు కూడా తరలించే చర్యలు చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫీల్డ్ లో డ్యామేజ్ అయిన ఉల్లి వెరైటీ ఎంత ఉందని కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారిని ఆరా తీశారు?? ప్రస్తుతం వర్షాలు రాకపోతే డ్యామేజ్ ఏమి ఉండదని, మంచి నాణ్యత ఉంటుందని ఉద్యాన శాఖ అధికారి కలెక్టర్ కు వివరించారు. ఉల్లిని డ్రై చేసుకున్న తర్వాతే మార్కెట్ యార్డ్ కు తరలించే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారిని ఆదేశించారు. కర్నూలు మార్కెట్ యార్డ్ మాత్రమే కాకుండా పత్తికొండ, ఆదోని, ఎమ్మిగనూరు, కోసిగి ఏఎంసి లలో కూడా ఉల్లి ఆరబెట్టే విధంగా రైతులకు సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు...అదే విధంగా రెవెన్యూ, హార్టికల్చర్, మార్క్ ఫెడ్ , మార్కెట్ యార్డ్ సెక్రటరీ లతో టీంలు ఏర్పాటు చేసి ఉల్లి కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు..టెలి కాన్ఫరెన్స్లో జాయింట్ కలెక్టర్ డాక్టర్.బి.నవ్య, జిల్లా ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, మార్క్ ఫెడ్ డిఎం రాజు, మార్కెటింగ్ ఏడి నారాయణ మూర్తి, కర్నూలు మార్కెట్ యార్డ్ సెక్రటరీ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు..

# కాంగ్రెస్ ప్రభుత్వానిది అంతా పొలిటికల్ డ్రామా



**హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై ఎన్ని రోజులైనా చర్చిద్దామని కాంగ్రెస్ ప్రభుత్వానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సవాల్ విసిరారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలకు నిజాలు తెలియాలని చెప్పుకొచ్చారు. ఇవాళ(ఆదివారం) తెలంగాణ అసెంబ్లీలో కాళేశ్వరంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై లఘుచర్చను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం హరీష్‌రావు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి ప్రతి కౌంటర్ ఇచ్చారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికలో ప్రతి అక్షరానికి సమాధానం ఇస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానిది అంతా పొలిటికల్ డ్రామా అని ఎద్దేవా చేశారు. రేవంత్ ప్రభుత్వం నడుపుతున్నారా..?, సర్కస్ కంపెనీ నడుపుతున్నారా..? అని ప్రశ్నల వర్షం కురిపించారు హరీష్‌రావు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తమపై బురదజల్లేందుకు కాంగ్రెస్ నేతలు యత్నిస్తున్నారని ఫైర్ అయ్యారు. పీసీ ఘోష్ కమిషన్ విచారణ నిష్పాక్షికంగా జరిగిందా..? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమపై రాజకీయ కక్ష సాధిస్తోందని ఆరోపించారు. చట్టాన్ని తుంగలో తొక్కి ఏకపక్షంగా కమిషన్ నివేదిక ఇచ్చిందని విమర్శించారు. పీసీ ఘోష్ కమిషన్ నివేదిక చట్టం ముందు నిలబడదని చెప్పుకొచ్చారు. కమిషన్ రిపోర్టుపై రూల్స్ పాటించనందునే తాము హైకోర్టుకు వెళ్లామని తెలిపారు. హై కోర్టులో వాదనలు ఉన్నాయని తెలిసి కూడా ఆదరాబాదరాగా రేవంత్ ప్రభుత్వం అసెంబ్లీలో నివేదిక పెట్టిందని మండిపడ్డారు హరీష్‌రావు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆదివారం హడావుడిగా చర్చ అంటేనే.. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్ర ఏంటో అర్థమైందని విమర్శించారు. కేసీఆర్‌కు, తనకు కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ 8బీ కింద నోటీసులు ఇవ్వలేదని పేర్కొన్నారు. 8బీ కింద నోటీసులు ఇవ్వకపోతే రిపోర్టు చెల్లదని సుప్రీంకోర్టు చెప్పిందని గుర్తుచేశారు. సభ్యులకు 8బీ, 8సీ కింద నోటీసులు ఇవ్వాలని చట్టంలో ఉందని ఉద్ఘాటించారు. గతంలో ఇలాంటి అంశాలపై ఇందిర, అద్వానీ కూడా కోర్టుకెళ్లారని హరీష్‌రావు పేర్కొన్నారు.

## కాళేశ్వరంపై సెటిల్‌మెంట్...
## రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి కేరళ పర్యటన మతలబు ఏంటి..? అని ప్రశ్నించారు. బుక్ రిలీజ్ కోసం రేవంత్‌రెడ్డి కేరళ వెళ్లారంటే నమ్మేలా లేదని నిలదీశారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నివేదికపై కీలక చర్చ జరుగుతున్నపుడు ఈ కేరళ టూర్ ఏంటని..? ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం చర్చ కేరళలో ఎందుకు..? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డితో, కేసీఆర్ తన మనిషిని కేరళకు పంపించారనే అనుమానం కలుగుతోందని విమర్శించారు. ఇద్దరు కలిసి కేరళకు వెళ్లారా..? అక్కడే కాళేశ్వరంపై సెటిల్‌మెంట్ జరుగుతుందా..? అని ప్రశ్నించారు ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి.

కాళేశ్వరం స్కామ్ గుణపాఠం కావాలి..

ఆదివారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో పైడి రాకేశ్ రెడ్డి మీడియాతో చిట్‌చాట్ చేశారు. తెలంగాణ రాజకీయ ముఖ చిత్రాన్ని మార్చనున్న కాళేశ్వరంపై అసెంబ్లీలో ఇవాళ కీలక చర్చ జరుగుతోందని తెలిపారు. భవిష్యత్ తరాలకు కాళేశ్వరం ప్రాజెక్టు స్కామ్ గుణపాఠం కావాలని హెచ్చరించారు. అప్పట్లో స్వాతంత్ర్య సమరయోధుల కోసం అండమాన్ జైల్ కట్టారని.. ఇప్పటికీ దాని గుర్తులు, ఆనవాళ్లు ఉన్నాయని చెప్పుకొచ్చారు. కాళేశ్వరంలో అవినీతి, అక్రమాలు చేసిన వారికోసం ప్రత్యేక జైలు కట్టించి అందులో ఉంచాలని ఎద్దేవా చేశారు

## ఘనంగా దీపారాధన కార్యక్రమం

- దీపకాంతులతో ముస్తాబయిన పురవీధి
- స్వామివారికి ప్రత్యేకంగా కుంకుమార్చనలు
- అధిక సంఖ్యలో పాల్గొన్న మహిళలు





**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్:** వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పొందూరు మండలం తోలాపి గ్రామంలో దేవాంగుల వీధిలో ఘనంగా దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా విఘ్నేశ్వరుడికి పురోహితులు ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించారు. అనంతరం వినాయక మండపం ఆరుబయట దీపారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించారు. దీంతో ఆ ప్రాంగణం అంతా దీపాకాంతులతో కళకళలాడింది.

## ఘనంగా లడ్డూ వేలం కార్యక్రమం

- రూ. 16,600 కు లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకున్న మల్లి పెద్ది వెంకట రావు



**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పొందూరు మండల కేంద్రంలో హాస్పిటల్ వీధిలో వినాయక లడ్డూ వేలం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం పోటా పోటీగా సాగింది. వినాయక లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకునేందుకు పలువురు పోటీగా లడ్డూ వేలం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లి పెద్ది వెంకట రావు దంపతులు రూ. 16,600 కు లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. దీంతో మంగళవాయిద్యాలతో స్వామి వారి ప్రసాదాన్ని ఉస్తాహంగా ఊరేగించారు. అనంతరం పట్టుశాలి సంఘం అధ్యక్షులు పి రామకృష్ణ ఆధ్వర్యంలో యూత్ సభ్యులు స్వామి వారి ప్రసాదాన్ని వెంకటరావు మాస్టర్ కు అందజేశారు.

## సెప్టెంబర్ 1 నుంచి రేషన్ షాపులు బంద్

**హైదరాబాద్ :** తెలంగాణలో రేషన్ డీలర్లు ప్రభుత్వానికి షాక్ ఇచ్చేందుకు రెడీ అయ్యారు. సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రంలో రేషన్ షాపులు బంద్ చేయనున్నట్లు ప్రకటించారు. తమకు రావాల్సిన పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ డీలర్లు ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం తమ సమస్యపై స్పందించకపోతే సెప్టెంబర్ 4న అసెంబ్లీని ముట్టడిస్తామని డీలర్లు హెచ్చరించారు. ఐదు నెలలుగా కమిషన్ బకాయిలు చెల్లించలేదని తెలిపారు. మరి దీనిపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో వేచి చూడాలి.తెలంగాణలోని రేషన్ డీలర్లు .. ప్రజలు, ప్రభుత్వానికి షాక్ ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ తర్వాత.. వచ్చే నెల అనగా సెప్టెంబర్ 1 నుంచి మళ్లీ రేషన్ పంపిణీ మొదలు కావాల్సి ఉంది. దీనికి మరో రెండు రోజులు సమయం మాత్రమే ఉండగా.. చివరి నిమిషంలో రేషన్ డీలర్లు ఊహించని షాకిచ్చారు. సెప్టెంబర్ 1 నుంచి రేషన్ షాపులు బంద్ చేస్తామని తెలిపారు. ఈ మేరకు రేషన్ డీలర్లు ప్రభుత్వానికి అల్టిమేటం జారీ చేశారు. అసలేం జరిగింది.. ఎందుకు రేషన్ డీలర్లు ఇలాంటి నిర్ణయం తీసుకున్నారంటే.. పెండింగ్ బకాయిల విడుదల కోసం రేషన్ డీలర్లు పోరు బాట పట్టారు. దీనిలో భాగంగా సెప్టెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రేషన్ దుకాణాలు బంద్ చేస్తామని తెలిపారు. సెప్టెంబర్ 1 నుంచి రేషన్ బియ్యం పంపిణీ చేసేది లేదని తేల్చి చెప్పారు. బియ్యం పంపిణీ కమిషన్ బకాయిల విడుదల గురించి ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా లాభం లేకుండా పోతుందని.. ఈ సమస్య పరిష్కారం కోసమే తాము సెప్టెంబర్ 1 నుంచి రేషన్ షాపులు బంద్ చేయబోతున్నట్లు ప్రకటించారు.రేషన్ బియ్యం పంపిణీ బకాయిలను తక్షణమే రిలీజ్ చేయాలని కోరుతూ.. గురువారం నాడు రేషన్ డీలర్లు.. రాష్ట్ర పౌరసరఫరాల భవన్ ఎదుట నిరసన తెలిపారు. ఈక్రమంలోనే సెప్టెంబర్ 1న రేషన్ దుకాణాల బంద్ గురించి వారు ప్రకటన చేశారు. అలానే వారి ఆందోళనకు సంబంధించిన కార్యాచరణను కూడా ఈ సందర్భంగా వెల్లడించారు. బకాయిల విడుదల విషయంలో ప్రభుత్వం స్పందించకపోతే.. సెప్టెంబర్ 4వ తేదీన రేషన్ డీలర్లంతా అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. అలానే రేషన్ బియ్యం పంపిణీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ.. ఇప్పటికే తాము అన్ని జిల్లాల కలెక్టర్లకు, సివిల్ సప్లై అధికారులకు వినతి పత్రాలు ఇచ్చామని తెలిపారు.రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించి.. ప్రభుత్వం రేషన్ డీలర్లకు సుమారు ఐదు నెలల కమిషన్ బకాయిలు చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టింది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించి డీలర్లకు కమిషన్ బకాయిలను చెల్లించలేదు. అలానే జూన్ నెలలో రాష్ట్రవ్యాప్తంగా రేషన్ కార్డుదారులందరికి ఒకేసారి 3 నెలల రేషన్ బియ్యం పంపిణీ చేసిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించిన కమిషన్ కూడా చెల్లించలేదని డీలర్లు తెలిపారు. అంతకు ముందు రెండు నెలల కమిషన్ కూడా చెల్లించలేదన్నారు. దీనికి సంబంధించి నెలకు రూ.25 కోట్ల చొప్పున.. 5 నెలలకు కలిపి 125 కోట్ల రూపాయల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ పెండింగ్ బకాయిలను చెల్లిస్తేనే.. వచ్చే నెల రేషన్ పంపిణీ చేస్తామని తెలిపారు. మరి ప్రభుత్వం వీరి డిమాండ్ మీద ఎలా స్పందిస్తుందో చూడాలి.

## కాళేశ్వరంపై సెటిల్‌మెంట్...
## రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

**హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై బీజేపీ ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి కేరళ పర్యటన మతలబు ఏంటి..? అని ప్రశ్నించారు. బుక్ రిలీజ్ కోసం రేవంత్‌రెడ్డి కేరళ వెళ్లారంటే నమ్మేలా లేదని నిలదీశారు. అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్ట్ నివేదికపై కీలక చర్చ జరుగుతున్నపుడు ఈ కేరళ టూర్ ఏంటని..? ప్రశ్నల వర్షం కురిపించారు. కాళేశ్వరం చర్చ కేరళలో ఎందుకు..? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డితో, కేసీఆర్ తన మనిషిని కేరళకు పంపించారనే అనుమానం కలుగుతోందని విమర్శించారు. ఇద్దరు కలిసి కేరళకు వెళ్లారా..?

# యూరియా కోసం రైతుల పడిగాపులు

**ఖానాపూర్/పెంబి/బేల :** నిర్మల్ జిల్లాలో యూరియా కొరత వేధిస్తున్నది. యూరియా బస్తాల కోసం పడరాని పాట్లు పడుతున్నారు. మహిళా రైతులు సైతం గంట ల తరబడి క్యూలైన్‌లో నిలబడినా దొరకడం లేదు. శనివారం ఖానాపూర్ పట్టణంలోని పీఏసీఎస్ కార్యాలయానికి 450 యూరియా బ స్తాలు వచ్చాయి. దీంతో రైతులు ఒక్కసారిగా ఎగబడ్డారు. పోలీసులు చేరుకుని ఒక్కొక్కరికి రెండు బస్తాల చొప్పున సరఫరా చేశారు. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పత్తి, మొక్కజొన్న, కంది, వరి పంటలకు యూరియా అవసరం ఉండడంతో గంటల తరబడి వరుసలో నిలబడి యూరియా బస్తాలు తీసుకెళ్తున్నారు.

**పెంబి మండలంలో..**

పెంబి మండలంలోని గిరిజన రైతు ఉత్పత్తిదారుల సంస్థ వద్దకు శనివారం రైతులు చేరుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుం చి దాదాపు 400లకుపైగా రైతులు తరలివచ్చారు. కొందరికి మూడు బ్యాగులు, మరి కొంతమందికి రెండు బ్యాగుల చొప్పున 172 మందికి 450 యూరియా బ్యాగులను అందజేశారు. ఇంకా 200 మందికి పైగా రైతులకు ఒక్క యూరియా బ్యాగు కూడా అందకపోవడంతో అసంతృప్తితో ఇంటికి వెళ్లారు.

**బేల మండలంలో..**

ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని ఆగ్రోస్ సేవ కేంద్రం ఎదుట శనివారం రైతులు బారులుదీరారు. చప్రాల,



చంద్‌పెల్లి, గూడ, మానియార్ పూర్, ఖెడోడ, ఖోగ్దుర్ గ్రామాలతోపా టు సాత్నాల మండలంలోని సైద్‌పూర్, మసాలా(కే), తోయగూడ, దుబ్బగూడ, గ్రామల నుంచి దాదాపు 200 మందికిపైగా రైతులు తరలివచ్చారు. కేంద్రంలో 344 యూరియా బస్తాలు ఉండగా.. కేవలం 95 మందికి పంపి ణీ చేశారు. మిగతా వారు నిరాశగా వెనుదిరిగారు. ఘర్షణలు చోటు చేసుకోకుండా పోలీసులు బందోబస్తు చేపట్టారు.

# రవాణా చెక్‌పోస్ట్‌ల తొలగింపు

**ఆదిలాబాద్:** సరిహద్దులో రవాణాశాఖ చెక్‌పోస్టులను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీవో ఎంఎస్ నంబర్ 58ని ఈ నెల 28న జారీ చేసింది. తదనుగుణంగా సరిహద్దుల్లోని రవాణా చెక్‌పోస్టులను తొలగించారు. అయితే ఇప్పటికే అక్కడ బాధ్యతలు నిర్వర్తిస్తున్న సిబ్బందికి ఆరు నెలల పాటు మొబైల్ స్క్వాడ్ విధులు కేటాయించారు. ప్రధానంగా పన్ను చెల్లించకుండా రాష్ట్రంలోకి సరుకు వాహనాలు రాకుండా చూడటమే వీరి విధి. అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం ద్వారా ఇప్పటికే అమల్లో ఉన్న ఆన్‌లైన్ వాహన్ సాఫ్ట్‌వేర్‌ను రాష్ట్రంలో కూడా అమల్లోకి తీసుకువచ్చారు. తద్వారా ఇప్పటి వరకు ఆయా చెక్‌పోస్టుల్లో లభించే వివిధ రకాల సేవలను ఇకపై ఆన్‌లైన్‌లో జారీ చేసేలా ఈ సాఫ్ట్‌వేర్ ఉపయోగపడనుంది. అలాగే వాహన డ్రైవర్లకు అవగాహన కల్పించేందుకు గాను మొబైల్ స్క్వాడ్ సరిహద్దులో ఆరు నెలల పాటు సేవలందించనుంది. ఆ శాఖ కమిషనర్ తదుపరి ఆదేశాల మేరకు సిబ్బంది సేవలపై స్పష్టత రానుంది.

**ఉమ్మడి జిల్లాలో...**

ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్‌లో భోరజ్, ఆసిఫా బాద్‌లో వాంకిడి, నిర్మల్‌లోని భైంసాలో మహారాష్ట్ర కు సరిహద్దుగా రవాణా శాఖ చెక్‌పోస్టులు ఇప్పటి వరకు సేవలందించాయి. ప్రభుత్వ ఆదేశాల నేపథ్యంలో ఆయా చెక్‌పోస్టులను తొలగించారు. అయి తే మొదటి ఆరు నెలలు మొబైల్ స్క్వాడ్ సిబ్బంది ఇక్కడ విధులు నిర్వహిస్తారు. పన్ను చెల్లించని



సరుకు వాహనాలను రాష్ట్రంలోకి రాకుండా చూస్తారు. ఇదిలా ఉంటే భోరజ్‌లో 10 మంది, వాంకిడిలో ఎనిమిది, భైంసాలో ముగ్గురు సిబ్బంది సేవలందిస్తున్నారు. తాజాగా వారిని మొబైల్ స్క్వాడ్ డ్యూటీలోకి మార్చారు.

**సేవలు ఇలా...**

రవాణాశాఖ పరంగా చెక్‌పోస్టుల్లో అందించే సేవలను ఇకపై వాహన్ సాఫ్ట్‌వేర్ ద్వారా స్వచ్ఛంద పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించేలా డ్రైవర్లకు అవగాహన కల్పించాలి. తాత్కాలిక పర్మిట్, వాలంటరీ ట్యాక్స్, స్పెషల్ పర్మిట్ ఈ సేవలను ప్రజలు ఇకపై ఆన్‌లైన్ ద్వారా పొందాల్సి ఉంటుంది.

# సర్వే సక్రమమేనా..?

**ఆదిలాబాద్ :** ఆగస్టు 16న జిల్లా కేంద్రంలో కురిసిన భారీ వర్షం కారణంగా ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలకు నష్టం జరిగింది. వరద నష్టంపై అధికారులు నిర్వహించిన సర్వే నివేదికలో పలు కాలనీల ప్రస్తావన లేకపోవడంతో స్థానికులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కుండపోత వర్షం కారణంగా వాగులు, కుంటలు, నాళాలు పొంగి ప్రవహించడంతో పలు కాలనీలు జలమయం, పలు ఇళ్లు కూలిపోగా మరికొన్ని ఇండ్లు దెబ్బతిన్నాయి. కాలనీలు జలమయం కావడంతో వరద నీరు ఇండ్లల్లోకి చేరింది. ఇండ్లల్లోకి నీరు రావడానికి కారణాలపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని వివిధ శాఖల అధికారులను కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. కలెక్టర్ సూచనల మేరకు రెవెన్యూ, మున్సిపాలిటీ, ఇరిగేషన్ శాఖల అధికారులతో పాటు ప్రత్యేకాధికారి పట్టణంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి సర్వే చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలోని 49 వార్డులు ఉండగా 15 వార్డుల్లో వరదల ప్రభావం ఉందని, 254 ఇండ్లు వరద ప్రవాహానికి గురయ్యాయని సర్వేలో నిర్ధారించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో కుంటలు, వాగులు, నాళాల ఆక్రమణలతో వర్షం నీరు బయటకు పోవడానికి అవకాశం లేకపోవడంతో పాటు



చెరువుల బఫర్ జోన్‌లలో నిర్మాణాలు ఉండడంతో వరద నీరు కాలనీలు ఇండ్లలోకి ప్రవేశిస్తుందని అధికారులు నివేదికల్లో పేర్కొన్నారు. ఇందుకు సంబంధించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను అధికారులు కలెక్టర్‌కు చూపించారు. చెరువులు, కుంటల నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని ఆక్రమణలు తొలగించాలని సూచించారు. పలు వార్డుల్లో మురుగు కాల్వలు నిర్మించడంతో పాటు నాళాలు వెడల్పు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎక్కువగా ప్రభావతమైన వార్డు నంబర్ 3లోని జీఎస్ ఎస్టేట్‌లోకి నీరు రాకుండా రిటేయినింగ్ గోడ నిర్మించాలని సూచించారు. ప్రత్యేకాధికారిగా ఉన్న జిల్లా యువజన, క్రీడలు అధికా మున్సిపాలిటీ, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారుల నిర్వహించిన సర్వేపై పలు కాలనీ వాసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సర్వేలో వరద ప్రభావిత ప్రాంతాలను పూర్తిస్థాయిలో పొందుపర్చాలని కోరుతున్నారు. సర్వే నివేదికపై సమావేశం నిర్వహించిన కలెక్టర్ రాజర్షి షా బఫర్‌జోన్, నాళాల ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఈ ఫొటోలోని ప్రాంతం ఆదిలాబాద్ పట్టణంలోని ఆరో వార్డు. ఈ నెల 16న కురిసిన వర్షాలతో ఇక్కడ కుమ్మరికుంట కాలువ పొంగి ప్రవహించింది. మత్తడి ప్రాంతాలు ఆక్రమణలకు గురికావడంతో ఇండ్ల మధ్య నుంచి నడుం లోతుకు పైగా వరద ప్రవహించింది. పలు ఇండ్లల్లోకి నీరు ప్రవేశించగా ఒక ఇల్లు కూలిపోయింది. అధికారులు ఈ వార్డులో పర్యటించి సహాయక చర్యలు చేపట్టారు. బాధితుడికి రూ. 4 వేల ఆర్థికసాయంతో పాటు 10 కిలోల బియ్యం పంపిణీ చేశారు. సర్వేలో ఈ వార్డు ప్రస్తావన లేకపోవడం, ఇండ్లలోకి నీరు ప్రవేశించి నష్టం జరగడం లాంటి వివరాలు లేకపోవడంతో వార్డు వాసులు ఆందోళన చెందుతున్నారు.

## ప్రతీ ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలి.. జగిత్యాల అదనపు కలెక్టర్

**జగిత్యాల :** సమాజంలోని ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకోవాలని జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. జగిత్యాల పట్టణంలో సేవా భారతి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాల్మీకి ఆవాసంలో ఆదివారం శాశ్వత బియ్యం దాతల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా అదనపు కలెక్టర్ బిఎస్ లత పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ బీఎస్ లత చేతుల మీదుగా వాల్మీకి ఆవాసానికి 60 క్వింటాళ్ల బియ్యాన్ని అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామీణ నిరుపేద విద్యార్థులకు ఉచితంగా చక్కటి వసతి, భోజనం ఇతర సదుపాయాలు కల్పించి విలువలతో కూడిన విద్యను అందిస్తూ వారిని ఉన్నతంగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయం అన్నారు. వాల్మీకి ఆవాసానికి తమ వంతు సాయంగా ప్రతీ సంవత్సరం పిల్లలకు అవసరం అయిన




బియ్యాన్ని అందించేందుకు ముందుకు వచ్చిన శాశ్వత బియ్యం దాతల సభ్యులను అదనపు కలెక్టర్ అభినందించారు. సమాజంలోని అట్టడుగు వర్గాలు ప్రభుత్వ సహాయం కోసం ఎదురు చూస్తారని అలాంటి వారందరికీ సహాయం అందించడం ఏ ప్రభుత్వాల వల్ల కూడా సాధ్యం కాదన్నారు. సమాజంలోని అందరి అవసరాలను ప్రభుత్వాలు కొంతమేరకే తీర్చే అవకాశం ఉంటుందన్నారు. సామాజిక స్పృహ కలిగిన ఇలాంటి దాతలు ముందుకు వచ్చి వారిని ఆదుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. విద్య ద్వారానే పేదరికంతోపాటు సమాజంలోని అనేక రుగ్మతలను రూపు మాపవచ్చన్నారు. గత 32 సంవత్సరాలుగా సామాజిక స్పృహ కలిగిన దాతల సహకారంతో గ్రామీణ నిరుపేద విద్యార్థులకు భారతీయ సంస్కృతి విలువలతో కూడిన విద్యను అందిస్తూ వారి జీవితాల్లో వెలుగులు నింపుతున్న వాల్మీకి ఆవాస నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వాల్మీకి ఆవాస అధ్యక్షులు జిడిగే పురుషోత్తం, ఆవాస కోశాధికారి సిరిపురం శ్రీనివాస్, ఎలగందుల కైలాసం, సభ్యులు అశోక్ రావు, సంపూర్ణాచారి, గౌరీశెట్టి హరీష్, గుండా సురేష్, వెంకటేశ్వరరావు, లక్ష్మీనారాయణ తో పాటు శాశ్వత బియ్యం దాతలు నూనె శ్రీనివాస్, వావిలాల శేఖర్, దువ్వ రాజు, ఉత్తూరి ఈశ్వర్, యాంసాని సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీలకు వేళాయె



**కైలాసనగర్:** జిల్లా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో పనిచేస్తున్న క్లస్టర్ కోఆర్డినేటర్(సీసీ)లకు బదిలీలు జరుగనున్నాయి. దీర్ఘకా లంగా ఒకే చోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించాలని ఆదేశిస్తూ ఆ సంస్థ సీఈవో దివ్యదేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. సెర్ప్‌లో ఎల్%-%1, ఎల్%-%2 కేటగిరీ ఉద్యోగులుగా పరిగణించే వారి బది లీల కోసం గత నెలలో ఆప్షన్లను స్వీకరించారు. జి ల్లాలో పనిచేస్తున్న 120 మంది ఆప్షన్లు ఇచ్చారు. అలాగే స్పౌజ్‌గ్రౌండ్, అనారోగ్యం, వైకల్యం, తల్లి దండ్రులు, చిన్నారుల ఆరోగ్యం వంటి అంశాలను కూడా అందులో పొందుపరిచారు. వివరాలను పరి శీలించిన సెర్ప్ అధికారులు బదిలీకి అర్హులైన వారి జాబితా సిద్ధం చేసి జిల్లాకు పంపించారు. వారికి శనివారం మధ్యాహ్నం 2.30గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన కౌన్సెలింగ్ ఉంటుందని డీఆర్డీవో రాథోడ్ రవీందర్ ప్రకటనలో తెలిపారు. అయితే వీరిని సొంత, పనిచేసే క్లస్టర్లు కాకుండా మండలంలోని ఇతర క్లస్టర్లకు బదిలీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఒక్కో క్లస్టర్ పరిధిలో మూడు నుంచి ఐదు స్వయం సహాయక సంఘాలు ఉంటాయి. జిల్లా సెర్ప్ పరిధిలో సీసీలు, మాస్టర్ బుక్ కీపర్లు, పారాలీగల్ మండల సమాఖ్య పరిధిలోని సీసీలంతా కలిపి 109 మంది పని చేస్తున్నారు. ఇకస్వయం సహాయక సంఘాల నిర్వహణకు సంబంధించి ఆడిట్ ప్రక్రియ చేపట్టేందుకు ముగ్గురు సీబీవోలు, కమ్యూనిటీ సూపర్‌వైజర్స్ 8మంది కలిపి 11మంది జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కార్యాలయ కేంద్రంగా విధులు నిర్వహిస్తుంటారు. అయితే వీరికి మా త్రం బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వనున్నా రు. మండలస్థాయిలో పనిచేస్తున్న 109 మంది సీసీ లకు మాత్రమే కౌన్సెలింగ్ ద్వారా వారు ఎంచుకు న్న క్లస్టర్‌కు బదిలీ చేయనున్నారు. వీరికి నాలుగేళ్లకోసారి ఈ ప్రక్రియ నిర్వహిస్తుండగా చివరి సారిగా 2018లో చేపట్టారు. తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో తొలిసారిగా కానున్నాయి.

## వరద దండిగా.. ప్రాజెక్టులు నిండుగా..



ఇటీవల కురిసిన వర్షాలకు ప్రాజెక్టులు గరిష్ట నీటిమట్టానికి చేరుకున్నాయి. ఉమ్మడి జిల్లాలో గోదావరిపై నిర్మించిన ఎల్లంపల్లి, మానేరుపై నిర్మించిన ఎగువ, మధ్య, దిగువమానేరు ప్రాజెక్టులు పూర్తిస్థాయి నీటితో కళకళలాడుతున్నాయి. కామారెడ్డి, ఎగువ ప్రాంతాలు, ఎస్సారెస్పీ, వరద కాలువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. దీంతో మానేరు ప్రాజెక్టుల నుంచి దిగువనకు నీటి విడుదల నిలిపివేశా రు. ఎగువమానేరు పూర్తిస్థాయి నీటి మట్టం 2టీఎంసీలు కాగా, ప్రస్తుతం అదేస్థాయిలో ఉంది. ప్రాజెక్టులోకి 5,798 క్యూసెక్కుల నీరు వస్తుండగా.. 5,798 క్యూసెక్కులు కిందికి వదులుతున్నారు. మిడ్‌మానేరు నుంచి నీటి విడుదల నిలిపివేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 27 టీఎంసీలు కాగా 25 టీఎంసీల నీరుంది. ప్రాజెక్టుకు కీలకమైన మూలవాగు, వరద కాలువ, మానేరు నదుల నుంచి ఇప్పటికీ 20వేల క్యూసెక్కుల నీరు వస్తోంది. మొన్న వర్షాల సమయంలో ఇన్‌ఫ్లో 60వేల క్యూసెక్కుల వరకు వెళ్లిన విషయం తెలిసిందే. 12,930 క్యూసెక్కుల ఔట్‌ఫ్లోను వదులుతున్నారు. లోయర్‌మానేరు డ్యాంకు ఇన్‌ఫ్లో దాదాపుగా నిలిచి పోయింది. నిన్న మొన్నటి వరకు 50వేల క్యూసెక్కులుగా ఉన్న ఇన్‌ఫ్లో మిడ్‌మానేరు నీటిని నిలిపేయగానే 293 క్యూసెక్కులకు పడిపోయింది. మోయతుమ్మెద, మానేరు నుంచి వరద నిలిచిపోయింది. ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండిన నేపథ్యంలో వా నాకాలం, యాసంగి వరకు వ్యవసాయానికి ఇబ్బంది లేదని నీటిపారుదలశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వరద అనూహ్యంగా పెరిగింది. మహారాష్ట్రలో కురుస్తోన్న భారీ వర్షాలతో గోదావరికి వరదపోటు పెరగడమే ఇందుకు కారణం. బుధవారం వరకు 5 లక్షల క్యూసెక్కుల వరకు వచ్చిన వరద ప్రస్తుతం 7,60,652 క్యూసెక్కులకు పెరిగింది. కాగా 7,35,847 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో కిందికి వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 20 టీఎంసీలుకాగా, 13.33 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంచుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రాజెక్టులో పూర్తిస్థాయి నిల్వ ఉన్న సమయంలో ఎగువ నుంచి ఆకస్మికంగా భారీస్థాయిలో వచ్చిన వరదతో గోదావరిఖని పరిసర ప్రాంతాలు జలమయమయ్యాయి. అందుకే, కేవలం 13 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంచి 62 గేట్లకుగాను 37 గేట్ల ద్వారా నీటిని దిగువకు వదులుతున్నారు.

## వీణవంకలో నవరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు.. మహా అన్నదానాలు



**వీణవంక :** వీణవంక మండలంలోని పలు గ్రామాల్లో గణపతి నవరాత్రులలో భాగంగా ఆదివారంప్రత్యేక పూజలు చేసి, మహా అన్నదానాలు చేశారు. వల్బాపూర్ గ్రామం శివాలయం, వీణవంకలో గౌడసంఘం ఆధ్వర్యంలో వేదపండితులతో ప్రత్యేక పూజలు చేసి, మహాన్నదానం చేశారు. వల్బాపూర్‌లో కాసాని ప్రశాంత్, బావు హరీష్, పోతరవేన సురేష్, వీణవంకలో తాళ్లపెల్లి యూత్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన అన్నదానం కార్యక్రమాల్లో వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. నర్సింగాపూర్ గ్రామంలో విఘ్నేశ్వర భక్తమండలి ఆధ్వర్యంలో గణపతి నవరాత్రులలో భాగంగా సుమారు 40 జంటలు అత్యంత పవిత్రంగా జరిగిన హోమంలో పాల్గొన్నారు. అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వల్బాపూర్ శివాలయ కమిటీ సభ్యులు,వీణవంకలో తాళ్ళపెల్లి కుమారస్వామి, నాగరాజు, శివ, సతీష్, తిరుపతి, రాజు, శ్రీనివాస్, సాయి, మహస్త్రశ్, అనిల్, శంకర్, వర్షిత్కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రక్తంలో హిమోగ్లోబిన్ తక్కువైనా ఆ సమస్యలు తప్పవట..




హిమోగ్లోబిన్ అనేది ఎర్ర రక్త కణాలలో కనిపించే ఓ ప్రోటీన్. ఇది శరీరానికి ఆక్సిజన్‌ను తీసుకెళ్లడంలో, కార్బన్ డయాక్సైడ్‌ను ఊపిరితిత్తులకు తిరిగి తీసుకెళ్లడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ముఖ్యంగా అమ్మాయిల శరీరంలో తగినంత హిమోగ్లోబిన్ ఉండటం కూడా చాలా ముఖ్యం. పీరియడ్స్, గర్భధారణ, ప్రసవ సమయంలో హిమోగ్లోబిన్ పాత్ర ఎంతో కీలకం. ఈ సమయంలో శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు తక్కువగా ఉండటం వల్ల అలసట, బలహీనత, తల తిరగడం, శ్వాస ఆడకపోవడం వంటి సమస్యలు వస్తాయి. శరీరంలో హిమోగ్లోబిన్ లేకపోవడం అనేది.. ఐరన్ లోపం వల్ల కలిగే రక్తహీనత వల్ల వస్తుంది. ఇది అమ్మాయిల ఋతు చక్రాలను కూడా ప్రభావితం చేస్తుంది. దీనివల్ల అమ్మాయిలకు ఋతుచక్రాలు సక్రమంగా రావు. ఒక్కోసారి పూర్తిగా ఆగిపోతాయి కూడా. శరీరం అంతటా, పునరుత్పత్తి అవయవాలకు ఆక్సిజన్‌ను తీసుకువెళ్ళే హిమోగ్లోబిన్ ఉత్పత్తికి ఐరన్ చాలా అవసరం. అందువల్ల కాలక్రమేణా, మహిళల్లో హిమోగ్లోబిన్ లోపం వల్ల రక్తంలో తగినంత ఆక్సిజన్ అందదు. ఇది పీరియడ్స్ సమయంలో రక్త ప్రవాహాన్ని ప్రభావితం చేస్తుంది. దీనివల్ల క్రమరహిత పీరియడ్స్ వస్తాయి. గైనకాలజిస్టుల ప్రకారం.. మహిళల శరీరంలో హిమోగ్లోబిన్ లోపానికి కారణాలలో ఐరన్, ఫోలేట్ వంటి అనేక రకాల విటమిన్లు, ముఖ్యమైన పోషకాల లోపం ఒకటి. రక్తంలో హిమోగ్లోబిన్ లోపం అనేది ఏదైనా అనారోగ్యం కారణంగా శరీరంలో రక్తం లేకపోవడం వల్ల వస్తుంది. ముఖ్యంగా అధిక రుతుస్రావం ఉన్న స్త్రీలలో కూడా హిమోగ్లోబిన్ లోపం ఉంటుంది. గర్భధారణ, తల్లిపాలు ఇవ్వడం, వేగంగా బరువు పెరగడం వంటి శరీరంలోని మార్పులు కూడా హిమోగ్లోబిన్ లోపానికి కారణమవుతాయి. తలసేమియా వంటి వ్యాధులతో బాధపడేవారిలో తక్కువ హిమోగ్లోబిన్ ఉండటం సాధారణం. మహిళల శరీరంలో ఐరన్ లోపం కూడా తక్కువ హిమోగ్లోబిన్‌కు ప్రధాన కారణం. కీమోథెరపీ, రక్తం పలుచబడే మందుల వల్ల కూడా హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గుతాయి. శరీరంలో హిమోగ్లోబిన్ తక్కువగా ఉండటానికి అతిపెద్ద కారణం ఐరన్ లోపం. కాబట్టి మీ ఆహారంలో ఐరన్ అధికంగా అందించే వాటిని చేర్చుకోవాలి. టోఫు, ఖర్జూరాలు, బ్రోకలీ, గ్రీన్ బీన్స్, డ్రై ఫ్రూట్స్, గింజలు మొదలైన వాటిని మీ ఆహారంలో చేర్చుకోవాలి. ఐరన్ శోషణలో విటమిన్ సి ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కాబట్టి విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, నిమ్మకాయలు, కివి, బొప్పాయి, క్యాప్సికమ్‌ను ఆహారంలో చేర్చుకోవాలి. హిమోగ్లోబిన్ ఉత్పత్తికి ఫోలేట్ ఒక ముఖ్యమైన పోషకం. అందువల్ల ఆహారంలో ఆకుకూరలు, వేరుశెనగలు, బియ్యం, కిడ్నీ బీన్స్, అవకాడో, అరటిపండ్లు, బ్రోకలీని చేర్చుకోవచ్చు. అన్నింటికంటే ముఖ్యంగాశరీరంలో హిమోగ్లోబిన్ స్థాయి చాలా తక్కువగా ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. హిమోగ్లోబిన్ పెంచడానికి ఐరన్ సప్లిమెంట్లను కూడా తీసుకోవచ్చు.

# పీరియడ్స్ సమయంలో తల స్నానం చేస్తే ఏమవుతుంది?



పీరియడ్స్ సమయంలో కొందరికి తీవ్రంగా కడుపు నొప్పి, తలనొప్పి వంటి వివిధ సమస్యలు తలెత్తుతాయి. అయితే మన సమాజంలో ఋతుస్రావం గురించి అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయి. ఈ సమయంలో మహిళలు కూరగాయలను ముట్టుకోకూడదని, మతపరమైన కార్యక్రమాలలో పాల్గొనకూడదని కొందరు అంటుంటారు. ప్రతి నెలా అమ్మాయిల లైఫ్‌లై జరిగే సహజ ప్రక్రియల్లో పీరియడ్స్ ఒకటి. సాధారణంగా ఇది నాలుగు నుంచి ఐదు రోజుల పాటు ఉంటుంది. ఈ సమయంలో కొందరికి తీవ్రంగా కడుపు నొప్పి, తలనొప్పి వంటి వివిధ సమస్యలు తలెత్తుతాయి. అయితే మన సమాజంలో ఋతుస్రావం గురించి అనేక అపోహలు ప్రచారంలో ఉన్నాయి. ఈ సమయంలో మహిళలు కూరగాయలను ముట్టుకోకూడదని, మతపరమైన కార్యక్రమాలలో పాల్గొనకూడదని కొందరు అంటుంటారు. ఇలాంటి వివిధ మూఢనమ్మకాల్లో ఒకటి.. పీరియడ్స్ సమయంలో తలస్నానం చేయకూడదు. తల స్నానం చేస్తే ఆరోగ్యానికి హానికరమని పెద్దలు సైతం అంటుంటారు. చాలా మంది పీరియడ్స్ సమయంలో తల స్నానం చేయడానికి నిరాకరిస్తారు. కానీ వైద్యుల అభిప్రాయం ప్రకారం.. దీనికి ఎటువంటి శాస్త్రీయ ఆధారం లేదు. చల్లటి నీరు పీరియడ్స్ నొప్పిని మరింత తీవ్రం చేస్తుందని, రక్త ప్రవాహానికి అంతరాయం కలిగిస్తుందని కూడా చెబుతుంటారు. కానీ దీనికి వైద్య ఆధారాలు లేవు. అంతేకాకుండా స్నానం, పీరియడ్స్ మధ్య ప్రత్యక్ష శాస్త్రీయ సంబంధం అంటూ ఏదీ లేదు. అయితే కొంతమంది మహిళలు ఈ సమయంలో స్నానం చేసేందుకు భయపడతారు. ఎందుకంటే ఈ సమయంలో వారి శరీరంలో రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. అలాంటి సమయంలో స్నానం చేయడం వల్ల పరిస్థితి మరింత దిగజారిపోతుంది. ఈ ప్రక్రియ శారీరక అలసటకు కూడా దారితీస్తుంది. అంతేకాకుండా, బహిష్టు సమయంలో సంభవించే హార్మోన్ల మార్పులు, శారీరక అసౌకర్యం కారణంగా మహిళలకు విశ్రాంతి చాలా అవసరం. కాబట్టి స్నానం చేయడం వల్ల శరీరం మరింత బలహీనపడుతుంది. కాబట్టి ఇలాంటి వారు తల స్నానం చేయకపోవడమే మంచిది. పీరియడ్స్ సమయంలో స్నానం చేయడం వల్ల సంతానోత్పత్తిపై, గర్భాశయంపై ఎలాంటి ప్రభావం ఉండదని డాక్టర్ జ్యోతి చెబుతున్నారు. కానీ ఇది శరీర ఉష్ణోగ్రత, రక్త ప్రసరణపై ప్రభావం చూపుతుంది. చల్లటి నీటితో స్నానం చేయడం వల్ల మాత్రమే ఈ అసౌకర్యం కలుగుతుంది. చల్లటి నీటికి బదులుగా గోరువెచ్చని నీరు, కొద్దిగా వేడి నీటిని వాడటం వల్ల ఎటువంటి సమస్యలు ఉండవని నిపుణులు అంటున్నారు. పీరియడ్స్ సమయంలో పరిశుభ్రత చాలా ముఖ్యమని వైద్యులు అంటున్నారు. స్నానం చేయడం వల్ల శరీరానికి రిఫ్రెష్ లభించడమే కాకుండా అసౌకర్యం, తేలికపాటి నొప్పుల నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది. ముఖ్యంగా గోరువెచ్చని నీరు కండరాలను సడలించి, శారీరక నొప్పిని తగ్గిస్తుంది. మొత్తంమీద ఈ సమయంలో స్నానం చేయడం పూర్తిగా సురక్షితం. ఇది శరీర పరిశుభ్రతకు చాలా మంచిది. కాబట్టి శాస్త్రీయ ఆధారం లేకుండా మూఢనమ్మకాలను నమ్మవద్దు. అంతేకాకుండా ఋతుస్రావం సమయంలో వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించడం చాలా ముఖ్యం. నిల్వ నీటితో స్నానం చేయకూడదు. గోరువెచ్చని నీటితో స్నానం చేయడం మంచిది.



# జ్వరం తగ్గినా పొడి దగ్గు వేధిస్తోందా?

జ్వరం వచ్చి తగ్గిపోయిన తర్వాత కూడా దగ్గు తీవ్రంగా వేధిస్తూ ఉంటుంది. ఈ పొడి దగ్గు కొన్ని వారాల పాటు కొనసాగి అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ముఖ్యమైన సందర్భాల్లో ఆగకుండా వచ్చే దగ్గు ఇబ్బంది పెడుతుంటుంది. జ్వరం వచ్చి తగ్గిపోయిన తర్వాత కూడా దగ్గు తీవ్రంగా వేధిస్తూ ఉంటుంది. ఈ పొడి దగ్గు కొన్ని వారాల పాటు కొనసాగి అసౌకర్యాన్ని కలిగిస్తుంది. అసలు జ్వరం పోయిన తర్వాత ఈ దగ్గు ఎందుకు వస్తుంది? దీనికి ఇంట్లో పాటించాల్సిన నివారణోపాయాలు ఏమిటి? ఈ ప్రశ్నలకు జవాబులు తెలుసుకుందాం.జ్వరం తగ్గినా కొంతమందిని పొడి దగ్గు తీవ్రంగా వేధిస్తుంది. ఇది చాలామందిలో కనిపించే సాధారణ సమస్య. ముఖ్యంగా జ్వరం వచ్చినప్పుడు శరీరంలో ఏర్పడే మార్పుల వల్ల ఈ దగ్గు వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఈ పొడి దగ్గు కొన్ని వారాలపాటు కొనసాగవచ్చు.

జ్వరం తగ్గిన తర్వాత దగ్గు రావడానికి ప్రధాన కారణం పోస్ట్-వైరల్ దగ్గు. జ్వరానికి కారణమైన వైరస్లు శ్వాసనాళాల్లో వాపు కలిగిస్తాయి. జ్వరం తగ్గాక కూడా ఈ వాపు పూర్తిగా పోవడానికి కొంత సమయం పడుతుంది. ఈ కారణంగా శ్వాసనాళాలు సున్నితంగా మారి, చిన్నపాటి ప్రేరణలకే దగ్గు వస్తుంది. గొంతు వెనుక భాగంలో స్రావాలు జారి, ఇరిటేషన్ కలిగించడం వల్ల కూడా దగ్గు వస్తుంది. దీన్నే పోస్ట్ నాసల్ డ్రిప్ అంటారు. పొడి దగ్గు తగ్గించడానికి ఇంట్లోనే కొన్ని చిట్కాలు పాటించవచ్చు.తేనె వినియోగం: గోరువెచ్చని నీటిలో కొద్దిగా తేనె కలిపి తాగితే గొంతుకు ఉపశమనం లభిస్తుంది.ఉప్పు నీటితో పుక్కిలించడం: గోరువెచ్చని ఉప్పు నీటితో పుక్కిలించడం వల్ల గొంతులోని వాపు తగ్గుతుంది.ఆవిరి పట్టడం: వేడి నీటిలో ఆవిరి పట్టడం వల్ల శ్వాసనాళాలు శుభ్రపడతాయి.నీరు ఎక్కువగా తాగడం: శరీరం డీహైడ్రేషన్ కాకుండా చూసుకోవాలి. ఇది గొంతు పొడిబారకుండా కాపాడుతుంది.పొగాకుకు దూరం: పొగతాగడం వల్ల దగ్గు మరింత ఎక్కువవుతుంది. దీనికి దూరంగా ఉండాలి. ఈ చిట్కాలు పాటించినా దగ్గు తగ్గకపోతే లేదా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా ఉంటే వైద్య సలహా తీసుకోవడం తప్పనిసరి.

# చెవి ఆరోగ్యానికీ ఉందో డైట్.. డాక్టర్లు చెప్తోన్న సూపర్ ఫుడ్స్..!

మన చెవులు నిరంతరం శబ్దాలతో పోరాడుతూనే ఉంటాయి. వినికిడి లోపం అనేది వయసుతో సంబంధం లేకుండా చాలా మందిలో కనిపిస్తుంది. అయితే, కొన్నిసార్లు ఈ సమస్యకు సరైన ఆహారం తీసుకోకపోవడం కూడా ఒక కారణం అవుతుంది. ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ శ్రీ రావు, చెవి ఆరోగ్యాన్ని కాపాడటానికి సహాయపడే కొన్ని ఆహారాల గురించి వివరించారు. ఈ ఆహారాలను రోజూ తీసుకోవడం వల్ల వినికిడి సమస్యలను నివారించవచ్చని ఆమె చెప్పారు.నిరంతరం శబ్దాలతో ఉండే ప్రస్తుత ప్రపంచంలో చెవుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. వినికిడి లోపానికి వంశపారంపర్య, వయసు పెరగడం, శబ్ద కాలుష్యం వంటివి కారణాలు. అయితే, మన అదుపులో ఉండే కొన్ని విషయాలు కూడా ఉన్నాయి. అవే మనం తినే ఆహారం. మనం తీసుకునే ఆహారం చెవుల ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. అందుకే, విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు ఉన్న పోషక ఆహారం తీసుకోవడం చాలా ముఖ్యం. ప్రముఖ కాక్లియర్ ఇంప్లాంట్ స్పెషలిస్ట్, ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ శ్రీ రావు, చెవుల ఆరోగ్యాన్ని కాపాడే నాలుగు ఆహార పదార్థాలను పంచుకున్నారు. ఆరోగ్యకరమైన వినికిడి కోసం ఈ నాలుగు ఆహారాలు ప్రతిరోజు తినాలని డాక్టర్ సూచించారు. ఆకుకూరలు కేవలం కళ్ళు, ఎముకలు, గుండెకు మాత్రమే కాదు, చెవులకు కూడా మంచిది. ముఖ్యంగా పాలకూర చెవుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. డాక్టర్ రావు ప్రకారం, ఆకుకూరలలో బి12, ఫోలేట్ అధికంగా ఉంటాయి. అవి కణాల ఆరోగ్యానికి చాలా ఉపయోగపడతాయి. శబ్ద కాలుష్యం, వయసుతో వచ్చే వినికిడి లోపాలను ఇవి నివారిస్తాయి. ఈ ఎన్‌టీ సర్జన్ ప్రకారం, ఆహారంలో చేపలు, గుడ్లు చేర్చుకోవడం చెవులకు ఆరోగ్యం. వీటిలో ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్, విటమిన్ బి12 అధికంగా ఉంటాయి. ఈ పోషకాలు యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కలిగి ఉంటాయి. ఇవి చెవి ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ప్రతిరోజూ పండ్లు, కూరగాయలు తినడం చాలా ముఖ్యం. అవి కేవలం జీర్ణక్రియకు మాత్రమే కాదు, చెవులకు కూడా పోషకాలను అందిస్తాయి. డాక్టర్ రావు కొన్ని పండ్లు, కూరగాయలను సూచించారు. అరటిపండు తినడం వల్ల చెవుల వ్యాధులు రాకుండా ఉంటాయని ఆమె చెప్పారు. నారింజ, చిలగడదుంపలు కూడా ఆమె జాబితాలో ఉన్నాయి. వీటిలో పొటాషియం అధికంగా ఉంటుంది, ఇది లోపలి చెవిలో ద్రవ సమతుల్యతకు సహాయపడుతుంది. ప్రతిరోజు కొన్ని గింజలు, విత్తనాలు తినడం చెవులకు చాలా ఉపయోగకరం. డాక్టర్ గుమ్మడి గింజలు, అవిసె గింజలు, జీడిపప్పు, బాదం వంటివి తినమని సూచించారు. “వీటిలో మెగ్నీషియం, జింక్ పుష్కలంగా ఉంటాయి. వీటిని సూపర్ ఫుడ్స్ అంటారు. ఇవి శబ్దం వల్ల వచ్చే వినికిడి లోపాన్ని నివారించడంలో సహాయపడతాయి” అని ఆమె వివరించారు.



## బిజినెస్

### సెప్టెంబర్‌లో సెలవులున్నాయా? ట్రేడింగ్ ఆగుతుందా?



వినాయక చవితితో ఆగస్టు నెలాఖరులో ప్రారంభమైన పండుగ సీజన్ సెప్టెంబర్, అక్టోబర్ వరకు కొనసాగనుంది. ఈ నేపథ్యంలో చాలా మంది ఇన్వెస్టర్లు తదుపరి స్టాక్ మార్కెట్ సెలవుల గురించి ఆలోచిస్తున్నారు. సెప్టెంబర్ నెలలో ఏమైనా సెలవులు ఉన్నాయా.. ఎన్ని రోజులు ట్రేడింగ్ అందుబాటులో ఉంటుంది? అన్న సందేహాలుంటే ఈ కథనంలో తెలుసుకోండి. గణేష్ చతుర్థి సందర్భంగా ఆగస్టు 27 బుధవారం స్టాక్ మార్కెట్‌కు సెలవు వచ్చింది. తదుపరి మార్కెట్ సెలవు సెప్టెంబర్ లో కాకుండా అక్టోబర్ లో వస్తుందని ఇన్వెస్టర్లు గమనించాలి. అయితే, రెగ్యులర్ వారాంతపు సెలవులను పరిగణనలోకి తీసుకుంటే, సెప్టెంబర్ నెలలో ఎనిమిది రోజులు భారత స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్ అందుబాటులో ఉండదు. వారాంతాలు మినహా అక్టోబర్ లో మూడు రోజుల పాటు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ రెండు స్టాక్ ఎక్స్చేంజ్‌లు ట్రేడింగ్ కు మూతపడతాయని ఇన్వెస్టర్లు గమనించాలి. దసరా, దీపావళి, బలిప్రతిపాద వంటి పండుగ రోజులతో పాటు గాంధీ జయంతిని పురస్కరించుకుని జాతీయ సెలవు దినాలను ఈ సెలవుల్లో చూడవచ్చు.

### యాప్‌లపై కొరడా.. ప్లే స్టోర్ నుంచి 77 డేంజరెస్ యాప్‌లు తొలగింపు..!



యాప్‌లపై టెక్ దిగ్గజం గూగుల్ కొరడా ఝుళిపించింది. ప్లే స్టోర్ నుంచి గూగుల్ 77 ప్రమాదకరమైన యాప్‌లను తొలగించింది. ఆయా యాప్‌లన్నీ వినియోగదారుల భద్రత, గోప్యతకు ముప్పుగా మారడంతో చర్యలు తీసుకున్నది. ఫోర్బ్స్ నివేదిక ప్రకారం.. గూగుల్ గత సంవత్సరం సుమారు 40 లక్షల యాప్‌లను తొలగించింది. సగటున ప్రతిరోజూ 11వేల యాప్‌లను ప్లే స్టోర్ నుంచి వేటు వేసింది. నివేదిక ప్రకారం.. తొలగించబడిన యాప్‌లలో సగానికి పైగా డేటా భద్రత, గోప్యతా నియమాలను ఉల్లంఘిస్తున్నాయని తేలింది. గూగుల్ గత సంవత్సరం యాప్ ప్లబిషింగ్‌కు సంబంధించి కఠినమైన నియమాలను అమలు చేస్తామని ప్రకటించింది. ఇప్పుడు దాని ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. 2024 ప్రారంభం నాటికి ప్లే స్టోర్‌లో ఉన్న దాదాపు సగం యాప్‌లను తొలగించారు. గూగుల్ ఈ సంవత్సరం దాదాపు 1.55 లక్షల డెవలపర్ ఖాతాలను కూడా బ్లాక్ చేసింది. కంపెనీ ఇప్పుడు సైడ్‌లోడెడ్ యాప్‌లపై కఠినమైన చర్యలు తీసుకుంటోంది. ఇప్పుడు ధ్రువీకరణ ప్రక్రియ ద్వారా వెళ్లే డెవలపర్స్ మాత్రమే యాప్‌లను ప్రచురించగలరని గూగుల్ చెబుతోంది. ప్లే స్టోర్ నుంచి ఒక యాప్ అదృశ్యమైతే.. దాని అర్థం డెవలపర్ దాన్ని తీసివేసినట్లు కాదని గూగుల్ వినియోగదారులను హెచ్చరించింది. తరచుగా దీనికి కారణం యాప్ నియమాలను ఉల్లంఘించడమే. అయితే, యాప్ ఇప్పటికే మీ ఫోన్‌లో ఉంటే.. అది రన్ అవుతూనే ఉంటుంది. కానీ, అది మరిన్ని అప్‌డేట్‌లు అందవు. యాప్ ప్రమాదకరమైనదిగా తేలితే.. ప్లే ప్రొటెక్ట్ దాన్ని అన్ ఇన్‌స్టాల్ చేయమని హెచ్చరిస్తుంది అని కంపెనీ స్పష్టం చేసింది. కానీ, అలాంటి హెచ్చరిక రాకపోతే యాప్ భద్రతా అప్‌డేట్స్ లేకుండా మీ ఫోన్‌లో రన్ అవుతూనే ఉంటుంది. యూజర్లు సురక్షితంగా డౌన్‌లోడ్ చేసుకునే అలవాటును మార్చుకోవాలని నిపుణులు అంటున్నారు. యాప్‌లను డౌన్‌లోడ్ చేస్తున్నప్పుడు అనుమతులను తనిఖీ చేయాలని.. రివ్యూలను చదవాలని.. విశ్వసనీయ డెవలపర్‌ల నుంచి మాత్రమే యాప్‌లను ఇన్‌స్టాల్ నివేదిక పేర్కొంది. ఆండ్రాయిడ్ అథారిటీ నివేదిక ప్రకారం.. గూగుల్ ప్రస్తుతం ప్లే స్టోర్‌లో కొత్త 'అన్‌ఇన్‌స్టాల్' బటన్‌ను పరీక్షిస్తోంది. ఈ బటన్ యాప్ పేజీలో నేరుగా కనిపిస్తుంది. తద్వారా వినియోగదారులు తమ ఫోన్ నుంచి ఏదైనా యాప్‌ను వెంటనే తీసివేసే అవకాశం ఉంది.

# ట్యాబ్లెట్ పీసీల మార్కెట్ డౌన్

**ప్రథమార్ధంలో 32.3 శాతం క్షీణత**

**మార్కెట్ లీడరుగా శాంసంగ్**

**ఐడీసీ నివేదికలో వెల్లడి**



**న్యూఢిల్లీ:** ప్రస్తుత ఏడాది ప్రథమార్ధంలో దేశీయంగా ట్యాబ్లెట్ పీసీల మార్కెట్ 21.5 లక్షల యూనిట్లకు పరిమితమైంది. గతేడాది ఇదే వ్యవధితో పోలిస్తే 32.3 శాతం క్షీణించింది. మార్కెట్ రీసెర్చ్ సంస్థ ఇంటర్నేషనల్ డేటా కార్పొరేషన్ (ఐడీసీ) రూపొందించిన వరల్డ్‌వైడ్ క్వార్టర్లీ పర్సనల్ కంప్యూటింగ్ డివైజ్ ట్రాకర్ నివేదికలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. అమ్మకాలు నెమ్మదించినప్పటికీ 41.3 శాతం మార్కెట్ వాటాతో శాంసంగ్ అగ్రస్థానంలో కొనసాగగా, 12.3 శాతంతో లెనొవొ రెండో స్థానంలో నిల్చింది. 11.8 శాతం మార్కెట్ వాటాతో యాపిల్ మూడో స్థానంలో ఉంది. "భారత్‌లో ట్యాబ్లెట్ మార్కెట్ (డిటాచబుల్, స్లేట్ ట్యాబ్లెట్స్ కలిపి) 2025 ప్రథమార్ధంలో 21.5 లక్షల యూనిట్లుగా నమోదైంది. వార్షికంగా చూస్తే 32.3 శాతం తగ్గింది. 2025 రెండో త్రైమాసికంలో మార్కెట్ గణనీయంగా నెమ్మదించింది. వార్షిక ప్రాతిపదికన 42.1 శాతం క్షీణించింది. 2025 తొలి త్రైమాసికంలో 18.4 శాతం నెమ్మదించింది" అని ఐడీసీ నివేదిక తెలిపింది. డిటాచబుల్ ట్యాబ్లెట్ సెగ్మెంట్ వార్షికంగా 18.9 శాతం పెరగ్గా, స్లేట్ ట్యాబ్లెట్ విభాగం గణనీయంగా 44.4 శాతం క్షీణించడంతో మొత్తం అమ్మకాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. కమర్షియల్ సెగ్మెంట్‌లో 47.9 శాతం, వినియోగదారుల సెగ్మెంట్‌లో 37.6 శాతం వాటాతో శాంసంగ్ అగ్రస్థానంలో నిల్చింది. ప్రభుత్వ రంగానికి సంబంధించిన విద్యా ప్రాజెక్టులతో పాటు ఆన్‌లైన్ మాధ్యమాల ద్వారా దూకుడుగా విక్రయ వ్యూహాలు అమలు చేయడం ఇందుకు తోడ్పడింది. 2025 రెండో త్రైమాసికంలోనూ 40.8 శాతం మార్కెట్ వాటాతో శాంసంగ్ ఆధిపత్యం కొనసాగించింది. యాపిల్‌కు కొత్త మోడల్స్ దన్ను కమర్షియల్ సెగ్మెంట్‌లో ఇటు చిన్న, మధ్య తరహా సంస్థలతో పాటు అటు కంపెనీల విభాగంలోనూ లెనొవొ మెరుగ్గా రాణించింది. మొత్తం మార్కెట్లో 12.3 శాతం వాటా దక్కించుకుంది. ఇక 11.8 శాతం మార్కెట్ వాటాతో యాపిల్ మూడో స్థానంలో నిల్చిందని ఐడీసీ నివేదిక తెలిపింది. కన్జూమర్ సెగ్మెంట్‌లో యాపిల్ వాటా 14.4 శాతంగా నిల్చింది. కొత్త ఐప్యాడ్ మోడల్స్, విద్యార్థులకు డిస్కౌంట్ ప్రోగ్రాంలు ఇందుకు తోడ్పడ్డాయి. కమర్షియల్ సెగ్మెంట్లో కంపెనీ వాటా 7.3 శాతానికి పెరిగింది. అటు ఐడీసీ అంచనాల ప్రకారం షావోమీ, ఏసర్ మార్కెట్ వాటాలు వరుసగా 11.4 శాతం, 9.1 శాతంగా ఉన్నాయి. ట్యాబ్లెట్ పీసీ సెగ్మెంట్లో ఏసర్ అత్యధికంగా నష్టపోయింది. అమ్మకాలు 73 శాతం క్షీణించాయి.

# ఐటీఆర్ నుంచి క్రెడిట్ కార్డుల వరకు..! సెప్టెంబర్ ఒకటి నుంచి మారనున్న రూల్స్ ఇవే..!

ఈ ఆర్థిక సంవత్సరంలో మరో నెల గడిచిపోయింది. రేపటి నుంచి సెప్టెంబర్ మాసం మొదలుకానున్నది. సెప్టెంబర్ నుంచి పలు రూల్స్ మారనున్నాయి. మారనున్న నిబంధనలు రోజువారీ జీవితంపై ప్రత్యక్ష ప్రభావం చూపనున్నాయి. సెప్టెంబర్ నెలలో ఆదాయపు పన్ను రిటర్న్‌లు, యూపీఎస్, క్రెడిట్ కార్డులకు సంబంధించిన నియమాలను మారనున్నాయి. అలాగే, ఎల్‌పీజీ ధరలు సైతం మారే సూచనలున్నాయి. రేపటి నుంచి కొత్తగా మారనున్న రూల్స్ ఏంటో తెలుసుకుందాం రండి..! ఐటీఆర్ దాఖలు చేసేందుకు చివరి తేదీ జులై 30 కాగా.. ఆదాయపు పన్నుశాఖ సెప్టెంబర్ వరకు పొడిగించింది. తప్పనిసరిగా సెప్టెంబర్ 15 లోపు ఐటీఆర్ దాఖలు చేయాల్సి ఉంటుంది. లేకపోతే నోటీసులు జారీ చేసే అవకాశం ఉంది.

**యూపీఎస్-ఎన్‌పీఎస్**





యూపీఎస్ఎన్‌పీఎస్ అంటే నేషనల్ పెన్షన్ సిస్టమ్ కిందకు వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సెప్టెంబర్ 30లోగా ఏకీకృత పెన్షన్ స్కీమ్‌ను ఎంచుకోవాల్సి ఉంటుంది. గతంలో జూన్ 30 వరకు గడువు ఉండగా.. సెప్టెంబర్ 30 వరకు గడువు పొడిగించారు.

**క్రెడిట్ కార్డ్ రూల్స్**

ప్రభుత్వరంగ బ్యాంక్ ఎస్‌బీఐ ఎంపిక చేసిన క్రెడిట్ కార్డుల రూల్స్‌ను మార్పులు చేసింది. సెప్టెంబర్ ఒకటి నుంచి ఈ మార్పులు అమలులోకి రానున్నాయి. రూల్స్ ప్రకారం కొన్ని కార్డుల రివార్డ్ పాయింట్ల నిబంధనలను సవరించింది. ఇకపై డిజిటల్ గేమింగ్, ప్రభుత్వ వెబ్‌సైట్లలో లావాదేవీలపై రివార్డ్ పాయింట్లు పొందలేరు.

**ఎల్‌పీజీ గ్యాస్ ధర..**

సెప్టెంబర్ ఒకటి నుంచి ఎల్‌పీజీ గ్యాస్ ధరల్లో మార్పులు చేసే అవకాశం ఉంది. ప్రతినెలా ఒకటో తేదీన చమురు కంపెనీలు ఎల్‌పీజీ ధరలను సవరించే విషయం తెలిసిందే. ఈ క్రమంలో రేపు ఎల్‌పీజీ ధరలు మారే అవకాశం ఉంది. అలాగే, సీఎన్‌జీ, పీఎన్‌జీ, జెట్ ఇంధన ధరల్లో కూడా మార్పులు ఉండే అవకాశం ఉంది. చమురు కంపెనీలు ధరలు పెంచడం, తగ్గించడం లేదకపోతే యథావిధిగా కొనసాగించే అవకాశం ఉంటుంది.

# బీభత్సం సృష్టించిన రింకూ సింగ్.. ఇక ఆ జట్లకు మూడినట్లే!



ఉత్తర్‌ప్రదేశ్ టీ20 లీగ్ 2025లో టీమిండియా విధ్వంసకర బ్యాటర్ రింకూ సింగ్ ఆకాశమే హద్దుగా చెలరేగుతున్నాడు. ఎన్నో అనుమానాల నడుమ (బ్యాటింగ్ నైపుణ్యంపై) ఈ లీగ్ బరిలోకి దిగిన రింకూ.. తనలోని అత్యుత్తమ టాలెంట్‌ను వెలికి తీసి, తనెంత విలువైన ఆటగాడో మరోసారి జనాలకు రుచి చూపించాడు. ఫినిషర్ అన్న బిరుదుకు రింకూ మరోమారు సార్ధకత చేకూర్చాడు. ఈ లీగ్‌లో ఇప్పటివరకు 7 మ్యాచ్‌లు ఆడిన రింకూ.. 170కి పైగా స్ట్రయిక్‌రేట్‌తో, 59 సగటున సెంచరీ, 2 హాఫ్ సెంచరీల సాయంతో 295 పరుగులు చేశాడు. ఇందులో 20కి పైగా ఫోర్లు, 20కి పైగా సిక్సర్లు ఉన్నాయంటే రింకూ విధ్వంసం ఏ రేంజ్‌లో సాగిందో ఇట్టే అర్థమవుతుంది. గోరఖ్‌పూర్ లయర్స్‌పై రింకూ చేసిన 45 బంతుల శతకం సీజన్ మొత్తానికే హైలైట్‌గా నిలిచింది. తాజాగా రింకూ సృష్టించిన బీభత్సకాండ చూసిన తర్వాత ఆసియా కప్‌లో పాల్గొనే జట్ల బౌలర్లు బెదిరిపోతుంటారు. కాశీ రుద్రాస్‌తో నిన్న జరిగిన మ్యాచ్‌లో రింకూ శివాలెత్తిపోయాడు. కేవలం 48 బంతుల్లో 6 సిక్సర్లు, 6 బౌండరీల సాయంతో అజేయమైన 78 పరుగులు చేసి తన జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఈ ఇన్నింగ్స్‌లో రింకూ గేర్ మార్చిన తీరు అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. 26 పరుగులకే తన జట్టు 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉండగా రింకూ ఎంట్రీ ఇచ్చాడు. తొలుత అతి నిదానంగా ఆడిన రింకూ.. ఆతర్వాత ఒక్కసారిగా పేట్రేగిపోయాడు. తానెదుర్కొన్న 48 బంతుల్లో తొలి 20 బంతుల్లో కేవలం 7 పరుగులే చేసిన రింకూ.. ఆతర్వాత పెను విధ్వంసం సృష్టించాడు. తర్వాతి 28 బంతుల్లో ఏకంగా 71 పరుగులు రాబట్టాడు. తానెదుర్కొన్న చివరి 11 బంతుల్లో రింకూ 4 ఫోర్లు, 5 సిక్సర్లు బాది మరో 26 బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు. రింకూ సృష్టించిన ఈ బీభత్సకాండ ఐపీఎల్‌లో యశ్ దయాల్‌ను చీల్చిచెండాడిన (5 బంతుల్లో 5 సిక్సర్లు) వైనాన్ని గుర్తు చేసింది. తర్వలో ఆసియా కప్ ప్రారంభం కానుండగా.. రింకూ ప్రత్యర్థులను ఇప్పటినుంచే భయపెడుతున్నాడు. వాస్తవానికి రింకూను ఆసియా కప్‌కు ఎంపిక చేయకూడదనే చర్చ నడిచింది. ఇటీవలి కాలంలో అతను చెప్పుకోదగ్గ ఒక్క ప్రదర్శన కూడా చేయకపోవడమే ఇందుకు కారణం. రింకూ స్థానంలో ఆల్‌రౌండర్‌నో లేక శ్రేయస్ అయ్యర్‌నో ఎంపిక చేయాల్సిందని చాలామంది అభిప్రాయపడ్డాడు. అయితే అలాంటి వారి అభిప్రాయాలు తప్పని రింకూ తాజా ప్రదర్శనలతో రుజువు చేశాడు. యూపీ లీగ్‌లో రింకూ బౌలర్‌గానూ తనలోని యాంగిల్‌ను పరిచయం చేశాడు. ఆల్‌రౌండర్‌ను తీసుకుంటే బాగుండేదని భావించే వారిని రింకూ ఈ ర?కంగానూ సమాధాన పరిచాడు. యూపీ లీగ్‌లో మీరట్ మెవెరిక్స్‌కు సారథిగానూ వహిస్తున్న రింకూ.. తన జట్టును అదిరిపోయే విజయాలతో ముందుండి నడిపిస్తున్నాడు. కాశీ రుద్రాస్‌పై విజయం తర్వాత మీరట్ జట్టు పాయింట్ల పట్టికలో రెండో స్థానానికి ఎగబాకింది. ప్రస్తుతం కాశీ రుద్రాస్ మాత్రమే మీరట్ కంటే ముందుంది.

### చరిత్ర సృష్టించిన జింబాబ్వే ప్లేయర్.. అంతర్జాతీయ క్రికెట్‌లో అరుదైన ఘనత



జింబాబ్వే ఆటగాడు బ్రెండన్ టేలర్ ఇటీవలికాలంలో తరుచూ వార్తల్లో నిలుస్తున్నాడు. అవినీతి ఆరోపణల కేసులో మూడున్నరేళ్ల ఐసీసీ నిషేధాన్ని పూర్తి చేసుకున్న అతడు.. కొద్ది రోజుల కిందటే అంతర్జాతీయ క్రికెట్‌లోకి రీఎంట్రీ ఇచ్చాడు. రీఎంట్రీలో దారుణంగా విఫలమైన బ్రెండన్.. తాజాగా అంత ర్జాతీయ క్రికెట్‌లో ఓ అరుదైన మైలురాయిని తాకి మరోసారి వార్తల్లోకెక్కాడు. ఈసారి అతడు జింబాబ్వే తరఫున చారిత్రక మైలురాయిని అందుకున్న ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఇవాళ (ఆగస్ట్ 31) శ్రీలంకతో జరుగుతున్న వన్డేలో బ్రెండన్ అంతర్జాతీయ క్రికెట్‌లో 10000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. జింబాబ్వే క్రికెట్ చరిత్రలో బ్రెండన్‌కు ముందు ఆండీ ఫ్లవర్ (320 ఇన్నింగ్స్‌ల్లో 11580 పరుగులు), గ్రాంట్ ఫ్లవర్ (337 ఇన్నింగ్స్‌లోల? 10028 పరుగులు) మాత్రమే ఈ ఘనత సాధించారు. జింబాబ్వే ఆల్‌టైమ్ గ్రేట్ బ్యాటర్లలో ఒకడైన బ్రెండన్ తన కెరీర్‌లో 320 ఇన్నింగ్స్‌ల్లో 10000 పరుగులు పూర్తి చేసుకున్నాడు. ఓవరాల్‌గా ప్రపంచ క్రికెట్‌లో ఈ ఘనతను ఓ వంద మాత్రమే సాధించారు. జింబాబ్వే తరఫున అత్యధిక వన్డే సెంచరీలు (11) చేసిన ఆటగాడిగా రికార్డు కలిగిన బ్రెండన్.. క్రికెట్ దిగ్గజాలు సచిన్ టెండూల్కర్, సనత్ జయసూర్య తర్వాత అత్యధిక వన్డే కెరీర్ (21 ఏళ్లు) కలిగిన ఆటగాడిగానూ రికార్డుల్లో ఉన్నాడు. మ్యాచ్ విషయానికొస్తే.. శ్రీలంకతో జరుగుతున్న రెండో వన్డేలో బ్రెండన్ టేలర్ 20 పరుగులు చేసి ఔటయ్యాడు. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన జింబాబ్వే.. బెన్ కర్రన్ (79), సికందర్ రజా (59 నాటౌట్) రాణించడంతో నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 277 పరుగులు చేసింది. రెండు మ్యాచ్‌ల ఈ సిరీస్‌లోని తొలి వన్డేలో పర్యాటక శ్రీలంక 7 పరుగుల స్వల్ప తేడాతో గెలుపొందింది.

## స్పోర్ట్స్

### 12 బంతుల్లో 11 సిక్సర్లు.. ఆకాశమే హద్దుగా రెచ్చిపోయిన చిచ్చరపిడుగు..!




ఫార్మాట్ ఏదైనా యువ క్రికెటర్లు ఆకాశమే హద్దుగా చెలరేగుతూ ప్రకంపనలు సృష్టిస్తున్నారు. బౌలర్లను వణికిస్తూ సిక్సర్ల మోతతో విరుచుకుపడూ ఒంటిచేత్తో మ్యాచ్ స్వరూపాన్నే మార్చేస్తున్నారు. తాజాగా కేరళ క్రికెట్ లీగ్‌లో సల్మాన్ నిజార్ తనదైన విధ్వంసక బ్యాటింగ్‌తో ఔరా అనిపించాడు. ఎదుర్కొన్న 12 బంతుల్లో 11 సిక్సర్లు బాదేశాడు. కాలికట్ గ్లోబ్‌స్టార్స్ కెప్టెన్ అయిన సల్మాన్ తమ జట్టుకు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఊచకోతను తలపించిన అతడి బ్యాటింగ్ వీడియో నెట్టింట వైరలవుతోంది. కాలికట్ గ్లోబ్ స్టార్స్ సారథి అయిన సల్మాన్ నిజార్ శనివారం కెరీర్లోనే అత్యుత్తమ ఇన్నింగ్స్ ఆడాడు. అదానీ త్రివేంద్రం రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఓటమి అంచున నిలిచిన జట్టును గెలిపించాడు. 14వ ఓవర్లో అతడు క్రీజులోకి వచ్చే సరికి కాలికట్ టీమ్ స్కోర్.. 76/4. కీలక వికెట్లు పడిన వేళ సల్మాన్ టాప్ గేర్ ఆటతో చెలరేగాడు. డెత్ ఓవర్లో వీరంగం సృష్టించిన అతడు.. 12 బంతుల్లో 11 సిక్సర్లు బాదాడు. ఐపీఎల్ పేసర్ బసిల్ థంపి వేసిన 19వ ఓవర్లో అతడు వరుసగా ఐదు బంతుల్ని స్టాండ్‌లోకి పంపాడు. ఇన్నింగ్స్ చివరి ఓవర్లో ఆరు బంతుల్ని సిక్సర్లుగా మలిచిన అతడు.. ఒక నో బాల్, ఒక వైడ్‌తో కలిపి 40 రన్స్ పిండుకున్నాడు. అతడి అసాధారణమైన బ్యాటింగ్‌తో కాలికట్ గ్లోబ్‌స్టర్స్ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 186 రన్స్ చేసింది. అనంతరం బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి తక్కువ స్కోర్‌కే ప్రత్యర్థిని నిలువరించారు. అదానీ జట్టు బౌలర్లపై ఉప్పెనలా విరుచుకుపడిన సల్మాన్ వచ్చే సీజన్ ఐపీఎల్ వేలంలో భారీ ధర పలకడం ఖాయమనిపిస్తోంది.

## నాకు అలాంటి ఉద్దేశం లేదు..!

## హీరోయిన్ అంజలికి క్షమాపణలు చెప్పిన హీరో పవన్ సింగ్..!

భోజ్‌పురి సూపర్ స్టార్ పవన్ సింగ్ ఎట్టకేలకు దిగివచ్చాడు. ఇటీవల లక్నోలో జరిగిన స్టేజ్ షోలో అసభ్యంగా హీరోయిన్ నడుమును తాకిన విషయం తెలిసిందే. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దాంతో పలువురు హీరో అనుచిత ప్రవర్తనపై సర్వత్రా మండిపడ్డారు. ఈ ఘటన జరిగిన రెండురోజుల తర్వాత పవన్ సింగ్ మౌనం వీడాడు. హీరోయిన్ అంజలి రాఘవన్‌కు బహిరంగంగా క్షమాపణలు చెప్పాడు. నటుడి అనుచిత ప్రవర్తనతో మనస్తాపానికి గురైన హీరోయిన్ అంజలి భోజ్‌పురి పరిశ్రమను వీడుతున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా పోస్ట్‌లో పవన్ సింగ్ స్పందిస్తూ.. 'అంజలి జీ బిజీ షెడ్యూల్ కారణంగా నేను మీ లైవ్ చూడలేకపోయాను. ఈ విషయం నాకు తెలిసినప్పుడు నాకు చాలా బాధగా అనిపించింది. అందరం కళాకారులం కాబట్టి నాకు మీపై ఎలాంటి దురుద్దేశం లేదు. అయినప్పటికీ, నా ప్రవర్తతో మీరు బాధపడి ఉంటే దానికి నేను క్షమాపణలు కోరుతున్నాను' అని పేర్కొన్నారు. అయితే, హీరో పవన్ సింగ్ అంతకు ముందుకు ఓ పోస్ట్ చేశాడు. చేతులు ముడుచుకుని నిలబడి ఉన్న తన చిత్రాన్ని షేర్ చేశాడు. పోస్ట్‌తో పాటు 'ఏక్ కహానీ హై- జిస్ తన్ లగే సో తన్, కోయి నా జానే పీర్ పరాయీ' అని కాప్షన్ పెట్టాడు. లక్నోలో జరిగిన ఓ కార్యక్రమంలో 'సైయాన్ సేవా కరే' పాట ప్రమోషన్ సందర్భంగా ఈ సంఘటన జరిగింది. 'సైయా సేవా కరే' పాట రిలీజ్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అంజలి దగ్గరకు హీరో పవన్ సింగ్ వచ్చాడు. ఆమె అనుమతి లేకుండా ఆమె నడుమును తాకాడు. చీరపై ట్యాగ్ ఉందని, దాన్ని తీసేందుకు అలా చేశానని పవన్ చెప్పినట్లు వీడియోలో వినిపించింది. ఆ క్షణంలో అంజలి నవ్వినప్పటికీ, ఆమె ముఖంలో అసౌకర్యానికి గురైంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. అయితే, ఈ వ్యవహారంలో అంజలిని తప్పుపడుతూ పలువురు మీమ్స్ చేయడంతో మనస్తాపానికి గురైంది. బహిరంగంగా ఎవరో అనుమతి లేకుండా తాకితే దాన్ని ఎవరైనా ఆనందంగా స్వీకరిస్తారా? ఆ సమయంలో కొత్త చీర కావడంతో ట్యాగ్ ఉందేమోనని అనుకున్నాను. కానీ, ఆ తర్వాత ఏమీ లేదని తెలిసి కన్నీళ్లు ఆగలేదు. ఇదేందని నిలదీసేలోగానే పవన్ సింగ్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు' అంటూ చెప్పుకొచ్చింది. ఈ ఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని, అందుకే భోజ్‌పురి సినిమా ఇండస్ట్రీని పూర్తిగా వదిలేయాలని నిర్ణయించుకున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది. ఎవరి అనుమతి లేకుండా వారిని తాకడం ఎప్పటికీ సమంజసం కాదని.. ఇకపై తాను కుటుంబంతో కలిసి హర్యానాలోనే జీవిస్తానని చెప్పుకొచ్చింది. పలువురు అభిమానులు ఆమెకు మద్దతు ప్రకటించారు.






## ఉస్తాద్ భగత్ సింగ్  నుండి అదిరిపోయే పోస్టర్.. ఇక జాతర మొదలు

మొన్నటి వరకు రాజకీయాలతో బిజీ బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ తాను కమిటైన ప్రాజెక్ట్‌లకి బ్రేక్ వేశాడు. ఇటీవల ఒక్కొక్కటి పూర్తి చేస్తూ దూసుకుపోతున్నాడు. హరిహర వీరమల్లు చిత్రం కొద్ది రోజుల క్రితం విడుదల కాగా, ఈ మూవీ అభిమానులని కూడా ఏ మాత్రం అలరించలేకపోయింది. ఇక ఓజీ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కానుంది. ఈ మూవీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ఏ ప్రాజెక్ట్ ప్రకటించినా అది అభిమానులకే కాదు, టాలీవుడ్ మొత్తానికి ఉత్సాహాన్ని కలిగిస్తుందన్న విషయంలో సందేహం లేదు. ఇప్పుడు అదే స్థాయిలో హైప్ తెచ్చుకుంటున్న సినిమా "ఉస్తాద్ భగత్ సింగ్". ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఒకప్పుడు గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన ఈ కాంబో మళ్లీ కలిసి వస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫ్యాన్స్ అయితే ఈ సినిమాను ఒక పండుగలా భావిస్తున్నారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఫ్యాన్స్ ముందుగానే పండుగను స్టార్ట్ చేశారు. కటౌట్లు, ఫ్లెక్సీలు, బ్లడ్ డొనేషన్లు, సోషల్ సర్వీస్ కార్యక్రమాలు మొదలైపోయాయి. ఈ వేడుకలో మేకర్స్ కూడా భాగమవుతూ, ఒకటి తర్వాత ఒకటి సర్ప్రైజ్ గిఫ్ట్లు ఇస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్ ఈ జోష్‌కు మరింత బలాన్నిచ్చింది. ఈ పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ ఒక సాంగ్ షూట్ లుక్‌లో కనిపించగా, ఆయన వింటేజ్ మాస్ స్టైల్, ఎనర్జీ ఫ్యాన్స్‌ను ఫుల్ ఖుషీ చేసింది.

ఈ లుక్‌లోని కాస్ట్యూమ్, పవన్ బాడీ లాంగ్వేజ్ అంతా అభిమానుల్లో ఫుల్ జోష్ కలిగిస్తుంది. సోమవారం సాయంత్రం 4:45 గంటలకు మేకర్స్ "ఫుల్ మీల్స్" అంటూ హైప్ క్రియేట్ చేయడం చూస్తుంటే, ఈ మూవీ కూడా సూపర్ డూపర్ హిట్ కావడం ఖాయం అంటున్నారు. హరీష్ శంకర్ %-% పవన్ కలయిక అంటేనే ఫ్యాన్స్‌కు ప్రత్యేకమైన అంచనాలు ఉంటాయి. "గబ్బర్ సింగ్"లో ఆయన పవన్ మాస్ ఇమేజ్‌ని ఎలా వాడుకున్నారో అందరికీ గుర్తే. ఇప్పుడు మళ్లీ అదే డైరెక్టర్ చేతిలో పవన్ పడడంతో ఈ సినిమా ఫుల్ మాస్ ఎంటర్టైనర్గా వస్తుందన్న ఆశలు పెరిగిపోయాయి. సంగీతం దేవి శ్రీ ప్రసాద్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ, ఆర్ట్ డైరెక్షన్, యాక్షన్ సీక్వెన్సుల విషయంలో మేకర్స్ భారీగా ఖర్చు చేస్తున్నారని సమాచారం. పవన్ కళ్యాణ్ స్టామినాకు తగ్గ రీతిలో గ్రాండ్ విజువల్స్ చూపించేందుకు అన్ని విభాగాలూ జాగ్రత్తలు తీసుకుంటున్నాయట. "ఉస్తాద్ భగత్ సింగ్" సినిమా పవన్ అభిమానుల కోసం ఒక ఫుల్ మాస్ ఫెస్టివల్‌గా మారుతోంది.

## దుబాయ్ బిజినెస్‌మెన్ ప్రేమలో ఈ యంగ్ బ్యూటీ!

టాలీవుడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ రీసెంట్‌గా తన ప్రేమ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త రజిత్ ఇబ్రాన్‌తో రిలేషన్‌లో ఉన్నానని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ ప్రకటనా అనంతరం సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే నివేదా తాజాగా తన ప్రేమాయణంకి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఐదేళ్ల క్రితం దుబాయ్‌లో నిర్వహించిన ఓ రేసింగ్ ఈవెంట్‌లో రజిత్‌ను మొదటిసారి కలిశాను. మొదట మేము మంచి స్నేహితులుగా ప్రారంభించాము. ఆపై సమయం గడుస్తూ అభిప్రాయాలు కలవడం, మనసులు దగ్గర కావడంతో ప్రేమలో పడిపోయాము. మా రిలేషన్ గురించి చాలా తక్కువ మందికే తెలుసు. ఇండస్ట్రీలో కూడా ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు అకస్మాత్తుగా ఈ విషయాన్ని బయటపెట్టడంతో నా మేనేజర్ కూడా షాక్ అయ్యాడు అని చెప్పింది. ఈ ఏడాది అక్టోబర్‌లో మేం ఎంగేజ్‌మెంట్ చేసుకోబోతున్నాం. పెళ్లి జనవరిలో ప్లాన్ చేస్తున్నాం. తుది తేదీ ఇంకా ఫిక్స్ కాలేదు కానీ, పెళ్లి పనులు మొదలుపెట్టేశాం. మా ఇరు కుటుంబాలు ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నాయి. మేము సింపుల్‌గా, కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య పెళ్లిని జరుపుకుంటాం అని నివేదా వివరించింది. మధురైలో జన్మించి పెరిగిన నివేదా, 'మెంటల్ మదిలో' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో హీరోయిన్‌గా అడుగుపెట్టింది. అనంతరం 'చిత్రలహరి', 'బ్రోచేవారేవరురా', 'అల వైకుంఠపురములో', 'రెడ్', 'పాగల్', 'విరాటపర్వం', 'దాస్ కా ధమ్కీ' వంటి సినిమాల్లో నటించింది. సినిమాల పరంగా టాలెంట్ ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె చేతిలో కొత్త ప్రాజెక్టులు లేనట్లు తెలుస్తోంది. కార్ రేసింగ్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లోనూ ఆమె ప్రత్యేక ఆసక్తి కలిగి ఉంది. ఇకపై ఆమె వ్యక్తిగత జీవితం కొత్త అధ్యాయానికి తెరలేవనుంది. పెళ్లి తర్వాత నివేదా సినిమాలు చేస్తుందా లేదా అనేది చూడాలి.






## వరుణ్ సందేశ్ 'కానిస్టేబుల్' మూవీ ట్రైలర్ రిలీజ్

వరుణ్ సందేశ్, మధులిక వారణాసి జంటగా నటించిన సినిమా 'కానిస్టేబుల్'. ఆర్యన్ సుభాన్ దర్శకత్వం వహించగా బలగం జగదీష్ నిర్మించారు. థ్రిల్లర్ కథతో తీసిన ఈ చిత్ర ట్రైలర్ విడుదల కార్యక్రమం హైదరాబాద్‌లో ఆదివారం జరిగింది. సీనియర్ నటుడు రాజేంద్ర ప్రసాద్ ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్ లాంచ్ చేశారు. ఇప్పటివరకు లవర్ బాయ్‌గా నాకు పేరుంది. సినిమాతో పాటు నా పాత్ర కూడా బాగా వచ్చిందని మూవీ టీం చెప్పడంతో చాలా సంతోషం అనిపించింది. తప్పకుండా మా అంచనాలని 'కానిస్టేబుల్' నిలబెడుతుందని అనుకుంటున్నానని వరుణ్ సందేశ్ చెప్పుకొచ్చాడు. మా అందరి కెరీర్ మలుపుతిప్పే చిత్రం ఇది అవుతుంది. వరుణ్ సందేశ్‌కి కూడా కమ్ బ్యాక్ ఇస్తుందని దర్శకుడు ఆర్యన్ సుభాన్ అన్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com